

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50

సంపుటి: 16 | సంచిక: 310



పడగొట్టిన రిలయన్స్..

స్టాక్ సూచీలు మంగళవారం ఒక శాతం పతనమయ్యాయి -13లో



214 పరుగుల తేడాతో...

అండర్-19 ప్రపంచకప్ టోర్నీ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై భారత్ విజయం -12లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



తోటి టీచర్లను కాల్చిచంపి..

ప్రేమ వ్యవహారం ఇద్దరు టీచర్లను బలిగొంది. ఇద్దరు టీచర్లను కాల్చి చంపిన మరో టీచర్ ఆత్మహత్యాయత్నం చేశాడు.

- వివరాలు 6లో



ఇమ్రాన్‌కు పదేళ్ల జైలు

అధికార పత్రాల లీకేజీ కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించింది.

- వివరాలు 6లో



సోరెన్ ఢిల్లీ ఇంట్లో ఈడీ సోదాలు

జార్ఖండ్ సీఎం సోరెన్ ఇంట్లో ఈడీ సోదాలు నిర్వహించింది. రూ.36 లక్షలు, బీఎండబ్ల్యూ కారు, కీలకపత్రాలు లభించాయి.

- వివరాలు 6లో



ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

బీజాపూర్, సుక్మా జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు నేలకొరిగారు.

- వివరాలు 6లో



ఆగిన ప్రమాణం



గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమెర్ అలీఖాన్ ప్రమాణ స్వీకారానికి మరోసారి ఆటంకం

స్టేటస్‌కో విధించిన హైకోర్టు.. వీరి నియామకాన్ని సవాల్ చేసిన దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ

ఫిబ్రవరి 8 వరకు యథాతథ స్థితికి సీజే ధర్మాసనం ఆదేశం

వాస్తవానికి 29నే ప్రమాణ స్వీకారం కోసం మండలికి వెళ్లిన కోదండరాం, ఆమెర్ అలీఖాన్

అందుబాటులో లేని చైర్మన్.. 31న రావాల్సిందిగా సమాచారం

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఆగిన నేటి ప్రమాణ స్వీకారం

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా నేడు బల్మూరి, మహేశ్‌కుమార్‌ల ప్రమాణం



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ కోటా కింద కొత్తగా శాసనమండలి సభ్యులుగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్ట్ ఆమెర్ అలీ ఖాన్ ప్రమాణ స్వీకారానికి బ్రేక్ పడింది. ఈ విషయంలో యథాతథస్థితి కొనసాగించాలని (స్టేటస్‌కో) ఆదేశిస్తూ ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం మంగళవారం తాత్కాలిక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని, ఆ రోజు పూర్తిస్థాయిలో వాదనలు వింటామని స్పష్టం చేసింది. గతంలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ అభ్యర్థులుగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను సిఫారసు చేస్తూ అప్పటి ప్రభుత్వం గవర్నర్‌కు ప్రతిపాదనలు పంపింది. అయితే 2023 సెప్టెంబర్ 19న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వాటిని తిరస్కరించారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ శ్రవణ్, సత్యనారాయణ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5) ప్రకారం తనకున్న విస్తృత అధికారాల మేరకు ప్రభుత్వ ప్రతిపాదనలను తిరస్కరిస్తున్నట్లుగా గవర్నర్ ప్రకటించడాన్ని వారు సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై గత వారం విచారణ చేపట్టిన సీజే ధర్మాసనం.. తదుపరి విచారణను ఫిబ్రవరి 8కి వాయిదా

మిగతా 2వ పేజీలో ▶

అఖిలపక్ష భేటీలో కేంద్ర మంత్రులు జోషి, రాజ్‌నాథ్, పీయూష్ గోయల్, అర్జున్ రామ్‌మేఘవాల్



నేటి నుంచి

బడ్జెట్ సమావేశాలు

సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరి బడ్జెట్

రేపు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్

- ఫిబ్రవరి 9 వరకు జరగనున్న సమావేశాలు
- ఈసారి ఆర్థిక సర్వే నివేదిక లేదు.. 6లో
- సస్పెండైన ఆ 14 మంది ఎంపీలు మళ్లీ సభకు..

ఈ ఐదింటిపై ఆశలొద్దు!

బడ్జెట్ అనగానే పన్ను శ్లాబులు తగ్గిస్తారనో, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించే చర్యలేవో తీసుకుంటారనో జనం ఆశ పడుతుంటారు. మహిళలు, యువత కోసం ప్రత్యేక పథకాలను ప్రభుత్వం ప్రకటిస్తుందేమోనని ఎదురుచూస్తుంటారు. పైగా మూడు, నాలుగు నెలల్లో ఎన్నికలు ఉండటంతో ఎన్నికల తాయిలాలు బడ్జెట్‌లో కనిపించవచ్చని అందరి అంచనా. అయితే ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే 2024-25 ఆర్థిక సంవత్సర కేంద్ర బడ్జెట్‌లో ఐదు అంశాలపై ఆశలు పెట్టుకోకపోవడమే ఉత్తమమని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ఆ ఐదు అంశాలూ ఏమిటనే దానిపై ప్రత్యేక కథనం..

వివరాలు 6లో

ఏ చర్చకైనా సంసిద్ధం

- అఖిలపక్ష భేటీలో స్పష్టంచేసిన కేంద్ర ప్రభుత్వం
- పలు సమస్యలను లేవనెత్తిన విపక్షాలు
- రాహుల్ యాత్రను సజావుగా సాగనివ్వట్లేదని కాంగ్రెస్ ఆగ్రహం
- కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై వైఖరేమిటో చెప్పాలని పట్టు

6లో

న్యూస్‌రీల్

నవయుగంపై జగన్ సంతకం



దేశంలోనే తొలిసారిగా ఒకేసారి 30.61 లక్షల ఇళ్ల పట్టాలను ఇచ్చి పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు వాటిని అక్కచెల్లెమ్మల పేరు మీద రిజిష్టర్ చేసి మరో చరిత్ర సృష్టించనుంది. తద్వారా పేదలకు ఇచ్చిన ఇళ్లను రిజిష్టర్ చేసిన తొలి ప్రభుత్వంగా సీఎం జగన్ సర్కారు రికార్డుకెక్కనుంది.

- వివరాలు 10లో ▶

కమిటీతోనైనా కథ ముగిసేనా?



నిజాం దక్కన్ షుగర్స్ భవితవ్యం ఏళ్ల తరబడి కొలిక్కిరావట్లేదు. ఈ నేపథ్యంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు నేతృత్వంలో ప్రభుత్వం తాజాగా ఎన్‌డీఎస్ఎల్ 'పునరుద్ధరణ కమిటీ'ని ప్రకటించింది. ఈ కమిటీ రెండు నెలల్లో నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

- వివరాలు 5లో ▶

బెంగళూరు టు హైదరాబాద్



డ్రగ్స్ రాకెట్‌పై నార్సింగి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పట్టుబడిన లావణ్యకు పలువురు టాలీవుడ్ నటులు, వీఐపీలతో పరిచయాలు ఉన్నట్టు గుర్తించారు. లావణ్య, ఉనీత్ రెడ్డిలు బెంగళూరులో రూ.1500లకు గ్రాము చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్‌లో రూ. 6000 వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం.

- వివరాలు 2లో ▶

మళ్లీ పునర్వ్యవస్థీకరణ

నీటిపారుదల శాఖను మళ్లీ పునర్వ్యవస్థీకరించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. తెలంగాణ వచ్చాక చేపట్టిన ప్రాజెక్టులు, తీసుకున్న నిర్ణయాలపై రాష్ట్ర నీటిపారుదలశాఖ సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది. శాఖ పునర్వ్యవస్థీకరణ తర్వాత జరిగిన లాభనష్టాలపై నివేదిక అందిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది.

- వివరాలు 2లో ▶



విభజన హామీల అమలుకు 17 గెలవాలి

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే హామీలన్నీ అమలు 3లో

మోదీని మళ్లీ గెలిపించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం

విలేకరుల సమావేశంలో సీఎం, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

◀ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్

వెళ్లిన వారు వచ్చేయండి

ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ను వీడి వెళ్లిన వారికి తెరుచుకోనున్న ద్వారాలు

ఎలాంటి నిబంధనలు పెట్టని వారిని చేర్చుకునేందుకు ఎన్నికల కమిటీ గ్రీన్‌సిగ్నల్

17 లోక్‌సభ స్థానాలకుగాను 187 పేర్లు ఎన్నికల కమిటీ ముందుకు

- వచ్చే నెల 3 వరకు దరఖాస్తుల స్వీకరణ
- 6న స్క్రీనింగ్ కమిటీకి అభ్యర్థిత్వాల షార్ట్‌లిస్ట్
- రాజ్యసభ అభ్యర్థిత్వాల ఖరారు అధికారం ఏఐసీసీకి..
- పదేళ్లలో విద్యార్థి, ప్రజాసంఘాల నేతల మీద పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరిన సభ్యులు

సాక్షి, హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీని వీడినవారు తిరిగి సొంతగూటికి రావాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో భాగంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ టికెట్ ఇవ్వలేదని, సరైన అవకాశాలు కల్పించలేదనే ఆవేదనతోనే కొందరు పార్టీని వదిలివెళ్లారని, వారిని తిరిగి చేర్చుకోవాలని పీఈసీ సభ్యులను కోరారు. అయితే, ఎలాంటి నిబంధనలు పెట్టకుండా పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నవారిని మాత్రమే చేర్చుకోవాలని సూచించారు. ఈ ప్రతిపాదనకు పీఈసీ అంగీకారం తెలపడంతో ఎన్నికలకు ముందు బయటకు పోయినవారు మళ్లీ వచ్చేందుకు కాంగ్రెస్ ద్వారాలు తెరుచుకున్నట్టయ్యింది. పీఈసీ భేటీలో భాగంగా గత పదేళ్ల కాలంలో విద్యార్థి,

మిగతా 3వ పేజీలో ▶

తాగునీటి కోసం నియోజకవర్గానికో కోటి

- అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- ప్రత్యేక అభివృద్ధి నిధుల్లోంచి ఖర్చు చేయండి
- తాగునీరు అందని గ్రామాల సర్వే నిర్వహించండి
- రోడ్లులేని 422 గ్రామాలు, 3,177 ఆవాసాలకు తారురోడ్లు
- మంత్రులు సీతక్క, కోమటిరెడ్డితో కలసి సమీక్ష

2లో

15 మంది

- బీజేపీ నేత హత్య కేసు..

పీఎఫ్ఐ కార్యకర్తలకు మరణశిక్ష

6లో



2021లో జరిగిన బీజేపీ ఓబీసీ విభాగం నేత రంజిత్ శ్రీనివాసన్ హత్య కేసులో నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)కు చెందిన 15 మంది కార్యకర్తలకు కేరళ కోర్టు మరణశిక్ష విధించింది. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న శ్రీనివాసన్‌ను 2021 డిసెంబర్ 19న ఆయన ఇంట్లో తల్లి, భార్య, కుమార్తె కళ్లెదుటే పీఎఫ్ఐ కార్యకర్తలు మారణాయుధాలతో దారుణంగా చంపారు. ఈ తీర్పుపై శ్రీనివాసన్ కుటుంబంతోపాటు బీజేపీ హర్షం వ్యక్తం చేసింది.

వైద్య విద్యలో 'వెనుకబాటు'




ఎంబీబీఎస్‌లో ఓబీసీలు 24.4%

ఎస్సీ, ఎస్టీలు 12%

ముస్లింలు 3.6%... ఓసీలు 57% ఉన్నట్లు కేంద్రం వెల్లడి

- ఎండీలో బీసీలు 22%.. ఎస్సీ, ఎస్టీలు 11.3%, ఓసీలు 59%..
- ఎంఎస్‌లో బీసీలు 21%... ఎస్సీ, ఎస్టీలు 10%.. ఓసీలు 63%
- డీఎం, ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో 85 శాతం వరకు ఓసీలే



దేశవ్యాప్తంగా తగ్గిపోతున్న అణగారిన వర్గాల విద్యార్థుల సంఖ్య

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా వైద్య విద్యలో అణగారిన వర్గాల సంఖ్య తక్కువగా ఉంటోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, ఇతర మైనారిటీలు తక్కువగా ఉంటున్నారు. ఎంబీబీఎస్‌లో కొంతమేరకు ఫర్వాలేదు కానీ, ఆపై స్థాయి మెడికల్ కోర్సుల్లో ఆయా వర్గాల శాతం తక్కువగా ఉండటంపై సామాజిక కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఇందులో ఓసీలు ఎక్కువగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా విభాగం చేపట్టిన సర్వేలో వెల్లడైంది. 2021-22లో వైద్య కోర్సుల్లో పాసైన వారిని ఆధారంగా చేసుకొని ఈ సర్వే నిర్వహించారు. ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో 75 శాతం కాలేజీలను సర్వే చేశారు. ఎంబీబీఎస్, ఎండీ కోర్సుల్లో

మిగతా 5వ పేజీలో ▶

వ్యవసాయానికి రూ.1.33 లక్షల కోట్ల రుణం



పరిశ్రమలు సహా అన్ని రంగాలకు కలిపి రూ.2.80 లక్షల కోట్లు

వచ్చే ఆర్థిక సంవత్సర రుణ ప్రణాళికలో ఖరారు చేసిన నాబార్డు

గత రుణ ప్రణాళికతో పోలిస్తే రూ.94 వేల కోట్లు అదనం

బ్యాంకుల చేయూత మరింత పెరగాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ. 1.33 లక్షల కోట్ల రుణాలు ఇచ్చేలా జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) రుణ ప్రణాళికను ఖరారు చేసింది. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఇతర రంగాలు సహా మొత్తంగా రూ.2.80 లక్షల కోట్ల రుణాలకు పచ్చజెండా ఊపింది. ఇది గతేడాది రుణ ప్రణాళికతో పోలిస్తే రూ.94 వేల కోట్లు అదనం కావటం విశేషం. మంగళవారం మధ్యాహ్నం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ రుణ ప్రణాళికతో కూడిన ఫోకస్ పేపర్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు.

వ్యవసాయ అనుబంధ రంగాలకే పెద్దపీట

వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల నుంచి భారీ చేయూతనే లభించే అవకాశం ఉంది. రూ.133587.86 కోట్ల రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు నాబార్డు సూచించింది. మొత్తం

మిగతా 10వ పేజీలో ▶

ఇదండీ సంగతి



సోరెన్ కోసం జల్లెడ పడుతున్నారు!

క్లుప్తంగా...

హజ్ యాత్ర-2024కు 7,811 మంది ఎంపిక



సాక్షి, హైదరాబాద్: హజ్ యాత్ర-2024కు రాష్ట్రవ్యాప్తంగా 7,811 మంది యాత్రికులు ఎంపికయ్యారని రాష్ట్ర హజ్ కమిటీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఇర్ఫాన్ షరీఫ్ మంగళవారం తెలిపారు. కేంద్ర హజ్ కమిటీ కంప్యూటరైజ్డ్ పద్ధతిలో డ్రా ద్వారా యాత్రికులను ఎంపిక చేసినట్లు వివరించారు. సౌదీ అరేబియా ప్రభుత్వం ఈ యాత్రకు దేశవ్యాప్తంగా 2.5 లక్షలమంది వచ్చేందుకు అనుమతులు ఇచ్చిందన్నారు. ఇందులో కేంద్ర హజ్ కమిటీ లక్షమంది యాత్రికులను తీసుకెళ్లే అవకాశం ప్రైవేట్ టూర్ ఆపరేటర్లకు ఇవ్వగా, మిగతా 1.5 లక్షల మందికి వివిధ రాష్ట్రాల హజ్ కమిటీ ద్వారా వెళ్లే అవకాశం ఇచ్చిందన్నారు. కేంద్ర హజ్ కమిటీ రాష్ట్రంలోని ముస్లిం జనాభా నిష్పత్తి ప్రకారం యాత్రికుల సంఖ్యను కేటాయించిందని పేర్కొన్నారు. 70 ఏళ్ల వయస్సు పైబడిన వారిని నేరుగా ఎంపిక చేయాలని హజ్‌కమిటీ సూచించడంతో రాష్ట్రం నుంచి 484 మందికి అవకాశం దక్కిందన్నారు. ఎంపికైన యాత్రికులు అతిత్వరలో కేంద్ర హజ్ కమిటీ నిర్ధారించిన రుసుమును డీడీ ద్వారా జమచేయాల్సి ఉంటుందన్నారు. యాత్రకు దాదాపు రూ.3.5 లక్షల వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు. అత్యధికంగా నగరం నుంచి 4,811 మంది, మహబూబాబాద్ నుంచి తక్కువ మంది ఎంపికైనట్లు తెలిపారు.

దక్షిణ, ఉత్తర డిస్కమ్‌లకు ఇన్‌చార్జి డైరెక్టర్ల నియామకం

సాక్షి, హైదరాబాద్: దక్షిణ, ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలకు ఇన్‌చార్జి డైరెక్టర్లను సంబంధిత డిస్కమ్‌ల సీఎండీలు మంగళవారం నియమించారు. ప్రస్తుతం ఆయా డిస్కమ్‌లలో చీఫ్ జనరల్ మేనేజర్లుగా పనిచేస్తున్న అధికారులను ఇన్‌చార్జి డైరెక్టర్లుగా నియమించారు. ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థలో డైరెక్టర్ ప్రాజెక్ట్స్‌గా సదర్‌లాల్, డైరెక్టర్ ఆపరేషన్స్‌గా వి.మోహన్‌రావు, డైరెక్టర్ హెచ్‌ఆర్‌గా బి.అశోక్‌కుమార్‌లను సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి నియమించారు. దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థలో డైరెక్టర్ కమర్షియల్, ఐపీసీగా కె.రాములు, డైరెక్టర్ ఆపరేషన్స్ అండ్ ప్లానింగ్‌గా ఎస్.నర్సింహులు, డైరెక్టర్ ఫైనాన్స్‌గా కె.సుధామాధురిని సీఎండీ ముషారఫ్ ఫారూఖీ నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం పాత డైరెక్టర్లను పదవుల నుంచి తొలగిస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ ఉత్తర్వులు జారీ చేయడంతో.. కొత్త డైరెక్టర్లు వచ్చే వరకు వీరు ఇన్‌చార్జి డైరెక్టర్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తారు.

కృష్ణా జలాల అంశంపై చర్చించాలి

కేంద్రాన్ని కోరిన నామా




సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాల అంశంపై పార్లమెంటులో చర్చించాలని బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వర్‌రావు కేంద్రాన్ని కోరారు. విభజన చట్టంలోని హామీలను వెంటనే పూర్తి చేయాలన్నారు. మంగళవారం పార్లమెంటులో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి నేతృత్వంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన తెలంగాణకు సంబంధించిన పెండింగ్ అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నామా మీడియాతో మాట్లాడుతూ కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు(కేఆర్‌ఎంబీ) వల్ల రాష్ట్రానికి నష్టం జరుగుతుందని, దీనిపై సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని కేంద్రాన్ని కోరామన్నారు. రాష్ట్రానికి సంబంధించిన తాగు, సాగునీరు, నిరుద్యోగం వంటి సమస్యలను సభలో లేవనెత్తుతామని ఆయన తెలిపారు.

నేడు అధికారికంగా గద్దర్ జయంతి: జూపల్లి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమకారుడిగా, మహా విప్లవకవిగా తన జీవితాన్ని తాడిత, పీడిత ప్రజల కోసం త్యాగం చేసిన ప్రజాగాయకుడు గద్దర్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. సీఎం ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తర్వులు కూడా విడుదల చేసిందని, బుధవారం ఇక్కడి రవీంద్రభారతిలో గద్దర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అంతరాలు తొలగించాలని జీవితాంతం పరితపించి తన గళంతో జనాల్లో చైతన్యస్ఫూర్తిని రగిలించారంటూ గద్దర్ సేవలను గుర్తుచేశారు.

గద్దర్ విగ్రహానికి 1,076 చదరపు గజాల స్థలం



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రజాయుద్ధనౌక, దివంగత గద్దర్ విగ్రహ ఏర్పాటు కోసం 1,076 చదరపు గజాల స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్‌ఎండీఏ కమిషనర్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను ప్రభుత్వం పరిశీలించింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ తెల్లాపూర్‌లోని 1,076 చదరపు గజాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మళ్లీ పునర్వ్యవస్థీకరణ!

నీటిపారుదల శాఖ నైపుణ్యం, పనితీరుపై సందేహాల నేపథ్యంలో సర్కారు నిర్ణయం

- సీడీఓ, హైడ్రాలజీ విభాగాలకు మళ్లీ స్వతంత్రత
- డ్రాయింగ్స్, డిజైన్లు, నీటిలభ్యత అధ్యయనాల్లో లోపాల నివారణ
- ఐడీసీ లిఫ్టులకు పునరుజ్జీవం పోసేందుకు చర్యలు
- పునర్వ్యవస్థీకరణపై సమగ్ర నివేదిక కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో సమీక్ష జరిపి నిర్ణయం తీసుకునే అవకాశం

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖను మళ్లీ పునర్వ్యవస్థీకరణ చేసే దిశగా కాంగ్రెస్ సర్కార్ యోచిస్తోంది. 2020 డిసెంబర్‌లో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నీటిపారుదలశాఖను పునర్వ్యవస్థీకరించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నిర్లక్ష్యం, నిరాదరణకు గురైన విభాగాలు, ప్రాజెక్టులను గుర్తించి బలోపేతం చేయాలని ప్రస్తుత సర్కారు నిర్ణయించింది. తెలంగాణ వచ్చాక చేపట్టిన ప్రాజెక్టులు, తీసుకున్న నిర్ణయాలపై రాష్ట్ర నీటిపారుదలశాఖ సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యత ప్రశ్నార్థకంగా మారడంతో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ నైపుణ్యం, పనితీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శాఖ పునర్వ్యవస్థీకరణ తర్వాత జరిగిన లాభనష్టాలపై నివేదిక అందిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. అవసరమైతే మళ్లీ శాఖను పునర్వ్యవస్థీకరించి గాడిలో పెట్టాలని భావిస్తోంది.



ప్రభ కోల్పోయిన 'సీడీఓ'

కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) అక్రెడిటేషన్ ఉన్న ప్రతిష్టాత్మక సంస్థల్లో మన రాష్ట్ర నీటిపారుదల శాఖలోని 'సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్'(సీడీఓ) ఒకటి. దేశంలోని కొన్ని రాష్ట్రాల సీడీఓలకు మాత్రమే ఈ గుర్తింపు ఉంది. సాగునీటి ప్రాజెక్టుల డ్రాయింగ్స్, డిజైన్లకు సీడీఓ ఆమోదిస్తూ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తేనే, ఆయా ప్రాజెక్టుల అంచనాలను కేంద్ర జల సంఘం ఆమోదిస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో చీఫ్ ఇంజనీర్(సీఈ) నేతృత్వంలో 'సీడీఓ'స్వయంప్రతిపత్తి గల సంస్థగా పనిచేసేది. అప్పట్లో నిష్ణాతులైన ఇంజనీరింగ్ నిపుణులను మాత్రమే నియమించేవారు. ప్రాజెక్టుల డ్రాయింగ్స్, డిజైన్ల రూపకల్పన, ఆమోదానికి సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో సీడీఓ స్వతంత్రంగా వ్యవహరించేది. దానిపై నీటిపారుదలశాఖ ఈఎన్‌సీల అజమాయిషీగానీ, ఒత్తిడి గానీ ఉండేది కాదు. 2020 చేపట్టిన నీటిపారుదల శాఖ పునర్వ్యవస్థీకరణలో సీడీఓ స్వతంత్రతను కోల్పోయింది. ఈ విభాగాన్ని ఈఎన్‌సీ(జనరల్) పర్యవేక్షణ కిందకు తెచ్చి అందులో పనిచేసే ఇంజనీర్ల సంఖ్యనూ సగానికి పైగా కుదించేశారు. తర్వాత సరైన అధ్యయనాలు లేకపోయినా అత్యవసరంగా ఆమోదించాలని ఒత్తిడి పెంచి తమ వద్ద ప్రాజెక్టుల డిజైన్లు, డ్రాయింగ్స్‌కు ఆమోదం పొందారని ఆరోపిస్తూ సీడీఓ చీఫ్ ఇంజనీర్ ఇటీవల ఈఎన్‌సీ(జనరల్)కి లేఖ రాయడం విశేషం. ఈఎన్‌సీ(జనరల్)కు సర్వాధికారాలు కట్టబెట్టే రీతిలో పునర్వ్యవస్థీకరణ జరగడంతో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే విభాగాలు ప్రాధాన్యం కోల్పోయాయి. హైడ్రాలజీ, అంతర్రాష్ట్ర జలవనరులు, ఆయకట్టు అభివృద్ధి సంస్థ(కాడా)లు సైతం గతంలో స్వతంత్రంగా పనిచేసేవి. మళ్లీ ఈ విభాగాలకు స్వతంత్రత ఇస్తే ప్రాజెక్టుల డిజైన్లు, నీటిలభ్యత అధ్యయనాలను స్వేచ్ఛగా నిర్వహించే అవకాశముంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఐడీసీ లిఫ్టులకు తాళాలు

కాల్వల ఆధునీకరణ, ఆయకట్టు అభివృద్ధి, సత్వర సాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ), ప్రపంచ బ్యాంకు పథకాలు, నీటి సంఘాల నిర్వహణ చూసే కాడాకు గతంలో ఐఏఎస్‌లు బాస్‌లుగా ఉండేవారు. ఇప్పుడు సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయికి పరిమితం చేశారు. సాగునీటి అభివృద్ధి సంస్థ పరిధిలో 4.56లక్షల ఎకరాలకు నీరందించే 637 చిన్న ఎత్తిపోతల పథకాలున్నాయి. అందులో 216 పూర్తిగా, 137 పాక్షికంగా పనిచేస్తున్నాయి. 193 పూర్తిగా దెబ్బతిన్నాయి. 91 లిఫ్టులు అవసరం లేదని తాళాలు వేశారు. ప్రస్తుతం 2.18 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోంది. పునర్వ్యవస్థీకరణలో ఐడీసీ ప్రాజెక్టులు 19 మంది చీఫ్ ఇంజనీర్ల పరిధిలోకి వెళ్లగా, చిన్న లిఫ్టులను నిర్లక్ష్యం చేశారు.

ప్రాజెక్టుల నిర్వహణ గందరగోళం

పునర్వ్యవస్థీకరణ తర్వాత ప్రాజెక్టుల నిర్వహణ విషయంలో గందరగోళం నెలకొందని ఆ శాఖ ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

- గతంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టును ఒక చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షించేవారు. ఎడమకాల్వ ద్వారా విడుదల చేసే నీరు ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లాకు చేరేవరకు ఆయనే పర్యవేక్షించేవారు. ప్రస్తుతం సాగర్ ఎడమ కాల్వ నిర్వహణను సూర్యాపేట చివరి వరకు నల్లగొండ సీఈ, ఆ తర్వాత నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఖమ్మం సీఈ పర్యవేక్షిస్తున్నారు.
- అడ్మిన్ కమ్ చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షణలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఉండేది. ఇప్పుడు నిజామాబాద్, జగిత్యాల, వరంగల్, ములుగు, సూర్యాపేట, రామగుండం(పెద్దపల్లి) చీఫ్ ఇంజనీర్ల నిర్వహణలోకి ఈ ప్రాజెక్టు వెళ్లింది.
- కాళేశ్వరం ఈఎన్‌సీ(గజ్వేల్) పరిధి సిద్దిపేట వరకు మాత్రమే. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఈఎన్‌సీ(రామగుండం) పరిధిలోకి వస్తాయి.
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ నాగర్‌కర్నూలు సీఈ పరిధిలో ఉండగా, వనపర్తి, మహబూబాబాద్, హైదరాబాద్ సీఈలు కాల్వలు, రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు.
- ఒకే ప్రాజెక్టుకు సంబంధించిన సమీక్ష చేయాలన్నా, ఏదైనా నిర్ణయం అమలు చేయాలన్నా అందరూ ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజనీర్లతో మాట్లాడాల్సిందే. గతంలో మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రత్యేక విభాగాల వారీగా పర్యవేక్షించేవారు. ఇప్పుడు అన్ని ప్రాజెక్టులను ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో క్షేత్రస్థాయిలో ఆయా ప్రాజెక్టుల నిర్వహణలో గందరగోళం ఏర్పడింది.
- మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి నిర్వహణలోపం కూడా ఒక కారణంగా తేల్చగా, నిర్వహణను ఓఅండ్‌ఎం విభాగానికి అప్పగించారా? లేదా? అన్న దానిపై స్పష్టత కొరవడింది. డిఫెక్ట్ లయబిలిటీ కాలం పూర్తయ్యిందని, నిర్మాణ సంస్థ పట్టించుకోలేదని, నిర్మాణ సంస్థదే బాధ్యత అని నీటిపారుదలశాఖ నిర్లక్ష్యం చేసిందని ఆరోపణలున్నాయి.

ఆగిన ప్రమాణం

▶ మొదటి పేజీ తరువాయి

వేసింది. పిటిషన్ల విచారణార్హతతో పాటు వాటిలోని వాస్తవాలు, సాంకేతిక అంశాలను పరిశీలిస్తామని చెప్పింది. ఈ పిటిషన్లపై విచారణ ముగిసే వరకు కొత్తగా గవర్నర్ కోటాలో ఎవరినీ నియమించకుండా స్టే ఇవ్వాలని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు విజ్ఞప్తి చేయగా తోసిపుచ్చింది. అలా గవర్నర్‌కు ఆదేశాలు ఇవ్వడం చట్టపరంగా సాధ్యం కాదని స్పష్టం చేసింది. 'పెద్దమనుషుల ఒప్పందం' (జెంటిల్‌మెన్ అగ్రిమెంట్) మాదిరి అందరూ హుందాతనం పాటించాలని సూచించింది.

కొత్త నియామకాలపై స్టే ఇవ్వండి

తాజాగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్ట్ ఆమెర్ అలీ ఖాన్‌లను నియమిస్తూ.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలుపుతూ గవర్నర్ తమిళిసై ఈ నెల 25న ఉత్తర్వులు వెలువరించారు. దీంతో దాసోజు శ్రవణ్, సత్యనారాయణ ఇందుకు సంబంధించిన జీవో 12ను సవాల్ చేస్తూ హైకోర్టులో మధ్యంతర అప్లికేషన్ (ఐఏ) దాఖలు చేశారు. కొత్త నియామకాలను నిలుపుదల చేస్తూ ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అలాగే కోదండరాం, అలీఖాన్‌లను ప్రధాన పిటిషన్‌లో ఇంప్లీడ్ చేయాలని కోరారు. ఈ ఐఏలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. దాసోజు తరఫున సీనియర్ న్యాయవాది అదిత్యా సోదీ వాదనలు వినిపించారు. గవర్నర్ కోటా ఎమ్మెల్సీల అంశం హైకోర్టులో విచారణ దశలో ఉండగా కొత్త వారిని నియమించడం సరికాదన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఇద్దరి పేర్లను ఎమ్మెల్సీలుగా ప్రభుత్వం సిఫారసు చేసిందని, వాటిని పరిశీలించిన తర్వాతే గవర్నర్ ఆమోదించారని తెలిపారు. వీరి నియామకం చట్టప్రకారమే జరిగిందని, స్టే ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

చైర్మన్ లేక వీలు పడకపోవడంతో..

హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో కోదండరాం, ఆమెర్ అలీఖాన్ బుధవారం ప్రమాణ స్వీకారం చేసేందుకు వీల్లేకుండా పోయింది. వాస్తవానికి వీరు ప్రమాణ స్వీకారం చేసేందుకు సోమవారం (29న) నాడే శాసనమండలికి వెళ్లారు. కానీ వారు వెళ్లే సమయానికి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి రాకపోవడంతో వెనుదిరిగారు. అయితే ఆరోగ్యం బాగోలేనందున చైర్మన్ మండలికి రాలేకపోయారని, ఈ నెల 31న ప్రమాణ స్వీకారానికి రావాలని వారిద్దరికీ కౌన్సిల్ నుంచి సమాచారం అందింది. ఈ మేరకు వారు సిద్ధమవుతున్న సమయంలో స్టేటస్‌కో విధిస్తూ హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది.

నేడు బల్మూరి, మహేశ్‌కుమార్‌ల ప్రమాణం

ఎమ్మెల్యేల కోటాలో శాసనమండలికి ఎన్నికైన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బుధవారం ప్రమాణం చేయనున్నారు. మధ్యాహ్నం 3.30కు మండలి చైర్మన్ చాంబర్‌లో బల్మూరి వెంకట్, మహేశ్‌కుమార్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేస్తారు. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రమాణానికి దూరంగా ఉండాలని కోదండరాం, అలీఖాన్ నిర్ణయించుకున్నారు.

శివబాలకృష్ణ సస్పెన్షన్



సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించి వందల కోట్ల ఆస్తులు కూడబెట్టిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్, రెరా ఇన్‌చార్జి కార్యదర్శి, హెచ్‌ఎంఆర్‌ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ శివబాలకృష్ణను సస్పెండ్ చేస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పుప్పాలగూడలోని ఆయన ఇంట్లో, అలాగే మరో 14 ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ సోదాలు నిర్వహించిందని, ఈ సోదాల్లో కుటుంబ సభ్యులు పేరు మీద, బినామీల పేరిట భారీగా ఆస్తులను గుర్తించినట్లు పేర్కొన్నారు. అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఆయనను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. రూ. 84.60 లక్షల నగదు, 1.8 కిలోల బంగారు ఆభరణాలు, రూ. 8.26 కోట్ల ఆస్తులు గుర్తించినట్లు ఏసీబీ పేర్కొన్నట్లు వివరించారు. కాగా, శివబాలకృష్ణకు ఏసీబీ కోర్టు 8 రోజుల కస్టడీ విధించింది.

అమెరికాకు రండి

భట్టికి అమెరికా ప్రతినిధుల ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను అమెరికా ప్రతినిధులు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అమెరికాలోని ఫ్రెస్కో మిక్కిన్నీ పట్టణాలను సందర్శించాలని భట్టిని ఆహ్వానించారు. భట్టిని కలిసిన వారిలో ఇంటర్నేషనల్ ఎక్స్‌ప్రెషన్ డైరెక్టర్ హార్రీ వాల్లెస్, స్టార్టప్ రండి సీఈవో మహేష్ నందాల్య, సీవోవో రవీంద్రరెడ్డి ఉన్నారు.

నియోజకవర్గానికి రూ.కోటి

తాగునీటి కోసం విడుదల చేయాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం

- ప్రత్యేక అభివృద్ధి నిధుల్లోంచి ఖర్చు చేయండి
- సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున తాగునీటి నిర్వహణ మీరే చేపట్టండి
- మంత్రులు సీతక్క, కోమటిరెడ్డితో కలసి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: గ్రామాల్లో తాగునీటి నిర్వహణ బాధ్యతను పూర్తిగా సర్పంచ్‌లకు అప్పగించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అయితే సర్పంచ్‌ల పదవీకాలం నెలాఖరుతో ముగుస్తున్నందున అధికారులు ఆ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రోడ్లు-భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్కతో కలిసి సచివాలయంలో మంగళవారం ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్షించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద కేటాయించిన రూ.10 కోట్లలోంచి రూ. కోటి చొప్పున తాగునీటి అవసరాలకు ఖర్చు చేయాలని ఆదేశించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక్ సాగర్ లాంటి కొత్త రిజర్వాయర్లన్నింటినీ తాగునీటి అవసరాలకు ఉపయోగించుకోవాలని.. తద్వారా చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటి సరఫరా సులభమవుతుందని సీఎం తెలిపారు. గ్రామాల వరకు రక్షిత మంచినీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగమే తీసుకోవాలని, ఇంటింటికీ నీళ్లను అందించే బాధ్యతను సర్పంచ్‌లకు అప్పగించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. అందుకు అవసరమైన విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ, నల్లాలు, పైపులైన్ల మెయింటెనెన్స్‌ను సర్పంచులకే అప్పగించాలన్నారు.

నీరురాని గ్రామాల సర్వే..

రాష్ట్రంలో ఏయే ప్రాంతాలకు తాగునీరు అందట్లేదో సమగ్ర సర్వే నిర్వహించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. సంబంధిత ఇంజనీర్లు అన్ని గ్రామాలకు వెళ్లి నిజ నిర్ధారణ బృందం చేసినట్లుగానే పక్కాగా తాగునీరు అందని ఆవాసాల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. జలజీవన్ మిషన్ నిధులు రాబట్టుకొనేలా కొత్త ప్రతిపాదనలు తయారు చేసి కేంద్రానికి పంపించాలన్నారు.

స్వయం సహాయక సంఘాలకు...

స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని, వాళ్లకు ఆర్థికంగా చేయూతను అందించే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థిని విద్యార్థులు, పోలీసులకు అందించే యూనిఫామ్‌లను కుట్టించే పనిని ఈ సంఘాల మహిళలకు అప్పగించాలని సూచించారు.

రహదారులు లేని గ్రామాలకు తారురోడ్లు...

రోడ్డు సౌకర్యంలేని గ్రామాల్లో రోడ్లను నిర్మించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. 422 గ్రామ పంచాయతీలు, 3,177 ఆవాసాలకు ఇప్పటికీ రోడ్డు కనెక్టివిటీ లేదని అధికారులు సీఎంకు నివేదించగా వాటన్నింటికీ తారురోడ్లు వేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే ఉపాధి హామీ నిధులను అనుసంధానించి వాటిని పూర్తి చేయా లని చెప్పారు. ఈ బడ్జెట్‌లోనే అందుకు అవసరమైన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

గత ప్రభుత్వ నిర్వాకంతో కేంద్ర నిధులు రాలేదు..

తెలంగాణలో ఇంటింటికీ నల్లా నీళ్లు ఇచ్చినట్లు గత ప్రభుత్వం చెప్పుకోవడంతో రాష్ట్రానికి నష్టమే తప్ప లాభం జరగలేదని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ ప్రకటనలతో కేంద్రం నుంచి జలజీవన్ మిషన్ నిధులు రాకుండా పోయాయన్నారు. ఇకపై వాస్తవాలను దాచిపెట్టి గొప్పలకు పోవాల్సిన అవసరం లేదని అధికారులకు సూచించారు.

బాపూఘాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి నివాళి



గాంధీ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ బాపూఘాట్‌లో నివాళులు అర్పిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో సీఎస్ శాంతి కుమారి, డీజీపీ రవిగుప్తా, వీహెచ్, మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు

లంగర్‌హౌస్ (హైదరాబాద్): మహాత్మాగాంధీ 76వ వర్ధంతి కార్యక్రమాలు లంగర్‌హౌస్‌లో జరిగాయి. బాపూఘాట్‌లో సమాధి వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ఆయనకు నివాళులర్పించారు. అనంతరం బాపూ ధ్యాన మందిరంలో విద్యార్థుల మధ్య జరిగిన సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, వీహెచ్, నిరంజన్‌రావు, సీఎస్ శాంతి కుమారి పాల్గొన్నారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ టర్మినల్ రోడ్డు విస్తరణకు సహకరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: సికింద్రాబాద్, చర్లపల్లి, మౌలాలి రైల్వేస్టేషన్లకు సంబంధించిన పలు సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక లేఖ రాశారు. జంటనగరాలకు వచ్చే రైల్వే ప్రయాణికులకు మరింత సౌలభ్యంగా ఉండేందుకుగాను చేపట్టిన చర్లపల్లి టర్మినల్ నిర్మాణం పూర్తికావస్తోందని, దీనిని చేరుకునేందుకు మధ్య ఉన్న అడ్డంకులను తొలగించేందుకు కావాల్సిన భూకేటాయింపులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఉత్తరం వైపున్న టర్మినల్ చేరుకునేందుకు ఉన్న రహదారి విస్తరణకు సహకారం అందించాలని కోరారు. ఈ విషయాలపై రైల్వే శాఖ, జీహెచ్‌ఎంసీ, హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌ఆర్‌డీసీఎల్) అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన జరిపి నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు. ఇదే విషయంపై గతంలో మాజీ సీఎం కేసీఆర్‌కు 2022 జూన్ 15న, 2023 మార్చి 7న లేఖలు రాసినా ప్రభుత్వం నుంచి ఆశించిన సహకారం అందలేదని పేర్కొన్నారు. ఈ విషయాలపై ప్రత్యేక చొరవ తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధికి సహాయ సహకారాలను తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు.

రాడార్ సెంటర్‌తో హాని ఉండదు

- నిర్ధారణకు వచ్చాకే అనుమతులు మంజూరు
- బైసన్ పోలో గ్రౌండ్ కోసం కేసీఆర్ పేచీ పెట్టడం వల్లే జాప్యం: మంత్రి కొండా సురేఖ



సాక్షి, హైదరాబాద్: వికారాబాద్‌లో రాడార్ సెంటర్ ఏర్పాటుతో పర్యావరణానికి, ప్రజలకు ఎలాంటి హాని కలగదని పూర్తిగా నిర్ధారణకు వచ్చాకే కాంగ్రెస్ ప్రభుత్వం చివరి అనుమతులను మంజూరు చేసిందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఇది దేశ ప్రయోజనాలకు సంబంధించిందని, అయినా కొందరు కావాలని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ రాడార్ సెంటర్ ఏర్పాటుతో దేశభద్రతలో రాష్ట్రానికి పాత్ర ఉందని గర్వించాలిగానీ, దీనిపై రాజకీయం చేయడం బీఆర్‌ఎస్ నేతల విజ్ఞతకే వదిలివేస్తున్నామన్నారు. రాడార్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించి కేంద్రం, నాటి బీఆర్‌ఎస్ సర్కార్ మధ్య ఆర్థిక లావాదేవీల అనంతరం ప్రక్రియ చివరి దశలో ఉండగా బైసన్ పోలో గ్రౌండ్‌ను తెలంగాణకు ఇస్తేనే చివరి అనుమతులు ఇస్తామని కేసీఆర్ పేచీ పెట్టారని ఆమె పేర్కొన్నారు. బైసన్ పోలో గ్రౌండ్‌లో కొత్త సెక్రటేరియట్ కడితేనే తన కొడుకికి ముఖ్యమంత్రి యోగం ఉందనే నమ్మకాలతో చివరి దశలో కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి పెట్టిన షరతులతో రాడార్ సెంటర్ ఏర్పాటుకు బ్రేకులు పడ్డాయన్నారు. అందుకు కేంద్రం సమ్మతిస్తే నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తుది అనుమతులు అప్పుడే ఇచ్చి ఉండేదన్నారు. మంగళవారం సచివాలయంలోని మీడియా సెంటర్‌లో వికారాబాద్ జిల్లా దామగూడెం రిజర్వ్ ఫారెస్ట్‌లో వీఎల్‌ఎఫ్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై ఆమె స్పష్టతనిచ్చారు. రాడార్ స్టేషన్ ఏర్పాటు వ్యవహారంలో దొంగే దొంగా... దొంగ... అని అరిచినట్టుగా బీఆర్‌ఎస్ నేతల వ్యవహార శైలి ఉందని ధ్వజమెత్తారు. ఈ సెంటర్ ఏర్పాటు వల్ల జంతువులు, మనుషుల ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేదని, రేడియేషన్‌తో కేన్సర్ వంటి వ్యాధులు వస్తాయనే ఆరోపణల్లో నిజం లేదన్నారు. రాడార్ ప్రాజెక్టు వల్ల ప్రకృతికి నష్టం జరగదని, గ్రామాలు ఖాళీ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఈ ప్రాజెక్టుపై నమోదైన పిటిషన్‌పై హైకోర్టు స్టే ఎత్తివేసినందున దీని ఏర్పాటులో అవాంతరాలు లేవని స్పష్టం చేశారు. 2017లోనే బీఆర్‌ఎస్ హయాంలో రాడార్ సెంటర్ నిర్మాణానికి జీవో 44 ద్వారా అనుమతులు మంజూరయ్యాయన్నారు.

హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా మారుస్తాం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సాక్షి, హైదరాబాద్: డ్రగ్స్ ఫ్రీ సిటీగా హైదరాబాద్‌నుమార్చడమే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యం అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ పరిపాలన అందిస్తామని, అభివృద్ధి..సంక్షేమమే తప్ప డ్రగ్స్ ఉండదన్న భరోసా హైదరాబాద్ ప్రజలకు కల్పించాలన్నారు. డ్రగ్స్ విక్రయాలకు చోటులేదని, నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో వేర్వేరుగా జరిగిన జూబ్లీహిల్స్, సనత్‌నగర్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ కమిటీల సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతాలు, మతాల పేరిట విభజన చేసి ప్రజలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల ఉపేక్షించమన్నారు. పోలీస్, రెవెన్యూ, హెల్త్, పౌరసరఫరాలు, జీహెచ్‌ఎంసీ అన్ని వ్యవస్థలను ప్రజలకు జవాబుదారీగా పనిచేయిస్తామని చెప్పారు. ప్రజలు ఈ వ్యవస్థలు, సంస్థలు తమ కోసమే ఏర్పాటు చేశారన్న భావన కల్పించేలా పాలన ఉంటుందన్నారు.

బీఆర్‌ఎస్ బండారం బయటపెడతాం..

ఇంటికో ఉద్యోగం, ఊరికో బడి, కేజీ టు పీజీ, మూడు ఎకరాల భూ పంపిణీ, దళిత సీఎం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని వాగ్దానాలు చేసి పదేళ్ల అధికారంలో ఉండి, అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన గత బీఆర్‌ఎస్ పాలకులు నలభై రోజులు నిండని కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్యారంటీలు అమలు చేయడం లేదంటూ నోటికి వచ్చినట్టు మాట్లాడటానికి సిగ్గుందా? బుద్ధి ఉందా? అంటూ భట్టి మండిపడ్డారు. రాష్ట్ర సంపద, వనరులను దోపిడీ చేసిన గత బీఆర్‌ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి, పుట్టబోయే బిడ్డపై కూడా అప్పుల భారం మోపారని దుయ్యబట్టారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో సృష్టించిన ఆస్తులను బీఆర్‌ఎస్ పాలకులు అమ్ముకొని బతికారని, హైదరాబాద్ అభివృద్ధికి వారు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్యన కాంగ్రెస్ శ్రేణులు వారధులుగా పనిచేసి ఆరు గ్యారంటీలు ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జాతీయనేత జెట్టి కుసుమకుమార్, అజారుద్దీన్, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

బెంగళూరు టు హైదరాబాద్

డ్రగ్స్ డేటా తీస్తున్న నార్సింగి పోలీసులు

- గతంలోనే లావణ్య, ఉనీత్‌రెడ్డిలపై రెండు డ్రగ్స్ కేసులు
- లావణ్య కస్టడీ పిటిషన్ వేసిన పోలీసులు, పరారీలో ఉనీత్‌రెడ్డి



మణికొండ: లావణ్య ఫోన్ కాంటాక్ట్ లిస్ట్, కాల్ డేటా, సోషల్ మీడియా చాట్‌ల ఆధారంగా డ్రగ్స్ రాకెట్‌పై నార్సింగి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. లావణ్యతోపాటు ఉనీత్‌రెడ్డిలపై 2022లో గుంటూరు జిల్లా పట్టాభిపురం, 2023లో మోకిల పోలీస్‌స్టేషన్లలో డ్రగ్స్ కేసులు నమోదైన విషయాన్ని పోలీసులు గుర్తించారు. లావణ్యకు పలువురు టాలీవుడ్ నటులు, వీఐపీలతో పరిచయాలు ఉన్నట్టు గుర్తించారు. లావణ్య, ఉనీత్‌రెడ్డిలు బెంగళూరులో రూ.1,500లకు గ్రాము చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్‌లో రూ.6,000 వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం. విజయవాడ నుంచి ఉన్నత చదువులకు హైదరాబాద్ వచ్చి హోటల్ మేనేజ్‌మెంట్ చేసిన లావణ్య, ఆ రంగంలో స్థిరపడకుండా..మ్యూజిక్ నేర్చుకుంది. అదే క్రమంలో షార్ట్ ఫిలింలు, పలు చిన్న సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అవకాశాలు దక్కించుకుంది. మరిన్ని సినిమా చాన్స్‌ల కోసం ప్రయత్నిస్తోంది. ఉనీత్‌రెడ్డి కూడా షార్ట్ ఫిల్మ్‌లలో నటించాడు. ఉనీత్‌రెడ్డి బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి లావణ్య,తోపాటు తన గర్ల్ ఫ్రెండ్. తదితరులు ఇచ్చేవాడు. వారు వాడటమే కాకుండా, ఇతరులకు విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. లావణ్యకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఆమెను తమ కస్టడీకి తీసుకొని లోతుగా విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు నుంచి అనుమతి రాగానే పూర్తిస్థాయి విచారణ చేస్తే మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశముంది. ఉనీత్‌రెడ్డి పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

సీఎంతో ఆస్ట్రేలియా హై కమిషనర్ భేటీ



ఆస్ట్రేలియా హైకమిషనర్‌ను సత్కరిస్తున్న సీఎం రేవంత్‌. చిత్రంలో మంత్రి సురేఖ

సాక్షి, హైదరాబాద్‌: భారత్‌లోని ఆస్ట్రేలియా హై కమిషనర్‌ ఫిలిప్‌ గ్రీన్‌ మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో విద్య అభివృద్ధి కార్యక్రమాలు, ఎకో టూరిజం విస్తరణకు అవకాశాలు, వ్యవసాయంలో అధునాతన సాంకేతిక విధానాలపై ఉభయులు చర్చించారు. హైదరాబాద్‌ నుంచి ఆస్ట్రేలియాకు డైరెక్ట్‌ కనెక్టివిటీ మెరుగుపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌ బాబు, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ జీవన్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్స్‌కాన్‌ చైర్మన్‌కు సీఎం అభినందన

సాక్షి, హైదరాబాద్‌: ప్రతిష్టాత్మక పద్మభూషణ్‌ అవార్డుకు ఎంపికైన ఫాక్స్‌కాన్‌ చైర్మన్, సీఈవో యంగ్‌ ల్యూకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ మేరకు యంగ్‌ ల్యూకు ముఖ్యమంత్రి లేఖ రాశారు. భారతదేశానికి యంగ్‌ ల్యూ అందిస్తున్న సేవలు విశిష్టమైన గుర్తింపు పొందుతున్నాయని ప్రశంసించారు. ప్రపంచంలో సెమీ కండక్టర్‌ టెక్నాలజీ విప్లవంలో అత్యంత కీలకమైన భాగస్వామ్యం అందించి ప్రత్యేకతను చాటుకున్నారని అభినందించారు. ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవటంలో తెలంగాణ ముందు వరుసలో ఉందని పేర్కొన్నారు. ఈ కృషిలో ఫాక్స్‌కాన్‌ భాగస్వామి కావటం ఆనంద దాయకమని తెలిపా రు. భారత దేశానికి వచ్చినప్పుడు హైదరాబాద్‌ నగర సందర్శనకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని పేర్కొన్నారు.

మైనార్టీలకు మీరేం చేశారు?

ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ

సాక్షి, హైదరాబాద్‌: మైనార్టీలపై బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ దొంగ ప్రేమ ఒలకపోస్తున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌ అలీ విమర్శించారు. బీఆర్‌ఎస్‌ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు ఏం చేశారో చెప్పాలని ఆయన డిమాండ్‌ చేశారు. ఆయన గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ మైనార్టీల మీద అంత ప్రేమే ఉంటే కామారెడ్డిలో తన మీద కేసీఆర్‌ ఎందుకు పోటీ చేశారో చెప్పాలని నిలదీశారు. అమాయకున్ని ఓడ గొట్టడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారని ఆగ్ర హం వ్యక్తం చేశారు. అదే కాంగ్రెస్‌ ప్రభుత్వం తనను సలహాదారుగా నియమించిందన్నారు. రానున్న రోజుల్లో కూడా తమ పార్టీ మైనార్టీలకు అవకాశం ఇస్తుందని షబ్బీర్‌ అలీ స్పష్టం చేశారు.

బీజేపీ ఎమ్మెల్యే సువెందుపై ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్‌: భారత్‌ జోడో న్యాయ్‌ యాత్రలో రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని వక్రీకరించిన బీజేపీ ఎమ్మెల్యే సువెందు అధికారిపై బేగంబజార్‌ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌ కుమార్‌రెడ్డి చెప్పారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాహుల్‌ గాంధీ యాత్రకు మంచి స్పందన రావడాన్ని తట్టుకోలేక దాడులు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

17 లోక్‌సభ స్థానాలకు బీజేపీ ఇన్‌చార్జ్‌లు

సాక్షి, హైదరాబాద్‌: లోక్‌సభ ఎన్నికలు త్వరలో రానున్న నేపథ్యంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు ప్రభారీ(ఇన్‌చార్జీ)లను కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నియమించారు. మరో నాలుగు జిల్లాల పార్టీ అధ్యక్షులను మార్చి వారిస్థానంలో కొత్తవారిని నియమించారు. కొద్దిరోజుల క్రితమే 12 జిల్లాల పార్టీ అధ్యక్షులను మారుస్తూ కిషన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

ఎంపీ స్థానాలకు ప్రభారీలు...

ఆదిలాబాద్‌	అల్జాపూర్‌ శ్రీనివాస్‌
పెద్దపల్లి	కొప్పు బాషా
కరీంనగర్‌	మీసాల చంద్రయ్య
నిజామాబాద్‌	వెంకటరమణి
జహీరాబాద్‌	బద్దం మహిపాల్‌రెడ్డి
మెదక్‌	బస్వాపురం లక్ష్మీనరసయ్య
మల్కాజిగిరి	గోలి మధుసూదన్‌రెడ్డి
సికింద్రాబాద్‌	వీరపల్లి చంద్రశేఖర్‌
హైదరాబాద్‌	అట్లూరి రామకృష్ణ
చేవెళ్ల	ఎ.విశ్వనాథ్‌రెడ్డి
మహబూబ్‌నగర్‌	కేవీఎల్‌ఎన్‌ రెడ్డి(రాజు)
నాగర్‌కర్నూల్‌	ఎడ్ల అశోక్‌రెడ్డి
నల్లగొండ	చాడ శ్రీనివాస్‌రెడ్డి
భువనగిరి	పి.పాపారావు
వరంగల్‌	వి.మురళీధర్‌గౌడ్‌
మహబూబాబాద్‌	ఎస్‌.వెంకటరమణారెడ్డి
ఖమ్మం	జె.శ్రీకాంత్‌

నాలుగు జిల్లాలకు కొత్త అధ్యక్షులు...

ఆదిలాబాద్‌	పి.బ్రహ్మానంద్‌
నారాయణ్‌పేట్‌	పి.శ్రీనివాసు
జయశంకర్‌ భూపాలపల్లి	ఇ.నిషిధర్‌రెడ్డి
మహబూబాబాద్‌	వై.వెంకటేశ్వర్‌రావు

విభజన హామీల అమలుకు 17 గెలవాలి

- కేంద్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తేనే విభజన హామీల అమలు
- మోదీని మళ్లీ గెలిపించేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్‌ మధ్య చీకటి ఒప్పందం
- సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణ



మీడియాతో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌. చిత్రంలో భట్టి, మహేశ్‌కుమార్‌ గౌడ్, షబ్బీర్‌ అలీ

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ ప్రజలకిచ్చిన విభజన హామీలు అమలు కావాలంటే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 17కు 17 స్థానాల్లోనూ కాంగ్రెస్‌ గెలవాలని.. కేంద్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడాలని ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్‌ ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందుకోసం ప్రజాస్వామిక శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. మంగళవారం గాంధీ భవన్‌లో జరిగిన టీపీసీసీ ఎన్నికల కమిటీ (పీఈసీ) భేటీ అనంతరం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, పీఈసీ సభ్యులు షబ్బీర్‌ అలీ, అంజన్‌కుమార్‌ యాదవ్, సంపత్‌కుమార్, శివసేనారెడ్డిలతో కలసి రేవంత్‌ విలేకరులతో మాట్లాడారు. పీఈసీ భేటీలో భాగంగా లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించామన్నారు.

కేసీఆర్‌ అడిగింది లేదు.. మోదీ ఇచ్చింది లేదు..

'విభజన హామీల్లో పొందుపర్చిన అంశాలను సాధించుకోవాలంటే కేంద్రంలో కాంగ్రెస్‌ గెలవాలి. దీనిపై పదేళ్లు కేసీఆర్‌ అడిగింది లేదు... మోదీ ఇచ్చింది లేదు'అని రేవంత్‌ విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్‌ రూ. 7 లక్షల కోట్ల మేర అప్పులు చేస్తే ప్రధాని మోదీ రూ. 100 లక్షల కోట్ల అప్పులు తెచ్చి దేశాన్ని ప్రపంచంలోనే దివాలా తీసిన దేశంగా నిలబెట్టారని ఆరోపించారు. అందువల్ల రాహుల్‌ గాంధీ లాంటి నాయకుడు ప్రధానిగా ఉండాల్సిన అవసరముందని రేవంత్‌ పేర్కొన్నారు.

బీజేపీతో బీఆర్‌ఎస్‌ చీకటి చర్చలు..

బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ చీకట్లో మోదీతో జరుపుతున్న చర్చలను, బిల్లా–రంగాలు (కేటీఆర్, హరీశ్‌లను ఉద్దేశించి) మాట్లాడుతున్న మాటలను తెలంగాణ ప్రజలు గమనించి కాంగ్రెస్‌కు అండగా నిలవాలని రేవంత్‌ కోరారు. 'అధికారం నుంచి దింపాల్సింది మోదీనైతే బిల్లా–రంగాలు బీజేపీని పల్లెత్తు మాట అనకుండా కాంగ్రెస్‌ ఉండటమే మంచిది కాదన్న ధోరణిలో మాట్లాడుతున్నారు. దేశంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పాటు కాకపోతే అధికారంలోకి వచ్చేది మోదీనే కదా? ఆ రెండు పార్టీలు చేసుకున్న చీకటి ఒప్పందం ప్రజలకు అర్థం కావడం లేదనుకుంటున్నారా?'అని ప్రశ్నించారు.

కోదండరాంను అలాంటి వాళ్లతో పోలుస్తారా?

ఎన్నికైన ఎమ్మెల్సీలు ప్రమాణం చేస్తామంటే రాజకీయ కుట్రతో వాయిదా వేయించే ప్రయత్నం చేశారని రేవంత్‌ మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ నేతల దొడ్లో చెప్పులు మోసేవాళ్లతో ప్రొఫెసర్‌ కోదండరాంను పోల్చడంలో అర్థముందా? అని నిలదీశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ చచ్చిపోయిందని, ఆ పార్టీని ప్రజలు బొందపెట్టారని వ్యాఖ్యానించారు.

కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కైనా అపాయింట్‌మెంట్‌ ఇస్తా..

తనను ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు కలవడంపై సీఎం రేవంత్‌ స్పందించారు. ఎమ్మెల్యేలు ఎవరడిగినా సీఎంగా అపాయింట్‌మెంట్‌ ఇస్తానని, అవసరమైతే కేసీఆర్, హరీశ్, కేటీఆర్‌లు కూడా తనను అపాయింట్‌మెంట్‌ అడగొచ్చన్నారు. ఒకవేళ తాను ఆ సమయంలో అందుబాటులో లేకపోతే ఉపముఖ్యమంత్రిని కలవచ్చని చెప్పారు.

రాజ్యసభ అభ్యర్థుల ఖరారు బాధ్యత ఖర్గేకు..

రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థులను నిర్ణయించే అధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కేంద్ర ఎన్నికల కమిటీకి బదిలీ చేస్తూ పీఈసీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశామని రేవంత్‌ చెప్పారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కోసం స్క్రీనింగ్‌ కమిటీ రాష్ట్రానికి వచ్చి దరఖాస్తులపై చర్చించి కేంద్ర ఎన్నికల కమిటీకి ఇస్తుందని, ఈ నెల 15–20లోగా సమావేశాలు జరుగుతాయన్నారు. వీలైనంత త్వరగా అభ్యర్థులపై అధిష్టానం నిర్ణయం తీసుకొనే అవకాశముందని చెప్పారు.

కనీవిని ఎరగని రీతిలో ఇంద్రవెల్లి సభ

ఫిబ్రవరి 2న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన టీపీసీసీ నేతల సమావేశంలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్‌: ఫిబ్రవరి 2న కనీవినీ ఎరగని రీతిలో ఇంద్రవెల్లిలో కాంగ్రెస్‌ బహిరంగ సభ ఉంటుందని టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌ కుమార్‌గౌడ్‌ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే ఈ బహిరంగసభపై మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలతో సమావేశం నిర్వహించారు. మహేశ్‌ కుమార్‌గౌడ్‌ మాట్లాడుతూ ఇంద్రవెల్లి స్థూపం వద్ద స్మృతి వనం కడతామని సీఎం చెప్పారన్నారు. రేవంత్‌రెడ్డి టీపీసీసీ చీఫ్‌ అయిన తర్వాత ఇంద్రవెల్లి నుంచి ప్రచారం కార్యక్రమం మొదలైందని గుర్తు చేశారు. ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ ఇంద్రవెల్లిలో సీఎం పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని వెల్లడించారు. సమావేశంలో పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ జగ్గారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నేతలు మోత్కుపల్లి నర్సింహులు, హరివర్ధన్‌రెడ్డి, శ్రీహరిరావు, డీసీసీ అధ్యక్షులు, ఆదిలాబాద్, నిజామాబాద్‌ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

స్టాఫ్‌ నర్సులను భర్తీ చేసింది మేమే..

- వంట అయినంక గరిటె తిప్పినట్లు..
- నియామకపత్రాల జారీ పేరిట కాంగ్రెస్‌ హడావుడి
- జాబ్‌ క్యాలెండర్‌ మేరకు నోటిఫికేషన్లు ఇవ్వండి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్‌: స్టాఫ్‌ నర్సుల ఉద్యోగ భర్తీ ప్రక్రియను గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పూర్తి చేస్తే ఇప్పుడు కాంగ్రెస్‌ ప్రభుత్వ ఘనతగా నియామక పత్రాల జారీ పేరిట హడావుడి చేస్తున్నారని వైద్యఆరోగ్య శాఖ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌ రావు విమర్శించారు. స్టాఫ్‌ నర్సులకు నియామక పత్రా లు అందించేందుకు కాంగ్రెస్‌ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం 'వంట అయ్యాక గరిటె తిప్పినట్లు'ఉందని ఎద్దేవా చేశారు. ఈ మేరకు మంగళవారం హరీశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రూప్‌ 1 నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 1న ఇస్తామని ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన కాంగ్రెస్‌.. ప్రస్తుతం విద్యార్థుల దృష్టి మరల్చేందుకే స్టాఫ్‌ నర్సులకు నియామకపత్రాల జారీ పేరిట హడావుడి చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్‌ ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదిలోగా 2 లక్షల పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్‌ చేశారు.

ఎన్నికల కోడ్‌ వల్ల ఆటంకం

వైద్య సిబ్బంది కొరత లేకుండా చూసేందుకు మెడికల్, నర్సింగ్, పారామెడికల్, ఫార్మాసిస్టు, ఇతర సిబ్బంది నియామకానికి తామే శ్రీకారం చుట్టామని హరీశ్‌రావు పేర్కొన్నారు. మొత్తంగా 7,094 స్టాఫ్‌నర్సు పోస్టులకు నోటిఫికేషన్‌ ఇచ్చి, 2023 ఆగస్టు 2న ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించినా ఎన్నికల కోడ్‌ మూలంగా తుది ఫలితాల విడుదల జరగలేదని వివరించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం గత ప్రభుత్వం చేపట్టిన నియామకాలను తమ ఘనతగా చెప్పుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సు పోస్టులను ఉన్నతీకరిస్తూ గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ప్రత్యేక జీవో విడుదల చేసినా కాంగ్రెస్‌ నేటికీ పరిగణనలోకి తీసుకోవడం లేదని హరీశ్‌రావు ఆ ప్రకటనలో విమర్శించారు.

ధరణి భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలి

- మాజీ సీఎస్‌ సోమేశ్‌కుమార్‌ భార్య పేరిట 25 ఎకరాల రిజిస్ట్రేషన్‌పై చర్యలేవీ?
- బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు



సాక్షి, హైదరాబాద్‌: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో అమ్మిన, కేటాయించిన భూములు, ధరణిలో గాయబ్‌ చేసిన భూములు, రిటైర్డ్‌ ఐఏఎస్‌లు, ప్రస్తుత ప్రభుత్వంలోని ఐఏఎస్‌లకు అప్పనంగా కట్టబెట్టినవి ఎంతనే దానిపై విచారణ జరిపి శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు డిమాండ్‌ చేశారు. బీఆర్‌ఎస్‌ హయాంలో శ్మశానాలు అమ్ముకున్నట్టు, తెలంగాణ రైతుల భూములు ఎంఆర్‌ ప్రాపర్టీస్‌లో కలుపుకున్నట్లు, వక్ఫ్‌ భూములు, ల్యాంకో హిల్స్‌ అక్రమాలపై విచారణ జరిపే దమ్ముందా అని సవాల్‌ విసిరారు. ఈ అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో చీఫ్‌ సెక్రటరీగా, ఆ తర్వాత ప్రత్యేక సలహాదారుగా ఉన్న సోమేశ్‌కుమార్‌ భార్య పేరు మీద 25 ఎకరాలు రిజిస్ట్రేషన్‌ చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చినా ఎందుకు కేస్‌ ఫైల్‌ చెయ్యడం లేదని ప్రశ్నించారు. సర్వీస్‌లో ఉండగా లబ్ధిపొందారని, తమ కుటుంబ సభ్యుల పేరుతో ఆయన ఆస్తులను రిజిస్ట్రేషన్‌ చేసుకున్నట్లు కనిపిస్తున్నా చర్యలు ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. ధరణి పేరుతో అక్రమాస్తులు సంపాదించుకున్నట్లు ఆరోపణలు వస్తుంటే విచారణ ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం తప్పుడు జీవోలతో దోచుకున్నా ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎందుకు తడబడుతోందని ప్రశ్నించారు. హెటిరో సంస్థలకు ఇచ్చిన భూములపై పునఃసమీక్షించమని హైకోర్టు స్పష్టంగా చెప్పినా ఆ దిశలో చర్యలెందుకు లేవని నిలదీశారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ ఒక్క సీటు కూడా గెలవదని జోస్యం చెప్పారు. తెలంగాణ ఉద్యమకారులకు బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో చేసిన అన్యాయానికి అమరవీరుల స్థూపం దగ్గరకు వచ్చి క్షమాపణ చెప్పాలని, మలిదశ తెలంగాణ ఉద్యమం నడిపిన శ్రీకాంతాచారి తల్లికి ఫిబ్రవరిలో ఖాళీ అయ్యే రాజ్యసభ సీటు ఇచ్చి బీఆర్‌ఎస్‌ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు.

వెళ్లిన వారు వచ్చేయండి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజాసంఘాల నేతలపై అక్రమ కేసులను ఎత్తివేయాలన్న సూచనకు కూడా ఆమోదం తెలిపింది.

లోక్‌సభ అభ్యర్థులెవరు?

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, అభ్యర్థుల ఖరారుపై పీఈసీ ప్రధానంగా చర్చించింది. ప్రతి నియోజకవర్గంలో టికెట్‌ ఆశిస్తున్న వారి నుంచి కొన్ని పేర్లను డీసీసీ అధ్యక్షులు ప్రతిపాదించారు. 17 లోక్‌సభ స్థానాలకుగాను 187 పేర్లతో కూడిన జాబితాను ఎన్నికల కమిటీకి వారు అందజేశారు. ఈ జాబితాను పరిశీలించిన పీఈసీ వచ్చే నెల మూడో తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించింది. దరఖాస్తుతోపాటు ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు అయితే రూ.25వేలు, ఇతరులు రూ.50వేల చొప్పున రుసుము చెల్లించాలని నిర్ణయించారు. ఈ దరఖాస్తులను షార్ట్‌లిస్ట్‌ చేసి అదే నెల ఆరో తేదీలోపు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ)తో పాటు హరీశ్‌చౌదరి, జిగ్నేశ్‌ మేవాని, విశ్వజిత్‌ కదంలతో కూడిన స్క్రీనింగ్‌ కమిటీకి కూడా పీఈసీ పంపనుంది. భేటీలో భాగంగా త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎవరన్న దానిపై చర్చ జరిగింది. అయితే, ఇక్కడ ఫలానా నాయకుల పేర్లపై చర్చ జరపడం సరైంది కాదని, అభ్యర్థుల ఎంపిక అధికారాన్ని ఏఐసీసీకి ఇవ్వాలనే సూచన రావడంతో ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)లకు ఈ అధికారాన్ని కట్టబెడుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని కమిటీ ఆమోదించింది.

మాకు అవకాశమివ్వండి

భేటీలో భాగంగా సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ గెలిచిన తర్వాత మెదక్‌ లోక్‌సభ నుంచి ఇప్పటివరకు కాంగ్రెస్‌ పార్టీ గెలవలేదని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌తో పాటు పార్టీ ఇన్‌చార్జ్‌ మున్షీ నిర్ణయిస్తే తాను పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పోటీ చేసే అవకాశం యూత్‌కాంగ్రెస్‌ కోటాలో ఇవ్వాలని, ఒకవేళ సమీకరణలు కుదరకపోతే రాజ్యసభ సభ్యునిగా యూత్‌కాంగ్రెస్‌ నాయకుడిని ఎంపిక చేసే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలపై అధిష్టానంతో మాట్లాడాలని పీఈసీ అభిప్రాయపడింది. టీపీసీసీ ఎన్నికల కమిటీ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌ దీపాదాస్‌ మున్షీ, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు డి.శ్రీధర్‌బాబు, ఎన్‌.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కమిటీ సభ్యులు జానారెడ్డి, జీవన్‌రెడ్డి, వి.హనుమంతరావు, రేణుకాచౌదరి, మహేశ్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్, షబ్బీర్‌అలీ, అంజన్‌కుమార్‌ యాదవ్, అజారుద్దీన్, వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల తరహాలో..

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా అయోధ్య నుంచి అక్షింతలు పంపినట్టుగానే తెలంగాణ ప్రభుత్వం తరఫున సమ్మక్క–సారలమ్మ బంగారాన్ని రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి పంపే అంశాన్ని పరిశీలించాలని మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించారు. బెల్లంతో పాటు పసుపు, కుంకుమ పంపే అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. గ్రామాలకు వెళ్లే బంగారాన్ని పార్టీ ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు, స్థానిక కేడర్‌ నేతృత్వంలో ప్రజలకు పంచాలనే అభిప్రాయం సభ్యుల నుంచి వ్యక్తమైంది. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌ ఈ ప్రతిపాదనను అమల్లోకి తెచ్చే అంశాన్ని అధికారులతో కలిసి పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని మంత్రులు సీతక్క, కొండా సురేఖలకు సూచించారు.

రూ. 37 వేల కోట్లు కేటాయించండి

- బడ్జెట్‌లో ప్రాధాన్య ప్రాజెక్టులకు నిధులివ్వాలి
- నీటిపారుదల శాఖ విజ్ఞప్తి
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి ఉత్తమ్‌ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో మంత్రి ఉత్తమ్‌

సాక్షి, హైదరాబాద్‌: రానున్న ఆర్థిక సంవత్సరం (2024–25)లో నీటిపారుదల రంగానికి రూ.37 వేల కోట్లను కేటాయించాలని ఆ శాఖ ప్రతిపాదించింది. మంగళవారం నీటిపారుదల శాఖ బడ్జెట్‌ ప్రతిపాదనలపై అధికారులతో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్‌.ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి సమీక్షించారు. 2024–25లో కాళేశ్వరం ప్రాజెక్టు రుణాల నిమిత్తం రూ.14,462.17 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని, ఇది కాక రూ.3000 కోట్లను తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థ కింద తీసుకున్న రుణాలకు చెల్లింపులున్నాయని అధికారులు నివేదించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో తక్కువ వ్యయంతో ఎక్కువ ఆయకట్టును సృష్టించేలా ప్రాజెక్టుల నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించుకున్నట్లు మంత్రి ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి గుర్తు చేశారు.

ఈ ప్రాజెక్టులకు ప్రాధాన్యం

శ్రీశైలం లెఫ్ట్‌ బ్యాంకు కెనాల్‌ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్‌ ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, నెట్టెంపాడు, రాజీవ్‌ బీమా, కోయిల్సాగర్, నారాయణపేట– కొడంగల్‌ ఎత్తిపోతల పథకం, చిన్నకాళేశ్వరం (ముక్తేశ్వర్‌), మొడికుంటవాగు, సీతారామ ఎత్తిపోతల పథకం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, ఇందిరమ్మ వరద కాలువ, పెద్దవాగు (జగన్నాథపూర్‌), చనాకా కొరాటా, దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నామని మంత్రి ఉత్తమ్‌ వెల్లడించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌ బొజ్జా, ఈఎన్‌సీ(జనరల్‌) మురళీధర్‌ రావు పాల్గొన్నారు.

విద్యుత్‌ సంస్థల్లో సమ్మె నిషేధం..

విద్యుత్‌ సంస్థల్లో మరో ఆరు నెలలపాటు ఎలాంటి సమ్మెలు చేయకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రాన్స్‌కో, జెన్‌కో, దక్షిణ, ఉత్తర విద్యుత్‌ పంపిణీ సంస్థల్లో సమ్మెను నిషేధిస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

12న 'ఉస్మానియా ఆస్పత్రి'పై విచారణ

సాక్షి, హైదరాబాద్‌: ఉస్మానియా జనరల్‌ ఆస్పత్రిని కూల్చి కొత్త దానిని నిర్మించాలని కొందరు, దానిని వారసత్వ సంపదగా పరిరక్షించాలని మరికొందరు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్‌)లపై వచ్చే నెల 12 విచారణ చేపడతామని హైకోర్టు స్పష్టం చేసింది. ఉస్మానియా ఆస్పత్రి ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. దీనిపై హైకోర్టులో పలు పిల్‌లు దాఖలుకాగా, పలుమార్లు విచారణ చేపట్టింది. ప్రస్తుతం ఉన్న భవనంలో ఆస్పత్రిని కొనసాగించడం క్షేమం కాదని ఐఐటీ హైదరాబాద్, ఆర్కియోలాజికల్‌ సర్వే ఆఫ్‌ ఇండియా నిపుణుల కమిటీ కూడా నివేదికలు సమర్పించాయి. అయితే ఈ పిటిషన్లు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ అలోక్‌ అరాధే, జస్టిస్‌ అనిల్‌కుమార్‌ జూకంటి ధర్మాసనం ముందుకు మంగళవారం మరోసారి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్‌ జనరల్‌(ఏజీ) సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. 1,000 పడకలతో ఉస్మానియా ఆస్పత్రి ప్రజలకు వైద్యసేవలు అందిస్తోందని, దీన్ని 1,800 పడకలకు పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

త్వరలో రాష్ట్రపతి నిలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు

రాష్ట్రపతి నిలయం ఎస్టేట్‌ మేనేజర్‌ రజనీప్రియ వెల్లడి

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రపతి నిలయం సందర్శనకు వచ్చే వారిని ఆకట్టుకునేలా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో త్వరలో సాయంత్రం వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్రపతి నిలయం ఎస్టేట్‌ మేనేజర్‌ రజనీప్రియ తెలిపారు. రాష్ట్రపతి నిలయంలో సందర్శకులకు అనుమతి ఇచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు లక్ష మంది వచ్చారన్నారు. రాష్ట్రపతి నిలయం ప్రత్యేకతలు, సందర్శకుల అనుమతికి సంబంధించి పలు వివరాలు మంగళవారం మీడియా సమావేశంలో రజనీప్రియ, అడ్మిన్‌ ఆఫీసర్‌ దులార్‌ మింగ్, అసిస్టెంట్‌ అడ్మిన్‌ ఆఫీసర్‌ రాజేశ్‌యాదవ్‌ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటర్‌ వరకు ప్రభుత్వ స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థులకు ఉచిత ప్రవేశ సదుపాయం ఉందని తెలిపారు. సాధారణ పౌరులకు రూ.50, విదేశీయులకు రూ.250 ప్రవేశ రుసుముగా నిర్ణయించినట్లు చెప్పారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుందని, సోమవారం సెలవు అని పేర్కొన్నారు. రాష్ట్రపతి నిలయ సందర్శన విద్యార్థులకు విహారయాత్రతో పాటు విజ్ఞానయాత్రగా కూడా నిలుస్తుందన్నారు. పిల్లలకు జంక్‌ ఫుడ్‌ ఇవ్వకుండా ఇక్కడి క్యాంటీన్‌లో ఆర్గానిక్‌ ఆహారం అందిస్తున్నామని రజనీప్రియ వెల్లడించారు. హైదరాబాద్‌ పర్యాటక ప్రాంతాల జాబితాలో రాష్ట్రపతి నిలయం చేర్చేందుకు త్వరలో పర్యాటక శాఖ అధికారులతో చర్చించి ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు చెప్పారు. నిలయం ఆవరణలో ప్రతీ కట్టడం విశేషాలు వివరించేందుకు గైడ్లు అందుబాటులో ఉన్నారని రజనీప్రియ తెలిపారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి.. కాదు కాంగ్రెస్‌ సర్కారుతోనే

మంత్రి పొన్నం వర్సెస్‌ జెడ్పీటీసీ.. ఇద్దరి మధ్య మాటల యుద్ధం



దుమాలలో వేదికపై మంత్రి పొన్నం, జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు వాగ్వాదం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో మంగళవారం జరిగిన ఓ సభలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, స్థానిక జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన సందర్భంగా జరిగిన సభలో జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందని చెబుతుండగా.. వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ స్పందిస్తూ జెడ్పీటీసీ అన్నీ అసత్యాలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, తమ కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఇందుకు జెడ్పీటీసీ అభ్యంతరం వ్యక్తం చేయడం, ప్రతిగా మంత్రి మాట్లాడటం.. ఇలా ఇరువురి మధ్య మాటలు పెరుగుతుండడంతో కాంగ్రెస్‌ నేతలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిని మంత్రి సముదాయించి తన ప్రసంగాన్ని కొనసాగించారు.

గాంధీ సిద్ధాంతాలు దేశానికి శిరోధార్యం

సాక్షి, హైదరాబాద్‌: మహాత్మాగాంధీ సిద్ధాంతాలు దేశానికి శిరోధార్యమని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గాంధీ గ్లోబల్‌ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్‌ ప్రతిష్టాన్‌ సంస్థల చైర్మన్‌ డాక్టర్‌ గున్న రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీభవన్‌ ప్రాంగణంలోని తెలంగాణ– ఏపీ భూదాన్‌ యజ్ఞ బోర్డ్‌ ప్రధాన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రకృతి వైద్యం, విద్య, సేంద్రియ వ్యవసాయం, కుటీర, భారీ పరిశ్రమలు, పర్యావరణం వంటి అంశాలు స్వదేశీ ఆలోచనలతో స్వావలంబన దిశగా పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గాంధీ కలలు ఇప్పటికీ సాకారం కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గాంధీ గ్లోబల్‌ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్‌ ప్రతిష్టాన్‌ సంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ యానాల ప్రభాకర్‌రెడ్డి, సుభాష్‌చంద్ర, పి.హరదీప్‌రెడ్డి, ప్రభు, స్వరూప, మనీషాలు పాల్గొన్నారు.

'అక్రమ కేసులను ఎత్తివేయాలి'

సాక్షి, హైదరాబాద్‌: ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం నిర్వహించిన ఆందోళనలో ప్రజా సంఘాలు, పేదలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక కోరింది. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర నేతలు టి.సాగర్, ఆర్‌.వెంకట్‌ రాములు కలిసి వినతిపత్రం సమర్పించారు.

అవిశ్వాసం నెగ్గినా.. చేజారిన చైర్మన్‌గిరి

- యూటర్న్‌ తీసుకున్న డైరెక్టర్లు
- సింగిల్‌విండో చైర్మన్‌ ఎన్నిక నేటికి వాయిదా



వైస్‌చైర్మన్‌ కారును అడ్డుకుంటున్న తిరుపతి వర్గీయులు

పెద్దపల్లిరూరల్‌: 'అవిశ్వాస తీర్మానంలో నెగ్గినం..తెల్లవారితే జరిగే ఎన్నికల్లో అధికారం నాకే దక్కుతుంది'అని ఆశించి ఓ నేత భంగపడ్డారు. వివరాల్లోకి వెళితే.. పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకారపరపతి సంఘం చైర్మన్‌గా దాసరి చంద్రారెడ్డి కొనసాగుతున్నారు. చైర్మన్‌ పోస్టుపై కన్నేసిన డైరెక్టర్‌ ఆరె తిరుపతి, మిగతా డైరెక్టర్ల మద్దతుతో అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించారు. జిల్లా సహకారశాఖ అధికారి శ్రీమాల అధ్యక్షతన సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సొసైటీలోని 13మంది సభ్యుల్లో (చైర్మన్‌ చంద్రారెడ్డి, మరో సభ్యుడు రాజిరెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు) 11మంది హాజరై అవిశ్వాసానికి మద్దతు పలికారు. దీంతో చంద్రారెడ్డి పదవి కోల్పోయారు. మంగళవారం కొత్త చైర్మన్‌ ఎన్నిక నిర్వహిస్తామని డీసీఓ శ్రీమాల ప్రకటించా రు. మెజారిటీ సభ్యులు తనకు మద్దతు ఇస్తున్నారని, చైర్మన్‌ పదవి తనకే దక్కుతుందని తిరుపతి భరోసాతో ఉన్నారు. ఈ క్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్‌ చింతపండు సంపత్‌ రంగంలోకి దిగా రు. తను చైర్మన్‌గా ఎన్నికయ్యేందుకు మద్దతు ఇ వ్వాలని డైరెక్టర్లను కోరారు. ప్రతిగా తిరుపతి కన్నా ఎక్కువ మొత్తం ముట్టజెబుతానని ఆశ చూపారు. దీంతో డైరెక్టర్లు రాత్రికిరాత్రే సంపత్‌కు మద్దతు ఇచ్చేందుకు ఓకే అన్నారు. మంగళవారం ఉదయం 9గంటల వరకూ సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు. అయితే, వారంతా సంపత్‌ వెంట వెళ్లారని సమాచారం అందుకున్న తిరుపతి వర్గీయులు సహకార సంఘ కార్యాలయం వద్ద కోసం కాపుకాశారు. అనుకున్నట్టే వారు ఓ కారులో కార్యాలయానికి చేరుకోగానే తిరుపతివర్గం ఒక్కసారిగా వారి పై దాడి చేసింది. కారులోని నగదు బయటకు లాగ డంతో నోట్లకట్టలు చెల్లాచెదురయ్యాయి. బందోబస్తులో ఉన్న బసంత్‌నగర్‌ పోలీసులు ఆరె తిరుపతి వర్గీయుల చేతిలోని నోట్లను స్వాధీనం చేసుకునేందుకు యత్నించారు. ఈక్రమంలోనే ఆరె తిరుపతి వర్గీయులు, డైరెక్టర్లను నాటకీయ ఫక్కీలో మరోకారులో బయటకు తీసుకెళ్లారు. మధ్యాహ్నం 12.30 గంటల దాకా వారిని తమ అధీనంలోనే ఉంచుకున్నారు. అయితే, చైర్మన్‌ ఎన్నిక నిర్వహించేందుకు డీసీఓ వేచిచూసినా వారు హాజరు కాలేదు. దీంతో సమావేశాన్ని బుధవారానికి వాయిదా వేస్తున్నట్టు ఆమె ప్రకటించారు. బుధవారం కోరం లేకున్నా సమావేశం నిర్వహిస్తామని చెప్పారు.



నిజమైన ప్రేమ అవగాహనలో నుంచి పుడుతుంది.
- బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 31 జనవరి 2024

తప్పొకరిది! శిక్ష అందరికా?

అంతకంతకూ తీవ్రమవుతున్న పాలస్తీనా సంక్షోభం వారం రోజుల్లో అనేక మలుపులు తిరిగింది. దక్షిణాఫ్రికా వేసిన జాతి విధ్వంసం కేసులో అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) చేసిన ప్రాథమిక నిర్దేశం ఒకవైపు, పాలస్తీనా శరణార్థులకై ఏర్పాటైన ఐరాస సహాయ సంస్థ 'యూఎన్ఆర్‌డబ్ల్యూఏ' (అన్‌రా)కు నిధులు ఆపేస్తున్నట్టు అమెరికా, మరో 8 దేశాలు ప్రకటించడం మరోవైపు, అమెరికా శిబిరాలపై డ్రోన్ దాడులు ఇంకోవైపు... ఇలా అనేక పరిణామాలు సంభవించాయి. గాజా యుద్ధానికి దారి తీసిన అక్టోబర్ 7 నాటి 'హమాస్' ఆకస్మిక దాడి, అపహరణలు, హత్యల్లో 'అన్‌రా' సిబ్బంది కొందరు పాలుపంచుకున్నారని ఇజ్రాయెల్ ఆరోపణ. 190 మంది దాకా 'అన్‌రా' ఉద్యోగులు ఇస్లామిక్ జిహాదీ తీవ్రవాదులైన 'హమాస్' వర్గీయులుగానూ వ్యవహరించారని అది అంటోంది. అయితే కొందరు తప్పు చేశారని గాజాలోని లక్షల మందికి ప్రాణాధారాన్ని ఆపేయరాదని ఐరాస అభ్యర్థన.

ఎప్పుడో 1948లో అరబ్ - ఇజ్రాయెలీ యుద్ధం సందర్భంగా దాదాపు 7 లక్షల మంది పాలస్తీనీయులు ఇప్పుడు ఇజ్రాయెల్ అంటున్న ప్రాంతంలోని తమ ఇల్లూ వాకిలీ వదిలేసి పోవాల్సొచ్చింది. ఆ శరణార్థుల సాయానికై 1949లో 'అన్‌రా' ఏర్పాటైంది. గాజా, ఇజ్రాయెల్ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్, లెబనాన్, సిరియా, జోర్డాన్‌లలో విద్య, ఆరోగ్యం, సహాయ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టే ఈ సంస్థ ద్వారా సుమారు 59 లక్షల మంది పాలస్తీనా శరణార్థులు సాయం పొందుతున్నారు. ఇప్పటికే మానవీయ సంక్షోభంలో చిక్కుకున్న గాజాలోని ప్రజానీకానికి తిండి, నీళ్ళు అందిస్తున్నది ప్రధానంగా ఈ సంస్థే. అమెరికా లాంటి పలు దేశాల స్వచ్ఛంద విరాళాలతో నడిచే ఆ సంస్థపై ఆరోపణలు చేసి, నిరూపించకుండానే నిధులు ఆపేస్తే లక్షలాది అమాయకుల పరిస్థితి ఏమిటి?

ఐరాస శరణార్థి సహాయ సంస్థకు నిధులిచ్చే దేశాల మాట అటుంచితే, అసలు సామాన్య పౌరులకు కష్టం వాటిల్లకుండా చేయగలిగినదంతా చేయాలంటూ అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసీజే) నిర్దేశించింది. అయినా ఇజ్రాయెల్ పెడచెవిన పెడుతోంది. గాజా ప్రాంతంపై దాడులు కొనసాగిస్తూ, అమాయకుల ఆయువు తీస్తోంది. ఆ మధ్య కొద్దివారాల పాటు గాజాలోని ప్రధాన నగరం నుంచి వెనక్కి తగ్గినట్టే తగ్గిన ఇజ్రాయెల్ సోమవారం మళ్ళీ భీకర దాడులకు దిగింది. ఇజ్రాయెల్ అమానవీయ యుద్ధంలో ఇప్పటికే 26.5 వేల మంది పాలస్తీనీయులు మరణించారు. తీరం వెంట ధ్వంసమైన భవనాల శిథిలాల కింద ఇంకెన్ని వేల మృతదేహాలున్నాయో తెలీదు. అంతకంతకూ క్షుద్రమవుతున్న ఈ యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఇక, గాజా ప్రకంపనలు ఇతర చోట్లకూ విస్తరించాయి. ఆదివారం సిరియా సరిహద్దు సమీపంలోని జోర్డాన్ ఈశాన్య ప్రాంతంలో డ్రోన్ దాడులు జరిగాయి. అమెరికా సైనికులు ముగ్గురు మరణించారు.

ఈ దాడులు ఇరాన్ అండతో సిరియా, ఇరాక్‌లలో నడుస్తున్న తీవ్రవాద వర్గాల పని అన్నది అమెరికా మాట. ఆ పాపంలో తమకేమీ భాగం లేదన్నది ఇరాన్ ఖండన. నిజానికి, ఇజ్రాయెల్ - హమాస్‌ల మధ్య యుద్ధం మొదలైనప్పటి నుంచి పశ్చిమాసియాలో పలు ప్రాంతాల్లో ఉన్న అమెరికా సైనిక శిబిరాలపై పదులకొద్దీ దాడులు జరిగాయి. అమెరికాకు ప్రాణనష్టం మాత్రం ఇదే తొలిసారి. ఇజ్రాయెల్ భీకర ప్రతీకార యుద్ధాన్ని గుడ్డిగా సమర్థిస్తూ వస్తున్న అగ్రరాజ్య విస్తృత రక్షణ వ్యవస్థల్ని దాటుకొని మరీ ఈ దెబ్బ తగలడం గమనార్హం. దాంతో, అమెరికా అధినేత సైతం ఇరాన్ మద్దతున్న తీవ్రవాదవర్గాలపై ప్రతీకార దాడులు చేయాలని హుంకరించారు. అలాగని నేరుగా ఇరాన్‌పై దాడికి దిగలేదు. ఆ దేశాన్ని లక్ష్యంగా చేసుకోవాలని నేతలు కోరినా, అది తేనెతుట్టెపై రాయి వేయడమే. ఆ ప్రాంతంలో దీర్ఘకాలంగా నిలబడి కలబడుతున్న తీవ్రవాద బృందాలే అందుకు సాక్ష్యం.

ప్రాంతీయ పోరాటాల్లో తలదూర్చినప్పుడల్లా తలబొప్పి కడుతూనే ఉందని అగ్రరాజ్యం మర్చిపోకూడదు. పశ్చిమాసియాలో ఇప్పటికే దానికి అనేక శత్రువులున్నారు. ఇరాన్‌పై దుందుడుకుగా ప్రవర్తిస్తే పరిస్థితి చేయి దాటుతుంది. చివరకు ఈ యుద్ధం ప్రపంచ స్థాయిలో పెద్దదవుతుంది. ఇటీవల ఎర్రసముద్రంలోని దాడులతో అస్తుబిస్తు అవుతున్న ప్రపంచ వాణిజ్యానికి అది మరో అశనిపాతం అవుతుంది. అది గ్రహించే అమెరికా అనివార్యంగా సంయమనం చూపాల్సి వచ్చింది. ఇంకోపక్క మరో విడత కాల్పుల విరమణకై అరకొర ప్రయత్నాలు సాగుతున్నా, అవేవీ ఫలించడం లేదు. తాజాగా అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ అధినేత ఆదివారం ప్యారిస్‌లో ఇజ్రాయెల్, ఈజిప్ట్, ఖతార్‌కు చెందిన ఉన్నతాధికారులను కలిశారు. మిగిలిన బందీలను హమాస్ విడుదల చేస్తే, మరొకసారి కాల్పుల విరమణ పాటించేలా చర్చించి, ఒప్పించాలని ప్రయత్నం. కానీ, ఫలితం శూన్యం.

ఇజ్రాయెల్ సైనికచర్యను తప్పుబడుతూ దక్షిణాఫ్రికా వేసిన జాతి విధ్వంసం కేసు తేలేసరికి ఏళ్ళు పడుతుంది. ఈలోగా ఐసీజే గురువారం ఇచ్చిన ప్రాథమిక నిర్దేశం ఏ పక్షం వైపూ మొగ్గకుండా ఆచరణాత్మక ధోరణిలో సాగింది. గాజాలో అత్యవసర ప్రాథమిక సేవలు, మానవతా సాయం అందించాలని టెల్ అవీవ్‌ను కోరింది. అదే సమయంలో హమాస్ చేతిలోని బందీల పట్ల ఆందోళన వెలిబుచ్చుతూ, వారి విడుదలకు పిలుపునిచ్చింది. ఇలాంటి సమతూక ధోరణినే ఆశ్రయిస్తూ అమెరికా, ఐరోపా సమాజం సహా పాశ్చాత్యదేశాలన్నీ చర్చలతో పరిష్కారానికి మనసు పెట్టాలి. అంతు లేని యుద్ధానికి ఇజ్రాయెల్‌ను అనుమతిస్తున్న తమ విధానాలపై పునరాలోచన చేయాలి. ఆచరణాత్మక పరిష్కార మార్గాన్ని అన్వేషించాలి. ఇరుపక్షాలనూ అంగీకరింపజేయాలి. కొందరు తప్పు చేశారని, 'అన్‌రా' నిధులను ఆపి అందరినీ శిక్షించడం శాంతిస్థాపనకు దోహదం చేయదని గ్రహించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, తిథి: తిథి బ.పంచమి ఉ.8.18, వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: హస్త రా.10.12 వరకు, తదుపరి చిత్త, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.11.51 నుండి 12.39 వరకు, అమృత ఘడియలు: ప.3.31 నుండి 5.16 వరకు

సూర్యోదయం : 6.37
సూర్యాస్తమయం: 5.50
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఇండో-ఫ్రెంచ్ సంబంధాల్లో నవశకం

విశ్లేషణ



మోహన్ కుమార్

భౌగోళిక-వ్యూహాత్మక అస్థిరతను ఎదుర్కోవాలంటే, సంబంధాల్లో వైవిధ్యం పెంచుకోవాలి. ఈ నేపథ్యంలో భారత గణతంత్ర దినోత్సవాలకు అతిథిగా వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ పర్యటన ఇరుదేశాల సంబంధాలను మరింత దృఢతరం చేస్తుంది. గాజాలో యుద్ధం కారణంగా చాలామంది అసాధ్యం అని భావిస్తున్న ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరోప్ కారిడార్ గురించి ఇరుపక్షాలు ప్రస్తావించాయి. 2030 నాటికి 30,000 మంది భారతీయ విద్యార్థులను స్వీకరించేందుకు ఫ్రాన్స్ అంగీకరించింది. ఇక 'ఇండో-ఫ్రెంచ్ రక్షణ పారిశ్రామిక భాగస్వామ్య రోడ్‌మ్యాప్' ఇరుదేశాలనూ కొనుగోలుదారు-విక్రేత సంబంధాన్ని దాటి చూస్తోంది. మోదీ, మెక్రాన్‌ల మధ్య ఉన్న వ్యక్తిగత బంధం వల్ల కూడా ఈ పర్యటన ప్రత్యేకంగా మారింది.

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తన భారత పర్యటనను ఇటీవలే ముగించారు. ఇది ఇరుదేశాల మధ్య నిర్మాణాత్మకమైన పర్యటనగా మారవచ్చని భావిస్తున్నారు. ఆయన గణతంత్ర దినోత్సవ వేడుకలకు వచ్చిన గౌరవ అతిథి కావడం వల్ల ఈ పర్యటన సందర్భమే... ఆడంబరం, సంకేతాలతో కూడుకుని ఉన్నది. అయితే, ఆయన పర్యటనలో స్పష్టంగా కనిపించని అంశాన్ని చూడటం, భౌగోళిక-వ్యూహాత్మక చిక్కులను పరిశీలించడం చాలా ముఖ్యం.

భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ పరస్పరం చక్కగా కలిసిపోతారు. ఎమ్-ఎమ్ (మోదీ, మెక్రాన్) అంశం ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యానికి పలు విషయాలను జోడించింది: నిర్ణయం తీసుకోవడాన్ని వేగవంతం చేసింది, పైగా ఒక దార్శనికతను అందించింది. ఈ క్రమంలో, ఇది బ్యూరోక్రాటిక్ జడత్వాన్ని, అతి భారమైన ఆలోచనలను అధిగమించడంలో సహాయపడింది.

ప్రపంచ వ్యూహాత్మక రాజకీయాల్లో తీవ్రమైన అల్లకల్లోలం నేపథ్యంలో మెక్రాన్ తాజా పర్యటనను చూడాల్సి ఉంటుంది. రెండు ప్రధాన యుద్ధాలు జరుగుతున్నాయి. ఒకటి ఉక్రెయిన్‌లో, మరొకటి గాజాలో. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ కష్టంగా కనిపిస్తోంది. బహుళ పక్ష వాణిజ్య వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, ప్రపంచ వాణిజ్య సంస్థ అవసాన దశలో ఉండటం కారణంగా అంతర్జాతీయ వాణిజ్యం చిందరవందరగా ఉంది. ప్రబల శక్తి అయిన అమెరికా దేశీయ రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటోంది.

కనీవినీ ఎరుగని ఈ భౌగోళిక-వ్యూహాత్మక అస్థిరతను భారతదేశం ఎదుర్కోవాలంటే... నష్ట భయం తగ్గించుకోవాలి, దేశాలతో సంబంధాల్లో వైవిధ్యం పెంచుకోవాలి, బహుళ ఒడంబడికల ఆధారంగా విదేశాంగ విధానాన్ని కొనసాగించాలి. అమెరికా ఎల్లప్పుడూ భారతదేశానికి కీలకమైన వ్యూహాత్మక రక్షణ భాగస్వామిగా ఉంటుంది. అయితే, అది ఎప్పటికప్పుడు, కొన్ని దేశీయ ఒత్తిళ్లకు, చైనా-అమెరికా సంబంధాల స్థితి వంటి బాహ్య కారకాలకు కూడా లోబడి ఉంటుంది. జపాన్‌తో సంబంధాలను చూస్తే, భారతీయ వస్తూత్పత్తిలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు బలంగా ఉన్నాయి. కానీ రక్షణ, భద్రతా సహకారం జరిగే అవకాశం కాస్త పరిమితంగా ఉంది. రష్యా విషయానికి వస్తే, ఆ దేశ విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ భారతదేశ వైఖరి గురించి సానుకూలంగా వ్యాఖ్యానించారు. ఇతర శక్తులతో తన రక్షణ సంబంధాలను విస్తరించుకోవాలని భారత్ కోరుకోవడాన్ని రష్యా అర్థం చేసుకోగలదని ఆయన చెప్పడం గమనార్హం.

పై దృష్టాంతం ప్రకారం చూస్తే, ఫ్రాన్స్‌తో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం విపరీతమైన ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఇండో-ఫ్రెంచ్ సంబంధాలు... వ్యూహాత్మక ఏకీభావం, స్వయంప్రతిపత్తి, ఇరు దేశాలలోని అన్ని పార్టీల ఏకాభిప్రాయంపై ఆధారపడి ఉంటాయి. అయితే మోదీ, మెక్రాన్‌ల మధ్య ఉన్న అసాధారణమైన వ్యక్తిగత స్నేహసంబంధాలు... ఇండో-ఫ్రెంచ్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని నిజంగా ప్రత్యేకమైనదిగా మార్చింది.



ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, భారత ప్రధాని మోదీ

'బాసిల్ డే'(ఫ్రెంచ్ జాతీయ దినోత్సవం) ఉత్సవాల్లో పాల్గొనేందుకు మోదీ గత ఏడాది జూలైలోనే పారిస్‌కు వెళ్లారనీ, అప్పుడే ఇరు నేతలూ వివరణాత్మక పత్రం 'హొరైజన్ 2047'కు అంగీకరించారనీ పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుత పర్యటన నుండి కూడా నాటకీయ ప్రకటనలను ఆశించడం అవాస్తవికంగా ఉంటుంది. అయినప్పటికీ ఈ పర్యటన నుండి బయటపడిన అత్యంత ముఖ్యమైన ఫలితం 'ఇండో-ఫ్రెంచ్ రక్షణ పారిశ్రామిక భాగస్వామ్యం కోసం రోడ్‌మ్యాప్'. ఇది క్లాసిఫైడ్ అయినప్పటికీ, ఇందులోని అంశాలేమిటో చూచాయగా తెలుస్తున్నాయి. ఈ రోడ్‌మ్యాప్ ఇరుదేశాలనూ కేవలం కొనుగోలుదారు-విక్రేత సంబంధంలో చూడటం లేదు. భారత సాయుధ దళాల రక్షణ అవసరాలు తీర్చడమే గాక, సహ డిజైన్, సహ అభివృద్ధి, సహ ఉత్పత్తికి వీలు కల్పిస్తోంది. అంతేకాకుండా ఇతర స్నేహపూర్వక దేశాలకు నమ్మకమైన రక్షణ సామగ్రిని అందించేందుకూ అంగీకరిస్తోంది.

ఇది ప్రతిష్ఠాత్మకమైన ప్రణాళిక. ఇది 'ఆత్మనిర్భర్ భారత్'కు మాత్రమే కాకుండా 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి కూడా గణనీయంగా దోహదపడుతుంది. ఫ్రెంచ్ సంస్థ సాఫ్రెన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్‌ల గురించి మాత్రమే కాకుండా రాఫెల్ ఇంజిన్‌ల నిర్వహణ, మరమ్మతులు, కార్యకలాపాల స్థాపనలో పురోగతి గురించి ఉమ్మడి ప్రకటనలో సూచనలు ఉన్నాయి. సాఫ్రెన్, హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ సంస్థల మధ్య సమగ్ర భాగస్వామ్యం అనేది 100 శాతం సాంకేతికత బదిలీతో బహుళ-పాత్ర పోషించే హెలికాప్టర్ ఇంజిన్‌ల అభి వృద్ధికి ఉద్దేశించబడింది. అదనంగా, స్కార్పెన్ జలాంతర్గాములు భారత్‌లో గణనీయమైన స్వదేశీకరణతో నిర్మించడాన్ని కొనసాగిస్తాయి.

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ భాగస్వామ్యంతో ఎయిర్‌బస్ భారతదేశంలో పౌర హెలికాప్టర్ల అసెంబ్లింగ్‌ను ప్రారంభించనుంది. ఇది రెండు దేశాల ప్రైవేట్ రంగానికీ మొట్టమొదటిది. ఇరుపక్షాలు ఇప్పుడు ఒక ప్రత్యేకమైన ఉమ్మడి ట్రైసర్వీసెస్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నాయి. ఇరుదేశాల సంబంధాల్లో అంతరిక్ష రంగం కూడా ముఖ్యస్థానంలో ఉంది. రెండు దేశాలు ఆరు దశాబ్దాలకు పైగా అంతరిక్ష రంగంలో సహకరించుకున్నాయి. 2023 జూన్‌లో ప్రారంభించిన సంస్థాగత వ్యూహాత్మక అంతరిక్ష సంభాషణ మరింత ముందుకు సాగుతోంది. వాస్తవానికి, రక్షణ అంతరిక్ష భాగస్వామ్యంపై రెండు దేశాల రక్షణ మంత్రిత్వ శాఖల మధ్య అంగీకార లేఖ ఈ ఫలితాలలో ఒకటి. రక్షణ, అంతరిక్షం కలిసి ఈ భాగస్వామ్యాన్ని నడిపిస్తున్నాయి.

ఆసక్తికరమైన విషయమేమిటంటే, గాజాలో యుద్ధం కారణంగా చాలామంది అసాధ్యం అని భావిస్తున్న ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరోప్ కారిడార్ గురించి ఇరుపక్షాలు ప్రస్తావించాయి. రెండు వైపులా ఈ కార్యక్రమం గురించిన వ్యూహాత్మక ప్రాముఖ్యతను పునరుద్ఘాటించడమే కాకుండా, ప్రాజెక్ట్ కోసం ప్రత్యేక ప్రతినిధిని మెక్రాన్ నియమించడాన్ని మోదీ స్వాగతించారు. బహుశా, ఈ కీలకమైన ప్రాజెక్ట్‌ను కొనసాగించడానికి భారతదేశం కూడా అదే పని చేయాలి.

వ్యూహాత్మక భాగస్వామ్య కొనసాగింపు... స్పష్టంగా ఆవిష్కరణ, సాంకేతికతలపై ఆధారపడి ఉంటుంది. కృత్రిమ మేధ, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో సహకారాన్ని తీవ్రతరం చేయాలని ఇరుపక్షాలూ నిర్ణయించాయి. 2030 నాటికి 30,000 మంది భారతీయ విద్యార్థులను ఫ్రాన్స్ స్వీకరించడం గురించి ఫ్రెంచ్ అధ్యక్షుడు అంగీకరించారు. ఇది చాలావరకు సాధ్యమే. భారతదేశం - యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి ఇద్దరు నాయకులు తమ దృఢమైన మద్దతును పునరుద్ఘాటిస్తుండటం స్వాగతించదగినది. సాధారణ ఎన్నికల తర్వాత భారతదేశానికి ఈ ఒప్పందం ప్రధాన వాణిజ్య విధాన లక్ష్యాలలో ఒకటిగా ఉండాలి.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలతో భారతదేశం 30పైగా వ్యూహాత్మక భాగస్వామ్యాలను కలిగి ఉంది. వాటిలో కొన్ని పరస్పర అవసరాలపై, రాజకీయ ప్రయోజనాలపై ఆధారపడి ఉన్నాయి. కానీ ఇండో-ఫ్రెంచ్ భాగస్వామ్యం మాత్రం పరస్పర ఎంపికపై ఆధారపడి ఉంది. అంతేకాకుండా ఇది ప్రపంచ భౌగోళిక వ్యూహాత్మక సంబంధాలను పునర్నిర్మించే సామర్థ్యాన్ని కలిగి ఉంది.

వ్యాసకర్త ఫ్రాన్స్‌లో భారత మాజీ రాయబారి; ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ డీన్ ('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఇంత పరిజ్ఞానమా?



తమ స్టార్టప్ కంపెనీ న్యూరాలింక్‌లో మొదటి మానవ పేషెంట్‌కు మెదడు మార్పిడి జరిగిందని వ్యాపారవేత్త ఎలాన్ మస్క్ చెబుతున్నారు. భవిష్యత్తుకు స్వాగతం!

- హసన్ సజ్వానీ, యూఏఈ వ్యాపారవేత్త

కోపిస్తారు ప్రేమిస్తారు...

మెజారిటీ మూకల ఇబ్బందులకు గురైన, సుప్రీంకోర్టు నుంచి బెయిల్ వచ్చేదాకా మెజారిటీ రాజ్యం వల్ల 37 రోజులు జైల్లో గడిపిన ఒక గుజరాతీ ముస్లిం కమెడియన్ (మునవర్ ఫారూఖీ)... వరుసగా రెండు పెద్ద రియాలిటీ షోలలో విజయం సాధించాడు. ఇప్పుడు సూపర్‌స్టార్ అనిపించుకుంటున్నాడు. ఏమిటో, కొన్ని సార్లు ఇండియా చాలా చిత్రమైన దేశం!

- సిద్ధార్థ్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

తగిన మాటలేనా?



అక్రమంగా ఎన్నికయ్యారని అర్థం వచ్చేట్టుగా రష్యా అధ్యక్షుడు పుతిన్ గురించి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఒడిషాలో చులకనగా మాట్లాడారు. ఒత్తిళ్లు ఉన్నప్పటికీ దీర్ఘకాల మిత్రదేశమైన రష్యాతో మనం స్నేహం నెరుపుతున్నప్పుడు ఉత్తి పుణ్యానికి ఇలాంటి మాటలు మాట్లాడటం దేనికి? ఇవి దేశ విదేశాంగ విధానాన్ని బలహీనపరుస్తాయి.

- కన్వల్ సిబాల్, మాజీ దౌత్యవేత్త

పాకిస్తాన్‌లో అంతే!



నవాజ్ షరీఫ్‌కు ఒకప్పుడు పదేళ్ల జైలు శిక్ష పడింది. ఇప్పుడు ఇమ్రాన్ ఖాన్‌కు కూడా పదేళ్ల జైలు శిక్ష పడింది. ఎక్కడ మొదలుపెట్టామో మళ్లీ అక్కడికే వచ్చాం.

- అనస్ మాలిక్, పాకిస్తాన్ జర్నలిస్ట్


గెలిపించుకున్నారు!



చండీగఢ్ మేయర్ ఎన్నికల సారాంశం: కాంగ్రెస్, ఆప్‌కు కలిపి 20 ఓట్లున్నాయి. బీజేపీకి 15 ఓట్లున్నాయి. బీజేపీ అన్ని ఓట్లూ చెల్లి, కూటమి 8 ఓట్లు మాత్రం తిరస్కరణకు గురయ్యాయి. అలా బీజేపీ గెలిచింది. ఇందులో ఏ అపసవ్యతా లేదని ఇప్పటికీ మీరు అనుకుంటున్నారా?

- జాయ్‌దాస్, వ్యాఖ్యాత

దమ్మున్న ఆదర్శజీవి



'రేపు చనిపోతామేమో అన్నట్టుగా బతకాలి; ఎప్పటికీ బతికివుంటామేమో అన్నట్టుగా నేర్చుకోవాలి.' మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ గురించి తప్పుగా మాట్లాడటం తేలిక, కానీ ఆయన ఆదర్శాలతో జీవించడం కనీసం ఊహించడానికి కూడా కష్టం. 'బందే మే థా దమ్!' ('లగే రహో మున్నా భాయి' సినిమా పాటను ఉటంకిస్తూ. దమ్మున్న మనిషి అని అర్థం.) (జనవరి 30 మహాత్ముడి వర్ధంతి.)

- రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

బుద్ధెటుపోతుంది?



మరో విజయవంతమైన మిషన్‌లో భాగంగా భారతీయ నేవీ 19 మంది పాకిస్తానీ నావికా సిబ్బందినీ, 17 మంది ఇరానియన్లనూ సోమాలియా పైరేట్ల నుంచి రక్షించింది. అదే సమయంలో పాక్ రక్షణ దళాలు ఎన్నికలను రిగ్గింగ్ చేయడంలోనూ, భారత గడ్డ మీదికి తీవ్రవాద దాడులను పురిగొల్పడంలోనూ బిజీగా ఉన్నాయి.

- సోనమ్ మహాజన్, విశ్లేషకురాలు

ఇన్ బాక్స్

నోరులేని వారి గొంతుక

సమాజంలో ఓ వైపు తీవ్రమైన అంటరానితనం, మరోవైపు అణచివేతలు. ఎటువంటి హక్కులు లేకుండా ఊరి అవతల బతకవలసిన దుర్భర పరిస్థితుల్లో ఉన్న దళితుల బతుకులను మార్చడానికి అవిరామంగా కృషిచేశారు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్. ఈ కృషిలో భాగంగా మూగజీవుల్లాంటి దళితులకు గొంతుక అందించడం కోసం పత్రికలనూ స్థాపించారాయన. అందులో 'మూక్ నాయక్' (నోరులేనివారి నాయకుడు) దినపత్రిక ప్రముఖమైనది.

సరిగ్గా 104 సంవత్సరాల క్రితం 1920 జనవరి 31న అంబేడ్కర్ మూక్ నాయక్ పత్రికను స్థాపించారు. ఇది మరాఠీ భాషలో వచ్చిన పక్షపత్రిక. భారతదేశంలో తీవ్రమైన వివక్షను ఎదుర్కొంటున్న అణగారిన వర్గాల సమస్యలను యావత్తు ప్రపంచానికి తెలియజేయడానికి ఆయన ఎంచుకున్న గొప్ప వాహకం ఈ పత్రిక. దళితుల కోసం ఎవరూ గొంతెత్తని ఆ రోజుల్లో దళితుల కోసం ఏకంగా ఒక పత్రికను స్థాపించి వారి స్థితిగతులను ప్రపంచానికి తెలియజేయడంతోపాటూ దళితులను చైతన్యపరచే వ్యాసాలు రాసి ప్రచురించడం సాహసోపేతమైన చర్యే. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా దాదాపు మూడేళ్లకే ఈ పత్రిక మూతపడింది.

ఆ తరువాత 1927లో 'బహిష్కృత్ భారత్' పత్రికను స్థాపించి తిరిగి అసమానతలపై అక్షర చైతన్యాన్ని రగిలించే రచనలు చేశారు అంబేడ్కర్. ఈ పత్రికా నిర్వహణలోనూ ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దేశంలో జరుగుతున్న సామాజిక ఉద్యమాలకు మీడియా ప్రధాన వేదిక కావాలని అంబేడ్కర్ అభిప్రాయం. ఆ అభిప్రాయంతోనే పత్రికలు ఏర్పాటు చేసి దళిత జాతికి జరుగుతున్న అన్యాయాలపై కథనాలతో కదలికలు తెచ్చారు. అంబేడ్కర్ కాలంలో లానే నేటికీ కొన్ని ప్రధాన పత్రికల్లో దళితుల సమస్యలకు సముచిత స్థానం దక్కడం లేదు.

21వ శతాబ్దంలో దేశం మునుముందుకు దూసుకుపోతుందని కొందరు చెబుతున్నప్పటికీ... దళితుల జీవితాల్లో మాత్రం ఆశించినంతగా మార్పు రావడంలేదు. దళితుల మీద ప్రేమను ఒలకబోసే కొన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేస్తున్నాయే తప్ప వాటిని ఆచరణలో పెట్టడంలేదు. అందుకే మూక్ నాయక్ స్ఫూర్తితో దళితులు తమ హక్కుల సాధనకు ఉద్యమించాలి.

- సంపత్ గడ్డం, కామారెడ్డి జిల్లా

భువి నుంచి దివికేగిన పాట

సందర్భం



డా॥ ఐ.ఐ. మహ్మద్ హసన్

తెలంగాణ మాగాణంలో పుట్టిన విప్లవ తార గద్దర్. తన ఆట, పాటలను పనిముట్లుగా చేసుకొని ప్రజలను చైతన్యవంతం చేశారు. ప్రభుత్వాల గుండెల్లో గుబులు రేపారు. ఆయన అసలు పేరు గుమ్మడి విఠల్ రావు. నక్సలైట్ ఉద్యమంలో చురుకైన పాత్ర నిర్వహించారు. ఆ తర్వాత ఆ ఉద్యమానికి దూరంగా ఉంటూ కూడా తనదైన శైలిలో ప్రజోద్యమాల్లో పనిచేశారు. తొలి, మలి తెలంగాణ ఉద్యమాల్లో పాల్గొన్నారు. **'అమ్మ తెలంగాణమా ఆకలి కేకల గానమా'** అంటూ తెలంగాణ బతుకు చిత్రాన్నీ, దోపిడీ వ్యవస్థనూ, కళ్ళముందుంచారు. తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో ఊరు ఊరునా, వాడవాడలా ప్రజల్ని చైతన్యం చేయటంలో ప్రధాన భూమిక పోషించింది ఆ పాట. **'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా పోరు తెలంగాణమా'** అంటూ కాలికి గజ్జెకట్టి, నడుముకు ధోతి చుట్టి, భుజంపై గొంగడి, చేతిలో కర్ర, ఎర్ర రుమాలుతో తెలంగాణ ప్రాంతం మొత్తం చుట్టిన ఉద్యమవీరుడు గద్దర్. ఆయన అభినవ వాగ్గేయకారుడు. ఆయన ఇప్పుడు విడిచివెళ్లిన పాటను ఎవరు అందుకుంటారనేది ప్రశ్న.

తెలంగాణ సమాజం ప్రస్తుతం 'సంఘర్షణాత్మక స్తబ్దత' వాతావరణంలో ఉంది. అలాంటి స్తబ్దతను ఛేదించాలంటే ఒక గొప్ప కళాకారుడు అవసరం. సామాజిక అసమానతల పైనా, పాలకుల అవినీతి అక్రమాలపైనా పాట ద్వారా యుద్ధం చేయగల గద్దర్‌లాంటి యుద్ధ నౌక ఇప్పుడు అవసరం. **'కిర్రు కిర్రు చెప్పులోయమ్మ'** అన్నా, **'నిండు అమాసనాడు ఓ లచ్చ గుమ్మడి ఆడపిల్ల పుట్టిందని ఓ లచ్చ గుమ్మడి'** అంటూ అసమానతలపై పాటే అస్త్రంగా ఎక్కుపెట్టినా ఆయన ప్రతి పాటా మనల్ని



ఆలోచింపజేస్తుంది. అన్నాచెల్లెళ్ల అనుబంధానికీ, మానవ సంబంధాల గాఢతకూ నిలువెత్తు నిదర్శనం ... **'మల్లె తీగకు పందిరివోలే/ మసక చీకటిలో వెన్నెల వోలె/ నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మ / తోబుట్టిన ఋణం తీర్చుకుంటనే చెల్లెమ్మ'** అంటూ ఆయన రాసిన పాట.

ఒక్కసారి ప్రజా ప్రతినిధిగా గెలిచి కోట్లకు కోట్లు వేనకేసుకొని తరతరాలకు సరిపోయే ఆస్తులను పోగేసుకుంటున్న నాయకులు ఉన్న ఈ కాలంలో... కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేసి తన ఆట పాటల ద్వారా అందరి గుండెల్లో చెరగని ముద్ర వేసి వాటిని మనకు వదిలి వెళ్లిపోయారాయన.

అజ్ఞాతంలో ఉన్నప్పుడే ఎన్నోసార్లు ఎన్‌కౌంటర్ నుండి బయటపడ్డారు. కానీ అజ్ఞాతం వీడి జన జీవన ప్రవంతిలోకి వచ్చాక ఉమ్మడి రాష్ట్రంలో ఆయనపై హత్యా ప్రయత్నం జరిగింది. శరీరంలోకి బుల్లెట్లు దూసుకుపోయినా మృత్యువు నుండి బయటపడి తిరిగి ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేశారు. ఆయన మృతి చెందేనాటికి కూడా వెన్నెముకలో ఒక తూట అలాగే ఉంది.

సుమారు 5 దశాబ్దాల పాటు సాంస్కృతిక చైతన్యాన్నీ, సామాజిక వైరుధ్యాల మార్పునూ కోరుతూ చేసిన ఆయన పోరాటం అమరం. ఆయనలా ఆలోచింపజేసిన వ్యక్తి బహుశా అరుదనే చెప్పవచ్చు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాల మీద ఒక సిద్ధాంతంతో పోరాడిన వారి గురించి మనం చరిత్రలో చదువుకున్నాం. రాజరిక పాలన, నియంతృత్వ విధానాల మీద ప్రజలతో మమేకమై పోరాడిన నాయకులనూ చూశాం. కానీ ఆధునిక ప్రజాస్వామ్య యుగంలో సామాజిక చైతన్యం ద్వారా రాజకీయ మార్పు తీసుకురావడానికి తన కలాన్నీ, గళాన్నీ ఉపయోగించిన గద్దర్‌లాంటి వ్యక్తులు మాత్రం ఒకరిద్దరే కనిపిస్తారు అంటే అతిశయోక్తి కాదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఎంతగా రాసినా ఒడువని పరిశోధనా వ్యాసం గద్దర్!

వ్యాసకర్త తెలుగు బోధకులు । 99080 59234

(నేడు గద్దర్ జయంతి)

ధర్మ స్వరూపం

మహాభారతానికి కురుపాండవుల కథ దేహం వంటిదనీ, అందులోని శాంతి పర్వం ఆత్మ వంటిదనీ చెబుతారు. కురుక్షేత్ర యుద్ధానంతరం శరతల్పగతుడైన భీష్ముడు ధర్మరాజుకు చేసిన ధర్మప్రబోధమే ఆ ఆత్మ.

రాజధర్మం, ఆపద్ధర్మం, మోక్ష ధర్మం, ధర్మ సూక్ష్మం - ఇట్లా ధర్మం అనేక విధాలుగా ఉన్నది. రాజు ప్రజాహితం కోరి, ఆత్మనిగ్రహం కలిగి, ప్రజాపాలన చేయటం ఉత్తమ రాజధర్మం. కపట ఉద్యోగులు ప్రజలను బాధింపకుండా చూడాలి. ప్రజలను పీడించి అధికంగా పన్నులు వసూలు చేయరాదు.

తల్లి, తండ్రి, గురువు - వీరిని సేవించాలి. వీరిలో తల్లి ఎక్కువ గౌరవనీయురాలు. సత్యం పలకటం అన్ని ధర్మాల్లో కెల్లా మిన్న. అయితే ప్రాణులకు బాధ కలిగించే సత్యం, పాపంతో సమానం. ప్రాణులకు మేలు చేసేది అసత్యమైనా సరే, అదే పరమ ధర్మం. ఇది ధర్మ సూక్ష్మం.

ఆహారం దొరక్క ప్రాణం పోయే స్థితి దాపురించినప్పుడు, ఎలాంటి ఆహారాన్ని అయినా సంకోచించకుండా తిని, ఎట్లయినా ప్రాణాన్ని నిలుపుకోవటమే ఆపద్ధర్మం.

రాగ ద్వేషాలు విడిచి, ప్రియ, అప్రియ విషయాల పట్ల సమభావం కలిగి ఉండటం మోక్ష ధర్మం.

చివరికి ధర్మరాజు ధర్మ స్వరూపం ఏమిటో దానిని వివరింపమని కోరగా, భీష్ముడు చెబుతాడు:

ఒరులేయవి యొనరించిన
నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి,
పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్

ఇతరులు ఏవి మనకు చేస్తే, మన మనస్సుకు కష్టం కలుగుతుందో, అవి మనం ఇతరులకు చేయకుండా ఉండటం అన్ని ధర్మాల్లోకెల్లా గొప్ప ధర్మం. ధర్మసారాన్ని ఇంత సులభగ్రాహ్యంగా వివరించటం, ఒక్క భీష్ముల వారికే చెల్లింది.

- దీవి సుబ్బారావు



సచివాలయంలో సీఎంతో బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, తదితరులు

న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించండి

సీఎంను కలిసిన తెలంగాణ బార్ కౌన్సిల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డికి తెలంగాణ బార్ కౌన్సిల్ విజ్ఞప్తి చేసింది. బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు మంగళవారం సచివాలయంలో సీఎంను కలిశారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేల స్టైపెండ్, అర్హులైన న్యాయవాదులకు ఇళ్ల స్థలాలివ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు సునీల్‌గౌడ్, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు కిరణ్ పాల్గొన్నారు.

'మూడు దారులు' పుస్తక పరిచయ సభ రేపు

సాక్షి, హైదరాబాద్: సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ రచించిన 'మూడు దారులు' పుస్తక పరిచయ సభ ఫిబ్రవరి 1న హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నారు. ఈ పుస్తకం ఆవిష్కరణ సభ విజయవాడలో జనవరి 27వ తేదీన నిర్వహించారు. న్యూఢిల్లీలోని ప్రతిష్టాత్మక రూపా పబ్లికేషన్స్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఇదే పుస్తకాన్ని అమర్ ఇంగ్లిష్‌లో (ది దక్కన్ పవర్‌ప్లే) కూడా రచించారు. పుస్తక పరిచయసభకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జె.చలమేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. సీనియర్ పాత్రికేయులు కల్లూరి భాస్కరం మూడుదారులు పుస్తకాన్ని సమీక్షిస్తారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డి, చంద్రబాబు, వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముగ్గురివీ ప్రజాసేవలో భిన్నమైన దారులు. ఈ ముగ్గురూ రాజకీయాల్లో ఎంచుకున్న దారుల గురించి, అనుసరించిన పద్ధతుల గురించి ఈ పుస్తకం విశ్లేషిస్తుంది.

బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు అడ్డుకోండి

పోలీసుల తీరుపై డీజీపీకి భువనగిరి జెడ్పీ చైర్మన్ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్/బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల పరిధిలోని గూడూరు గ్రామంలో తనపై జరిగిన దాడి ఘటనలో పక్షపాత ధోరణితో వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలతో కలిసి మంగళవారం డీజీపీ రవిగుప్తాకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడాన్ని అడ్డుకోవాలన్నారు. కాంగ్రెస్ నేతలకు వత్తాసు పలకకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించేలా పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. 'కేబినెట్ హోదాలో ఉన్న నేను అధికారిక కార్యక్రమంలో పాల్గొనగా మంత్రి కోమటిరెడ్డి నాపై వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారు. అయినా పోలీసు అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి నన్ను సభ నుంచి నెట్టుకెళ్లారు. నాపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడిచేస్తున్నా అక్కడే ఉన్న పోలీసు అధికారులు పట్టించుకోలేదు' అని సందీప్‌రెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. డీజీపీని కలిసిన వారిలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యేలు సైదిరెడ్డి, భాస్కర్‌రావు, కోరుకంటి చందర్, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ దీపిక, బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు రావుల శ్రీధర్‌రెడ్డి, రాకేశ్‌కుమార్ తదితరులున్నారు.

రేవంత్ ఒక్కరోజు ప్రజాదర్బార్‌కు వచ్చి మాయం

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ధ్వజం.. మీడియాపైనా ఆగ్రహం

బెల్లంపల్లి: మీడియా, యూట్యూబర్లపై మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కారు. మంగళవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఓటమికి యూట్యూబ్ చానళ్లు, మీడియా చేసిన దుష్ప్రచారం తోడైందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరోజు ప్రజాదర్బార్‌కు వచ్చి మాయమయ్యారని, మళ్లీ అటువైపే రావడం లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి ప్రజలను కలుస్తలేరని, ప్రగతి భవన్‌కు కంచెలు వేశారని మీడియా, యూట్యూబ్ చానళ్లు ప్రచారం చేశాయని మండిపడ్డారు. ఇప్పుడు సీఎం ప్రజలను కలుస్తున్నారా అని ప్రశ్నించారు. అప్పుడు మాట్లాడిన యూట్యూబ్ చానళ్లు, అబద్ధం ప్రచారం చేసిన పత్రికలు, టీవీలు ఇప్పుడు ఏం సమాధానం చెబుతాయని ప్రశ్నించారు. 'చూపిస్తరా, ముఖ్యమంత్రి ప్రజలను కలిసే సీన్ ఇప్పుడుందా..? ఇవ్వాళా ఆ గొట్టాలు మూగబోయినయా, ఆ పత్రికలకు పెన్ను వస్త లేదా..' అని ఆగ్రహంతో ఊగిపోయారు. కాగా, సమావేశం అనంతరం ప్రశాంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను మైకుల ద్వారా చేసిన ప్రచారం గురించి మాట్లాడానే కానీ, మీడియాను ఉద్దేశించి అనలేదని చెప్పారు. మీడియాను టార్గెట్ చేసి మాట్లాడలేదని పేర్కొనడం కొసమెరుపు.

ప్రాణాలు తీసిన అతివేగం

- అదుపుతప్పి చెట్టును ఢీకొన్న బైక్
- ఘటనా స్థలంలో యువకుడి మృతి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు..
- మరో యువకుడి పరిస్థితి విషమం



వంశీకృష్ణ (ఫైల్)



మహేశ్ (ఫైల్)

ఓదెల (పెద్దపల్లి): అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలు బలితీసుకుంది. మరో యువకుడి ప్రాణాల మీదకు తెచ్చింది. పెద్దపల్లి జిల్లా పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి గోపరపల్లె గ్రామ శివారులో ఈ ఘటన చోటుచేసుకుంది. పొత్కపల్లి ఎస్సై నూతి శ్రీధర్ కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోపరపల్లెకు చెందిన దాసరి వంశీకృష్ణారెడ్డి, కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన జీల మహేశ్, సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి చెందిన పసెడ్ల సంజయ్ మంచి మిత్రులు. వీరు ఇంటర్ చదువుతున్నారు. సంజయ్, మహేశ్ కలిసి బైక్‌పై వంశీకృష్ణారెడ్డి ఇంటికి సోమవారం రాత్రి చేరుకున్నారు. సంజయ్ బర్త్‌డే వేడుకలు జరుపుకునేందుకు ముగ్గురూ కలిసి బైక్‌పై పెగడపల్లికి బయలు దేరారు. ఈక్రమంలో వేగంగా నడుపుతున్న వాహనం మూలమలుపు వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో బైక్ నడుపుతున్న సంజయ్‌తో పాటు వంశీకృష్ణారెడ్డి, మహేశ్ తీవ్రంగా గాయపడ్డారు. వంశీకృష్ణారెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు. మిగతా ఇద్దరిని ఆస్పత్రికి తరలించగా, మహేశ్ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. సంజయ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మృతదేహాలకు సుల్తానాబాద్ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. సంఘటన స్థలాన్ని సుల్తానాబాద్ సీఐ జగదీశ్, పొత్కపల్లి ఎస్సై శ్రీధర్‌లు సందర్శించారు. బైక్‌ను అతివేగంగా నడిపి ప్రమాదానికి కారకుడైన పసెడ్ల సంజయ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, వంశీకృష్ణారెడ్డి, మహేశ్ స్వగ్రామాలు గోపరపల్లె, పెగడపల్లిలో విషాదం నెలకొంది. స్నేహితుడి బర్త్‌డే వేడుకలకు వెళ్లిన తమ కుమారులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వారి తల్లితండ్రులు, బంధువుల కన్నీటిపర్యంతమవుతున్నారు.

బాలికపై యువకుడి లైంగికదాడి

ధర్మపురి: బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. జగిత్యాల జిల్లా ధర్మపురిలో జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం ధర్మపురికి చెందిన కల్లూరి అర్జున్ (21) జల్సాలకు అలవాటు పడి జులాయిగా తిరుగుతుంటాడు. ఇదే పట్టణానికి చెందిన బాలిక (12) స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. ఈనెల 24న ఎప్పట్లాగే పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం సమయంలో ఇంటికి తీసుకెళ్తానని చెప్పి అర్జున్ బాలికను ఊరి శివారులోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. రాత్రి సమయంలో ఇంటికి చేరిన కూతురిని తల్లి మందలించడంతో జరిగిన విషయాన్ని తెలిపింది. దీంతో బాలిక తల్లి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. డీఎస్పీ వెంకటస్వామి ఆధ్వర్యంలో ఎస్‌ఐ దత్తాత్రి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు అర్జున్‌పై పోక్సో చట్టంకింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.



తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగా తీరం జనహోరాన్ని తలపిస్తోంది. పెన్‌గంగా జాతరలో భాగంగా మహారాష్ట్రతో పాటు ఆదిలాబాద్ జిల్లా జైనథ్, బేల మండలాల్లోని చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. నదికి ఇరువైపులా (ఇటు తెలంగాణ, అటు మహారాష్ట్ర) పుణ్యస్నానాలు ఆచరించి, నదిమా తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆదిలాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతమైన దొల్లారా వద్ద నదీతీరం ఎటు చూసినా ఇలా భక్తజన సందడిగా దర్శనమిచ్చింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

కమిటీతోనైనా కథ ముగిసేనా?

నిజాం షుగర్స్ పునరుద్ధరణపై ప్రభుత్వ కమిటీ

- మంత్రి శ్రీధర్‌బాబుకు కమిటీ సారథ్య బాధ్యతలు
- గతంలోనే లిక్విడేషన్‌కు అనుమతిచ్చిన ఎన్‌సీఎల్‌టీ
- ఎన్‌సీఎల్‌టీ తీర్పుపై గతంలోనే సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం
- నాలుగున్నరేళ్లుగా అప్పిలేట్ కోర్టులోనే నలుగుతున్న కేసు
- చంద్రబాబు హయాంలో డెల్టా పేపర్ మిల్లుకు అప్పగింత



సాక్షి, హైదరాబాద్: నష్టాలతో మూత పడిన నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్‌ఎల్) ఆస్తులను విక్రయించి బ్యాంకులు, ఇతర సంస్థలకు బకాయిలు చెల్లించాల్సిందిగా సుమారు నాలుగున్నర ఏళ్ల క్రితం నేషనల్ కంపెనీ ఆఫ్ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) తీర్పునిచ్చింది. నిజాం షుగర్స్ పునరుద్ధరణ మార్గాలు మూసుకుపోవడంతో ఆస్తుల విక్రయం (లిక్విడేషన్) మినహా మరో మార్గం లేదని గతంలోనే స్పష్టం చేసింది. ఎన్‌సీఎల్‌టీ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసినా ఏళ్ల తరబడి నిజాం దక్కన్ షుగర్స్ భవితవ్యం కొలిక్కిరావడం లేదు. ఈ నేపథ్యంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఎన్‌డీఎస్‌ఎల్‌ను తిరిగి తెరిపిస్తామంటూ 'పునరుద్ధరణ కమిటీ'ని ప్రకటించింది. ఈ కమిటీలో మరో మంత్రి దామోదర రాజనర్సింహ సహ చైర్మన్‌గా, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పి.సుదర్శన్‌రెడ్డి, రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఎ.చంద్రశేఖర్‌తో పాటు ఆర్థిక, పరిశ్రమలు, వ్యవసాయ శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు. ఎన్‌డీఎస్‌ఎల్‌ను తిరిగి తెరవడం లక్ష్యంగా ఏర్పాటైన నిజాం షుగర్స్ పునరుద్ధరణ కమిటీ రెండు నెలల్లోగా నివేదిక ఇవ్వాలనే ప్రభుత్వ ఆదేశాలు ఎంత మేర ఫలిస్తాయనే చర్చ జరుగుతోంది.

చంద్రబాబు హయాంలో ప్రైవేటు పరం

ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో 1937లో ఏర్పాటైన నిజాం చక్కెర కర్మాగారం (ఎన్‌ఎస్‌ఎల్) 1990వ దశకం నాటికి నష్టాల బాట పట్టింది. నష్టాల నుంచి నిజాం షుగర్స్‌ను గట్టెక్కిస్తామనే నెపంతో 2002లో నాటి ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 51 శాతం వాటాను డెల్టా పేపర్ మిల్లుకు విక్రయించింది. దీంతో దశాబ్దాల తరబడి ఎన్‌ఎస్‌ఎల్‌గా పేరొందిన నిజాం షుగర్స్ ఎన్‌డీఎస్‌ఎల్‌గా పేరు మార్చుకుంది. ప్రైవేటు సంస్థకు 51 శాతం వాటా అప్పగించడంపై అప్పట్లో పలు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే నష్టాల నుంచి గట్టెక్కే పరిస్థితి లేకపోవడంతో ఎన్‌డీఎస్‌ఎల్‌ను మూసివేస్తున్నట్లు 2015 డిసెంబర్‌లో యాజమాన్యం ప్రకటించింది. పరిశ్రమ ఆస్తులను విక్రయించి అప్పులు చెల్లించేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా ఎన్‌డీఎస్‌ఎల్ యాజమాన్యం ప్రభుత్వాన్ని కోరింది. అయితే ఈ ప్రతిపాదనను తిరస్కరించిన రాష్ట్ర ప్రభుత్వం రైతుల భాగస్వామ్యంతో సహకార రంగంలో ఎన్‌డీఎస్‌ఎల్‌ను నడిపేందుకు 2015 ఏప్రిల్‌లో కార్యదర్శుల కమిటీని కూడా ఏర్పాటు చేసింది. డెల్టా పేపర్ మిల్లుకు చెందిన 51 శాతాన్ని టేకోవర్ చేయడంలో సాధ్యాసాధ్యాలను పరిశీలించి 3 నెలల్లో నివేదిక ఇవ్వాల్సిందిగా జీఓఎంఎస్ 28ను కూడా జారీ చేసింది.

ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన ఎన్‌డీఎస్‌ఎల్

అప్పులు పెరిగినందున దివాలా పరిశ్రమగా గుర్తించాలని ఎన్‌డీఎస్‌ఎల్ 2017లో నేషనల్ కంపెనీ ఆఫ్ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. అప్పులు తీర్చేందుకు కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రిసొల్యూషన్ ప్రాసెస్ ప్రారంభించాలని కోరడంతో రుణదాతలతో సంప్రదింపులు జరిపేందుకు ఎన్‌సీఎల్‌టీ లిక్విడేటర్‌ను కూడా నియమించింది. 2017 అక్టోబర్ నుంచి 2018 సెప్టెంబర్ వరకు 11 పర్యాయాలు రుణదాతలతో సంప్రదింపులు జరిపినా పునరుద్ధరణ అంశం కొలిక్కి రాలేదు. పరిశ్రమ కొనుగోలుకు ముందుకు వచ్చిన కొన్ని సంస్థలు ఎన్‌డీఎస్‌ఎల్ ఆస్తులు, అప్పులు పరిశీలించి వెనకడుగు వేశాయి. నాలుగున్నరేళ్ల క్రితం సంస్థకు రూ.360 కోట్ల అప్పులు ఉండగా, ఆస్తుల విలువ కూడా అంతే ఉన్నట్లు తేలింది. సంస్థ పునరుద్ధరణ, అమ్మకం ప్రయత్నాలు కొలిక్కి రాకపోవడంతో ఎన్‌సీఎల్‌టీ లిక్విడేషన్‌కు అనుమతిచ్చింది. ఎన్‌సీఎల్‌టీ తీర్పుపై 2019లో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా, నేటికీ ఆ కేసులో పురోగతి లేదు. ఎన్‌డీఎస్‌ఎల్‌పై ఇప్పటికే హౌజ్‌కమిటీ, కార్యదర్శుల కమిటీ వంటివి ఏర్పాటైనా సంస్థ మనుగడపై స్పష్టత ఇవ్వలేకపోయాయి. ఈ నేపథ్యంలో నిజాం దక్కన్ షుగర్స్‌ను పునరుద్ధరిస్తామంటూ తాజాగా కమిటీని ఏర్పాటు చేసింది. రెండు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని గడువు నిర్దేశించింది.

నేటితో ముగియనున్న సీఎంఆర్ గడువు

- గత ఖరీఫ్‌నకు సంబంధించి మరో నెల రోజుల టైమ్ ఇవ్వాలని కోరుతున్న మిల్లర్లు
- ఢిల్లీకి వెళ్లిన కమిషనర్ డీఎస్.చౌహాన్



సాక్షి, హైదరాబాద్: గతేడాది ఖరీఫ్‌నకు సంబంధించిన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) డెలివరీ బుధవారంతో ముగియనుంది. ఆ సీజన్‌లో మిల్లర్లు ఎఫ్‌సీఐకి ఇవ్వాల్సిన బియ్యం బకాయిలు ఇంకా పూర్తి కాలేదు. అయితే ఇప్పటికే పలుమార్లు గడువు పొడిగించిన నేపథ్యంలో కేంద్రాన్ని గడువు కోరవద్దని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మిల్లర్లు, అధికారులపై ఒత్తిడి తెచ్చి 50 రోజుల్లో 20 ఎల్‌ఎంటీ మేర బియ్యం సేకరించింది. ఇంకా 2022–23 సీజన్‌కు సంబంధించి మరో 4.80 ఎల్‌ఎంటీ ఎఫ్‌సీఐకి రావాల్సి ఉన్నా, రైస్‌మిల్లర్లు డెలివరీ చేయడంలో విఫలమయ్యారు. కాగా సీఎంఆర్ డెలివరీ గాడిన పడుతున్న నేపథ్యంలో మరో నెలరోజుల గడువు పొడిగించాలని మిల్లర్లు కోరుతున్నారు. నెల రోజుల్లో పూర్తిస్థాయిలో బియ్యం ఎఫ్‌సీఐకి ఇస్తామని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఢిల్లీకి వెళ్లారు. రెండు రోజులుగా అక్కడే ఉన్న సీఎంఆర్ గడువు పొడిగింపునకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. కనీసం నెల రోజుల టైమ్ ఇస్తే.. గతేడాది ఖరీఫ్ సీఎంఆర్ బకాయిలు పూర్తిచేసే అవకాశం ఉంటుంది. లేకపోతే 4.80 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల వద్దనే ఉండిపోతుంది. దీని విలువ కనీసం రూ.1,872 కోట్లు ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత రికవరీ చేయటం కూడా కష్టంగా ఉంటుంది. ఎఫ్‌సీఐకి బదులుగా సివిల్ సప్లయీస్ కోటా కింద తీసుకోవాల్సి వస్తుంది. కానీ సివిల్ సప్లయ్ తీసుకునేది లేదని చెప్పిన నేపథ్యంలో నెల రోజుల గడువు పెంచాలని భావిస్తున్నట్టు తెలిసింది. అందుకే ఢిల్లీలో లాబీయింగ్ చేస్తున్నట్టు సమాచారం.

గత ఏడాది రబీ ధాన్యం వేలానికి...

కాగా నిరుడు యాసంగి సీజన్‌కు సంబంధించిన బియ్యం బకాయిలు 32.74 లక్షల మెట్రిక్ టన్నులు ఉన్నాయి. అంటే 50 ఎల్‌ఎంటీ ధాన్యం గోడౌన్‌లలో ఉంది. ఇందులో 35 ఎల్‌ఎంటీ ధాన్యాన్ని వేలం వేయాలని ప్రభుత్వం నియమించిన కమిటీ నిర్ణయించింది టెండర్లు కూడా ఆహ్వానించింది. కాగా ధాన్యం టెండర్లకు సంబంధించిన ప్రీ బిడ్డింగ్ సమావేశం బుధవారం పౌరసరఫరాలభవన్‌లో నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి కమిషనర్ డీఎస్.చౌహాన్ హాజరయ్యే అవకాశాలున్నాయి.

బీసీ హక్కుల సాధనకు 'యునైటెడ్ ఫూలే ఫ్రంట్'

ఫిబ్రవరి బుద్ధిస్ట్ సమావేశానికి కవితను ఆహ్వానించిన యూపీఎఫ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో వెనుకబడిన తరగతుల (బీసీలు) హక్కుల సాధన కోసం 'యునైటెడ్ పూలే ఫ్రంట్' (యూపీఎఫ్) ఆవిర్భవించింది. ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలోని భారత జాగృతితో కలిసి ఉద్యమాలు చేపట్టాలని యూపీఎఫ్ నిర్ణయించింది. అసెంబ్లీలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ సాధన కోసం మేధావులు, బీసీ సంఘాలు, ప్రజాసంఘాలతో కలిసి భారత జాగృతి చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ పలువురు బీసీ సంఘాల నాయకులు మంగళవా రం హైదరాబాద్‌లో కవితను కలిశారు. యూపీఎఫ్ కార్యాచరణలో భాగంగా ఫిబ్రవరి రెండో వారంలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేపడతామన్నారు. ఈ మహాధర్నాకు అన్ని బీసీ సంఘాలు, ప్రజా సంఘాలను ఆహ్వానించాలని నిర్ణయిచారు. అసెంబ్లీలో పూలే విగ్రహ సాధన కోసం ఫిబ్రవరి 5 నుంచి 10వ తేదీల మధ్య అన్ని జిల్లాలతో పాటు యూనివర్సిటీల్లో రౌండ్ టేబుల్ సమావేశాలను నిర్వహించాలని యూపీఎఫ్ నిర్ణయించింది. ఏప్రిల్ 11న పూలే జయంతిలోగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేస్తారు. ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో నాందేడ్ జిల్లా కినావట్‌లో నిర్వహించనున్న 13వ బుద్ధిస్ట్ కౌన్సిల్ సమావేశానికి కవితను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.

వైద్య విద్యలో 'వెనుకబాటు'

▶ మొదటి పేజీ తరువాయి

మహిళలు ఎక్కువగా ఉంటున్నా, ఎంఎస్, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు వచ్చేసరికి వారి శాతం చాలా తక్కువగా ఉంటోంది. ఆ కోర్సులు సాధించడం, వాటిని పూర్తి చేయడానికి వయసు మీద పడటం ఒక కారణంగా చెబుతుండగా, పెళ్లి, పిల్లలు తదితర కారణాల వల్ల కూడా వాటిని చదవడానికి ముందుకు రావడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎంబీబీఎస్‌లో ఓబీసీలు 24.4%

సర్వేలో భాగంగా ఎంబీబీఎస్ పాసైన 54,547 మందిని ఎంపిక చేశారు. వారిలో పురుషులు 26,474 మంది (49 శాతం), మహిళలు 28,073 (51 శాతం) మంది ఉన్నారు. ఎంబీబీఎస్‌లో ఎస్సీలు 4,539 మంది (పురుషులు 2,310 మంది, మహిళలు 2,229 మంది) ఉండగా, వీరి శాతం 8.3గా ఉంది. ఇక ఎస్టీలు 2,100 మంది (పురుషులు 1008, మహిళలు 1092 మంది) ఉన్నారు. వీరి శాతం 3.8 శాతంగా ఉంది. ఓబీసీల్లో మొత్తం 13,350 మంది (పురుషులు 6,682, మహిళలు 6,668 మంది) ఉండగా, వీరు 24.4 శాతంగా ఉన్నారు. దివ్యాంగులు 112 (0.2 శాతం) మంది ఉన్నారు. ముస్లింలు 2,005 మంది ఉన్నారు. వారిలో పురుషులు 929 మంది, మహిళలు 1079 మంది ఉన్నారు. వీరి శాతం 3.6 శాతంగా ఉంది. ఇతర మైనారిటీలు 1,178 (2.1శాతం) ఉన్నారు. ఈడబ్ల్యూఎస్‌లో 210 (0.4 శాతం) మంది ఉన్నారు. ఇక ఓసీలు 57 శాతం మంది ఉన్నారు.

ఎండీల్లో ఎస్సీ, ఎస్టీలు 11.3%

ఎండీ కోర్సుల్లో జనరల్ మెడిసిన్, అనస్థీషియా, చెస్ట్, రేడియాలజీ, పాథాలజీ, పీడియాట్రిక్ వంటివి వస్తాయి. ఎండీ కోర్సుల్లో 15,732 మందిని సర్వే చేశారు. అందులో పురుషులు 7,343 (46 శాతం), మహిళలు 8,389 (54 శాతం)మంది ఉన్నారు. ఇక ఎస్సీలు 1,220 (7.7 శాతం) మంది, ఎస్టీలు 561 (3.6 శాతం) మంది, ఓబీసీలు 3,404 (22 శాతం)మంది, దివ్యాంగులు 12 (0.08%)మంది, ముస్లింలు 543 (3.5%)మంది, ఇతర మైనారిటీలు 357 (2.2%) మంది, ఈడబ్ల్యూఎస్ 187 (1.2%) మంది ఉన్నారు. ఓసీలు 59 శాతం.

ఎంఎస్ కోర్సుల్లో ముస్లింలు 3.3%

ఎంఎస్ కోర్సుల్లో జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, చెవి, ముక్కు, కంటి తదితర సర్జరీ కోర్సు లు వస్తాయి. ఎంఎస్‌లో 4,713 మందిని సర్వే చే శారు. అందులో పురుషులు 2,521 (53%)మంది, మహిళలు 2,192 (47%) మంది ఉన్నారు. ఇక ఎ స్సీలు 337 (7.1%)మంది, ఎస్టీలు 128 (2.7%), ఓబీసీలో 1021 (21.6%)మంది, ముస్లింలు 155 (3.3%) మంది, ఇతర మైనారిటీలు 102 (2.1%) మంది, ఈడబ్ల్యూఎస్‌లో 8 (0.2%) మంది ఉండగా, ఓసీలు 63 శాతంగా ఉన్నారు.

డీఎం కోర్సుల్లో ఓసీలు 89 శాతం

మెడికల్ సూపర్ స్పెషాలిటీ (డీఎం కోర్సులు)ల్లో గ్యాస్ట్రోఎంట్రాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూ రాలజీ, ఎండోక్రైనాలజీ తదితర కోర్సులు వస్తా యి. వీటిల్లో 469 మందిని సర్వే చేశారు. పురుషులు 362 (77%), మహిళలు 107 (23%) మంది ఉన్నారు. ఎస్సీలు ఏడుగురు (1.49%), ఎస్టీలు ముగ్గురు (0.6%), ఓబీసీలు 29 (6%), ముస్లింలు 0.6%, ఇతర మైనారిటీలు 9 (1.91%) మంది ఉండగా, ఓసీలు 89 శాతం మంది ఉన్నారు.

ఎంసీహెచ్ కోర్సుల్లో మహిళలు 15 శాతమే: ఎంసీహెచ్ (సర్జికల్ సూపర్ స్పెషాలిటీలు) జీర్ణకోశ, యూరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూరో సర్జరీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, వ్యాస్కులర్ సర్జరీ తదితర కోర్సులు ఉంటాయి. వీటిల్లో 337 మంది ని సర్వే చేశారు. పురుషులు 287 (85%), కేవలం మహిళలు 50(15) మంది మాత్రమే ఉన్నారు. ఎ స్సీలు ఏడుగురు (2%), ఎస్టీలు ముగ్గురు (1%), ఓబీసీలు 15 (4.4%), ముస్లింలు ఒకరు, ఇతర మైనారిటీలు ముగ్గురు ఉన్నారు. ఈడబ్ల్యూ ఎస్‌లో ఒకరు ఉండగా, ఓసీలు 90 శాతంగా ఉన్నారు.

ఎంసీఐ దృష్టిసారించాలి..: ఎంబీబీఎస్, ఎండీ కోర్సుల్లో మహిళలు ఎక్కువగా చేరుతుంటే, ఆ తర్వాత సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో పురుషుల శాతమే ఎక్కువగా ఉంటోందని నివేదిక చెబుతోంది. దీనికిగల కారణాలను అన్వేషించాల్సిన అవసరముంది. దీనిపై జాతీయ మెడికల్ కమిషన్ దృష్టిసారించాలి.

– డాక్టర్ కిరణ్ మాదల,
సైంటిఫిక్ కమిటీ కన్వీనర్, ఐఎంఏ, తెలంగాణ

జీపీల్లో ప్రత్యేక పాలనకు రంగం సిద్ధం!

- ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వం
- 12,779 పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్ల నియామకం

సాక్షి, హైదరాబాద్: ఫిబ్రవరి 2 నుంచి గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనకు రంగం సిద్ధమైంది. దీనికి సంబంధించి ప్రభుత్వపరంగా ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఫిబ్రవరి 1న గ్రామసర్పంచ్‌లు, పంచాయతీ పాలక మండళ్ల పదవీ కాలం ముగియనుండటంతో, మళ్లీ పంచాయతీ ఎన్నికలు జరిగి సర్పంచ్‌లను ఎన్నుకునే దాకా గ్రామాల్లో అభివృద్ధి, ఇతర కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యేక అధికారుల నియామకం తప్పనిసరైంది. రాష్ట్రంలోని 12,779 పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాల్సి ఉండటంతో మండలస్థాయిలో వివిధ శాఖల్లోని గెజిటెడ్ అధికారులతో పాటు కొన్నిచోట్ల సీనియర్, జూనియర్ అసిస్టెంట్లకు కూడా బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇందుకు సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ల ద్వారా మండలస్థాయిలో అధికారుల నియామకంపై ఆర్డర్లు పంపించినట్లు తెలుస్తోంది. ఒకట్రెండు రోజుల్లో వారికి ఈ ఉత్తర్వులు అందనున్నట్లు సమాచారం. ఈ బాధ్యతల్లో ఎంపీడీవో, ఎంపీవో, పీఆర్ ఏఈ, మిషన్‌భగీరథ ఏఈ, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లు, తహసీల్దార్ కార్యాలయాల్లోని సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఏఈవో అగ్రికల్చర్ (మండలానికి ఐదారుగురు దాకా ఉంటారు) వెటర్నరీ అధికారులు, విద్యాశాఖలోని మండలాల్లోని హెడ్‌మాస్టర్స్, సీనియర్ అసిస్టెంట్లు, ఉద్యానశాఖ, ప్రొహిబిషన్, ఎక్సైజ్, తదితర అధికారులు, ఉద్యోగులను నియమించనున్నట్లు తెలిసింది. స్పెషల్ ఆఫీసర్ల నియామకం సందర్భంగా ఆయా శాఖల అధికారులను సొంత మండలాల్లో నియమించకుండా, రిటైర్‌మెంట్ దగ్గరలో ఉన్న వారిని మినహాయించి ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

3న పీఆర్ మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్

ఫిబ్రవరి 3న ప్రత్యేక అధికారుల పాలన, వేసవిలో తాగునీటి సరఫరా, రోడ్లకు మరమ్మతులు తదితర అంశాలపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), పీఆర్ ఆర్‌డీ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ కాన్ఫరెన్స్‌కు జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్లు, స్థానికసంస్థల అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈవో, డీఆర్‌డీవో, డీపీవో, డీఎల్‌పీవో, పీఆర్, మిషన్‌భగీరథ ఎస్‌ఈ, ఈఈలు, డీఈఈలు, సిబ్బంది.. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంపీవో, మండల ఇంజనీరింగ్ అధికారి, ఏఈ, మిషన్ భగీరథ ఏపీవో, ఈజీఎస్, సెర్ప్ ఏపీఎం, గ్రామపంచాయతీల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీలు హాజరుకానున్నారు.

మధ్యంతర బడ్జెట్

ఈ ఐదింటిపై ఆశలొద్దు!

కేంద్ర బడ్జెట్ పేరు వినగానే మధ్య తరగతి ప్రజల్లో ఒకింత ఉత్సుకత మొదలవడం సహజం. పన్ను శ్లాబులు తగ్గిస్తారనో, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించే చర్యలేవో తీసుకుంటారనో ఆశ పడుతుంటారు. మహిళలు, యువత కోసం ప్రత్యేక పథకాలను ప్రభుత్వం ప్రకటిస్తుందేమోనని ఎదురు చూస్తుంటారు. మధ్యంతర బడ్జెట్ అయినా సామాన్య ప్రజానీకం మొదలు కార్పొరేట్ వర్గాల దాకా అందరి అంచనాలు భారీగానే ఉన్నాయి. మూడు, నాలుగు నెలల్లో ఎన్నికలు ఉండటంతో ఎన్నికల తాయిలాలు బడ్జెట్‌లో కనిపించవచ్చని అందరి అంచనా. అయితే ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం ఫిబ్రవరి ఒకటిన ప్రవేశపెట్టే 2024–25 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో ఒక ఐదు అంశాలపై ఆశలు పెట్టుకోకపోవడమే ఉత్తమం అని వారు సెలవిస్తున్నారు. ఆ ఐదేంటో ఓసారి చూసేద్దాం.

– సాక్షి, నేషనల్ డెస్క్

1. ప్రభుత్వ విధానపర నిర్ణయాలు

త్వరలో లోక్‌సభ ఎన్నికలున్నాయి. విపక్షాల 'ఇండియా' కూటమి గెలిస్తే ఈ మధ్యంతర బడ్జెట్‌లో పెట్టుకున్న లక్ష్యాలను కొత్త ప్రభుత్వం నెలవేరుస్తుందన్న గ్యారెంటీ లేదు. అందుకే దీర్ఘకాలిక ఆర్థిక సంస్కరణల జోలికి వెళ్లకుండా ఇప్పటి పద్దుల సంగతే చూడాలని ప్రభుత్వం భావిస్తోందట. అందుకే ప్రభుత్వం ఎలాంటి నూతన ప్రతిష్టాత్మక పథకాలను ప్రారంభించదల్చుకోలేదని కొందరు ఆర్థిక వేత్తలు అంచనావేస్తున్నారు. ఈసారి బడ్జెట్‌లో కొత్త పథకాలు ఏమీ ఉండబోవని ఇప్పటికే విత్త మంత్రి నిర్మల సెలవివ్వడం గమనార్హం. ప్రస్తుత ఖర్చుల మీద మాత్రమే దృష్టిపెడతామని ఆమె ప్రకటించారు.

2. పన్ను మినహాయింపులు

పూర్తి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భాల్లో మాత్రమే పన్ను శ్లాబుల్లో మార్పుల వంటి కీలక నిర్ణయాలను ప్రభుత్వాలు ప్రకటించడం చూశాం. ఇది మధ్యంతర బడ్జెట్ కాబట్టి పన్ను శ్రేణుల్లో సవరణలు ఆశించలేమని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు. అంటే పన్ను శ్లాబుల్లో మార్పులు రావాలంటే కొత్త ప్రభుత్వం కొలువుతీరాక వచ్చే పూర్తి బడ్జెట్ దాకా వేచి ఉండక తప్పదు.

3. నూతన సంక్షేమ పథకాలు

కొత్త సంక్షేమ పథకానికి రూపకల్పన చేయాలంటే చాలా సమయం పడుతుంది. మూడోసారి హ్యాట్రిక్ కొట్టి కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకోవడంపై దృష్టిపెట్టిన బీజేపీ.. కొత్త పథకాలను పట్టించుకోదనే వాదన ఉంది. నూతన సంక్షేమ పథక రచనకు విస్తృతస్థాయి సంప్రదింపులు జరగాలి. ఎన్‌డీఏ కూటమికి అంత వ్యవధిలేదని మూడోసారి గెలిచాక వాటి సంగతి చూసుకుందామనే ధోరణి బీజేపీలో కనిపిస్తోందని ఒక రాజకీయ విశ్లేషకుడు అంచనావేశారు. కొత్త సంక్షేమ పథకం ప్రకటించి అమలుచేయాలంటే అందుకు తగ్గ ఆర్థికవనరులనూ సమకూర్చుకోవాల్సిందే. అంటే పూర్తి బడ్జెట్ స్థాయిలో కేటాయింపులు జరగాలి. మధ్యంతర బడ్జెట్‌లో అది సాధ్యమేనా అనే ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. అందుకే కొత్త సంక్షేమ పథకాల పాట బీజేపీ పాడదని మాట వినిపిస్తోంది.

4. ద్రవ్యలోటు కట్టడి చర్యలు

ద్రవ్యలోటును తగ్గించుకునేందుకు ఖర్చులను తగ్గించుకోవడం వంటి చర్యలకు ఉపక్రమించాలి. ఆ పని చేయాలంటే సంబంధిత అన్ని శాఖలతో విస్తృతస్థాయి సంప్రతింపులు అవసరం. అత్యంత కఠిన ఆర్థిక క్రమశిక్షణ పేరుతో ద్రవ్యలోటు కట్టడి చర్యలకు దిగితే దాని పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. సార్వత్రిక ఎన్నికలపై పూర్తిగా దృష్టిపెట్టే సర్కార్ మళ్లీ ద్రవ్యలోటు అంశాన్ని సీరియస్‌గా తీసుకుంటుందా లేదా అనేది తెలియాల్సిఉంది. ద్రవ్యలోటు భారాన్ని దింపేందుకు మధ్యంతర బడ్జెట్ సరైన వేదిక కాదనే భావన ఉండొచ్చు.

5. నూతన ఆర్థిక విధానాలు

చాలా నెలలుగా అమలవుతోన్న ఆర్థిక విధానాల్లో సమూల మార్పులు తెస్తూ ప్రకటించే నూతన ఆర్థిక విధానాలు వ్యవస్థను ఒక్కసారిగా కుదుపునకు గురిచేస్తుంది. ఇలాంటి ప్రయోగాలు సాధారణంగా పూర్తిస్థాయి బడ్జెట్‌లోనే చేస్తారు. మధ్యంతర బడ్జెట్‌కు ఈ ఫార్ములా నప్పదు అనే అభిప్రాయం ఒకటి ఉంది. దీర్ఘకాలిక ప్రణాళికలు, సంబంధిత రంగాల సంస్థలతో చర్చోపచర్చల తర్వాతే మామూలుగా ఇలాంటి నూతన ఆర్థిక విధానాలను ప్రకటిస్తారు. నూతన ఆర్థిక విధానాలు ప్రకటిస్తే స్టాక్ మార్కెట్లు స్పందించడం సర్వసాధారణం. సానుకూలమో, ప్రతికూలమో, లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోవడమో.. ఇంకేదైనా జరగొచ్చు. ఇలాంటి సాహసోపేత నిర్ణయాల అమలుకు మధ్యంతర బడ్జెట్‌ను ప్రభుత్వం వాడుకుంటుందో లేదో వేచి చూడాల్సిందే.

అయినా కొన్ని అంచనాలు..



1. పెట్రోల్, డీజిల్ ధరలను కిందకు దించుతారని ఆశలూ ఎక్కువయ్యాయి. అధిక పెట్రో ధరల కారణంగా ప్రభుత్వ చమురు రిటైల్ కంపెనీలు ఇటీవలికాలంలో అధిక లాభాలను కళ్లజూశాయి. ఈ లాభాలను పౌరులకు కాస్తంత మళ్లించే యోచన ఉందట. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ. 5–10వరకు తగ్గించవచ్చని అనుకుంటున్నారు. పెట్రో ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం తగ్గించడం, విద్యుత్ వాహనాలకు రాయితీ పొడిగింపు వంటి ప్రకటనలు బడ్జెట్ రోజు వెలువడొచ్చని భావిస్తున్నారు.

2. పట్టణవాసులు భారీ లబ్ధి చేకూరేలా నివాస గృహాలపై తక్కువ వడ్డీకే రుణాలు అందించవచ్చని భావిస్తున్నారు. సబ్సిడీతో పీఎం ఆవాస్ యోజన తరహా కొత్త పథకం తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈ తరహా పథకం అమలుచేస్తే బాగుంటుందని మంత్రి గతంలో వ్యాఖ్యానించడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

3. దేశవ్యాప్తంగా అమలవుతున్న కేంద్ర పథకం పీఎం– కిసాన్ కింద ఇచ్చే నగదు మొత్తాన్ని మరింత పెంచుతారని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. పలు రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇంతకంటే ఎక్కువ మొత్తం ఇస్తున్నాయి. అందుకే పీఎం–కిసాన్ నగదు సాయాన్ని అధికం చేయాలని ప్రభుత్వం యోచిస్తోందని వార్తలొచ్చాయి. ఈ ఆలోచన బడ్జెట్‌లో ఆచరణాత్మకం అవుతుందో లేదో చూడాలి. పీఎం కిసాన్ మొత్తాన్ని దాదాపు రూ.9,000కు పెంచే వీలుందని సమాచారం.

4. గత బడ్జెట్‌లో మధ్యతరగతి కుటుంబాలకు పన్ను రిబేట్‌ను ఏకంగా రూ.7,00,000 పెంచడం వంటి చాలా కీలక నిర్ణయాలు వెలువడ్డాయి. దీంతో ఈసారి అలాంటి కలలనే మధ్యతరగతి కుటుంబాలు కంటున్నాయి. ఆదాయంపై స్టాండర్డ్ డిడక్షన్ (ప్రామాణిక తగ్గింపు) ప్రస్తుతం రూ. 50 వేలుగా ఉంది. కొత్త, పాత పన్ను విధానాల్లో ఈ డిడక్షన్‌ను రూ.1,00,000కు పెంచాలని మధ్యాదాయ వర్గాలు అభిలషిస్తున్నాయి..

5. బ్యాంకు ఖాతాదారులకు పన్ను మినహాయింపులు పెరగొచ్చని మరో అంచనా. వీరి సేవింగ్స్ ఖాతా వడ్డీపైనా స్టాండర్డ్ డిడక్షన్ పరిమితిని రూ.50,000కు పెంచుతారని ఆశిస్తున్నారు.

6. ఆదాయపు పన్ను చట్టంలో ముఖ్యమైనదైన సెక్షన్–80సీ కింద ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ. 1.50 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇస్తున్నారు. పొదుపు పథకాల్లో పెట్టుబడులు, జీవిత బీమా చందా చెల్లింపులు, ట్యూషన్ ఫీజులు, గృహ రుణాల చెల్లింపులు, ఐదేళ్ల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు అన్నీ దీని కిందికే వస్తాయి. కాబట్టి ఈ మొత్తాన్ని రూ. 3,00,000కు పెంచాలనే డిమాండ్లు ఎక్కువయ్యాయి.





ఆర్థిక మంత్రి నిర్మల

నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు

రేపు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ • ఫిబ్రవరి 9 వరకు జరగనున్న సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు సమావేశాలు ప్రారంభం కానుండగా, తొలి రోజు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తొలిసారి పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. ఈసారి ఆర్థిక సర్వే నివేదికను విడుదలచేయట్లేదని ఇప్పటికే కేంద్రం ప్రకటించింది. గురువారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టనున్నారు. తొలి రెండు రోజులు ఉభయసభల్లో జీవో అవర్, క్వశ్చన్ అవర్‌ను ఇప్పటికే రద్దు చేస్తూ బులిటెన్ విడుదల చేశారు. ఫిబ్రవరి 2న రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగనుంది. ఆ తర్వాత రాజ్యసభ, లోక్‌సభలో దీనిపై ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం ఇవ్వనున్నారు. జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటుచేసిన నేపథ్యంలో సాంకేతికంగా రాష్ట్రపతిపాలనలో ఉన్న ఆ ప్రాంతానికి సంబంధించిన జమ్మూకశ్మీర్ బడ్జెట్‌నూ ఆర్థిక మంత్రి నిర్మల లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.

వాడీవేడిగా చర్చలు

సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వం సన్నాహాలు చేస్తుండగా, మరోవైపు కేంద్రాన్ని నిలదీసేందుకు విపక్షాలు వ్యూహాలు రచిస్తున్నాయి. నిరుద్యోగిత, అధిక ధరలు, ఆర్థిక అసమానతల కారణంగా రైతాంగం, కార్మికులు ఎదుర్కొంటున్న కష్టాలు, జాతుల ఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపూర్ అంశాలపై మోదీ సర్కార్‌ను విపక్షాలు నిలదీయనున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం అంశం సైతం ప్రధానంగా విపక్షాలు ప్రస్తావించవచ్చు. ఢిల్లీలో మద్యం కేసులో ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌పై, భూమికి ఉద్యోగం కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ యాదవ్‌పై ఈడీ, సీబీఐ కేసులనూ విపక్షాలు పార్లమెంట్‌లో లేవనెత్తనున్నాయి. జార్ఖండ్ సీఎంసోరెన్‌పై, తమిళనాడులో డీఎంకే నేతలపై ఈడీ, సీబీఐ వరుస దాడులను విపక్షాలు పార్లమెంట్‌లో ప్రధానంగా ప్రస్తావించనున్నాయి. పశ్చిమ బెంగాల్‌కు రావాల్సిన కేంద్ర నిధులను మోదీ సర్కార్ మంజూరుచేయకుండా ఆపేస్తోందని, ఈ అంశంలో కేంద్రాన్ని నిలదీస్తానని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సుదీప్ బంధోపాధ్యాయ్ చెప్పారు.

14 మంది విపక్ష సభ్యుల సస్పెన్షన్ ఎత్తివేత

గత పార్లమెంట్ సమావేశాల్లో సస్పెండ్ అయిన వారిలో 14 మంది విపక్ష సభ్యులు ఈసారి సెషన్‌లో పాల్గొననున్నారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. సమావేశాల్లోకి రాకుండా గతంలో వీరిపై విధించిన నిషేధ కేసును సభాహక్కుల కమిటీలకు పంపామని, మా అభ్యర్థనతో ఆ కమిటీల చైర్మన్లు వీరి సస్పెన్షన్‌ను ఎత్తేశారని మంత్రి వెల్లడించారు. సస్పెన్షన్ ఎత్తేసిన 14 మందిలో 11 మంది రాజ్యసభ, ముగ్గురు లోక్‌సభ సభ్యులున్నారు. పార్లమెంట్ ప్రాంగణంలో భద్రతా వైఫల్యం అంశాన్ని ఎత్తిచూపుతూ లోక్‌సభ, రాజ్యసభ లోపల ప్లకార్డులు పట్టుకుని నినదించినందుకు కేంద్రం ఫిర్యాదుతో 100 లోక్‌సభ, 46 రాజ్యసభ సభ్యులు సస్పెన్షన్‌కు గురైన విషయం తెల్సిందే. ప్రతి ఒక్కరి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని సభాపతులను కోరామన్నారు. వీరిలో 14 మంది క్షమాపణలు చెప్పడంతో వారికి మాత్రమే ఈ సెషన్‌లో పాల్గొనే అవకాశం కల్పించారు. బుధవారం నుంచి మొదలయ్యే పార్లమెంట్ ఇరు సభలకు తమ సభ్యులు ఎలాంటి ప్లకార్డులు తీసుకురారని విపక్ష పార్టీలు సమాచారం ఇచ్చాయని మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు.

మణిపూర్‌లో మళ్లీ హింస.. ఇద్దరు మృతి

ఇంఫాల్: మణిపూర్‌లో తాజాగా జరిగిన హింసాత్మక ఘటనలో ఇద్దరు గ్రామ వలంటీర్లు ప్రాణాలు కోల్పోయారు. ఇంఫాల్ వెస్ట్–కంగ్‌పోక్పి జిల్లాల సరిహద్దుల్లోని కడంగ్‌బంద్ గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సాయుధ దుండగులు వలంటీర్లపై విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులైన మరో ఇద్దరిని ఇంఫాల్‌కు తరలించామన్నారు. రెండు గ్రామాల వలంటీర్ల మధ్య దాడులు, ప్రతిదాడులు కొనసాగుతూనే ఉన్నాయ న్నారు.

తేజస్వీ యాదవ్‌ను ప్రశ్నించిన ఈడీ

పట్నా: ల్యాండ్ ఫర్ జాబ్స్ కుంభకోణంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆర్‌జేడీ నేత తేజస్వీ యాదవ్‌ను మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు దాదాపు 8 గంటలపాటు ప్రశ్నించారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు పట్నాలోని ఈడీ కార్యాలయం లోపలికి వెళ్లిన తేజస్వీ యాదవ్ రాత్రి 8 గంటల సమయంలో బయటకు వచ్చారు. విచారణాధికారులు ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

ఐఐటీ మద్రాస్‌కు రూ. 110 కోట్ల విరాళం

సాక్షి, చెన్నై: ఐఐటీ మద్రాస్‌కు ఆ విద్యాసంస్థ పూర్వ విద్యార్థి ఒకరు భారీ విరాళం ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఐఐటీలో ప్రత్యేకంగా డేటా సైన్స్, కృత్రిమ మేథ(ఏఐ) స్కూల్ ఏర్పాటుకు ఐగేట్ సంస్థ సహవ్యవస్థాపకుడు, ఐఐటీ మద్రాస్ పూర్వవిద్యార్థి సునీల్ వాధ్వానీ రూ. 110 కోట్లు విరాళంగా అందజేశారు. సునీల్ వాద్వాని అమెరికాలో పలు ప్రముఖ ఐటీ కంపెనీలకు సహ వ్యవస్థాపకుడిగా ఉన్నారు. ఈయన 1974లో ఐఐటీ మద్రాస్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశారు.

తోటి టీచర్లను కాల్చి చంపాడు!

గోధా(జార్ఖండ్): అనుమానాస్పద ప్రేమ వ్యవహారం ఇద్దరు టీచర్లను బలిగొంది. జార్ఖండ్‌లోని గోధా జిల్లా పరియాహాట్ ప్రాంతంలోని ఛాత్రా అప్‌గ్రేడెడ్ స్కూల్‌లో ఈ కాల్పుల ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అదే స్కూల్‌లో పాఠాలు చెప్పే ఆదర్శ్ సింగ్, రవి రంజన్‌లతో సుజాత మిశ్రా అనే టీచర్ ప్రేమాయణం కొనసాగిస్తోంది. ఈ వివాదం ముదిరి మంగళవారం ఉదయం పాఠశాల వేళలోనే ఒక తరగతి గదిలో ఆదర్శ్ సింగ్, సుజాతలను రవి దేశవాళీ పిస్టల్‌తో కాల్చిచంపాడు. తర్వాత రవి తనను తాను కాల్చుకున్నా ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ఘటనాస్థలిలో రెండు పిస్టళ్లను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తుచేస్తున్నట్లు జిల్లా ఎస్పీ నాథూ సింగ్ మీనా చెప్పారు.

ఏ చర్చకైనా సిద్ధం

అఖిలపక్ష భేటీలో స్పష్టంచేసిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: నేటి నుంచి ప్రారంభంకానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ప్రతి అంశాన్ని చర్చించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేంద్రం తరఫున పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ హాజరయ్యారు. ఈ భేటీకి కాంగ్రెస్, ఆర్జేడీ, జేడీ(యూ), బీఆర్‌ఎస్, వైఎస్సార్‌సీపీ, డీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్, తృణమూల్ కాంగ్రెస్, టీడీపీల పక్షనేతలు హాజరయ్యారు. కాంగ్రెస్ తరఫున కె.సురేశ్, ప్రమోద్ తివారీ, ఎన్‌సీపీ తరఫున శరద్ పవార్, తృణమూల్ తరఫున సుదీప్ బంధోపాధ్యాయ్, డీఎంకే తరఫున టీఆర్ బాలు, శివసేన తరఫున రాహుల్ శెవాలె, సమాజ్‌వాదీ పార్టీ తరఫున ఎస్‌టీ హసన్, జేడీ(యూ) తరఫున రామ్‌నాథ్ ఠాకూర్ తదితరులు హాజరయ్యారు. ఉభయ సభలు సజావుగా సాగేందుకు ప్రభుత్వానికి అన్ని పార్టీలు సహకరించాలని కేంద్ర మంత్రులు ఈ సందర్భంగా కోరారు. ఈ సందర్భంగా దేశం ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలు, రాష్ట్రాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై పార్లమెంట్‌లో చర్చకు ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని విపక్ష పార్టీల నేతలు కోరారు.

అస్సాంలో రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర సందర్భంగా అక్కడి పోలీసుల హింసాత్మక దాడికి పాల్పడ్డారని, యాత్రను సజావుగా సాగనివ్వలేదని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ అఖిలపక్ష భేటీలో ఆగ్రహం వ్యక్తంచేశారు. సీబీఐ, ఈడీలను దుర్వినియోగం చేస్తూ జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌లను తప్పుడు కేసులతో వేధిస్తున్నారని తివారీ ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగంపై ప్రభుత్వం తన వైఖరిని తేటతెల్లం చేయాలని పలువురు విపక్ష సభ్యులు పట్టుబట్టారు.

ఇమ్రాన్‌కు పదేళ్ల జైలు



ఇస్లామాబాద్: ఫిబ్రవరి 8న జరిగే ఎన్నికల్లో విజయం సాధించి, మళ్లీ అధికార పగ్గాలు చేపట్టాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్న పాకిస్తాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్(పీటీఐ) చీఫ్, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్(71)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అధికార పత్రాల లీకేజీ కేసులో ఆయనతో పాటు మాజీ విదేశాంగ మంత్రి మహ్మూద్ ఖురేషీకి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు జడ్జి అబ్దుల్ హస్నత్ మంగళవారం తీర్పు వెలువరించారు. రావల్పిండిలోని అడియాలా జైలులో కేసు విచారణ జరిగింది. అవినీతి ఆరోపణలపై ఇప్పటికే ఇమ్రాన్ మూడేళ్ల జైలు శిక్ష అనుభవించారు. ఒకవైపు, ఆయన పార్టీ ఎన్నికల గుర్తు క్రికెట్ బ్యాట్‌ను వాడరాదంటూ ఎన్నికల సంఘం నిషేధం విధించగా మరోవైపు ఇమ్రాన్, ఖురేషిలతోపాటు పార్టీకి చెందిన ఇతర ముఖ్య నేతల నామినేషన్ పత్రాలు సైతం తిరస్కరణకు గురయ్యాయి. గత ఏడాది ఆగస్టులో తోషఖానా అవినీతి కేసును విచారించిన కోర్టు ఇమ్రాన్ ఖాన్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రధానిగా ఉన్న ఇమ్రాన్ ఖాన్ 2022 మార్చి 7వ తేదీన జరిగిన బహిరంగ సభలో ఒక లెటర్‌ను ప్రజలకు చూపుతూ..తన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాజకీయ విరోధులు ఓ విదేశంతో చేతులు కలిపారనేందుకు సాక్ష్యం ఇదేనని పేర్కొన్నారు. ఆ తర్వాత కొన్ని రోజుల తర్వాత అమెరికా ప్రభుత్వం తనపై కుట్ర పన్నుతోందని ఆరోపించారు. అనంతరం ఆయన పదవీచ్యుతుడయ్యారు. పాక్ మాజీ రాయబారి అమెరికా ఉన్నతాధికారితో జరిపిన భేటీకి సంబంధించిన ఆ పత్రాన్ని ఇమ్రాన్ బహిరంగంగా చూపడాన్ని రహస్య పత్రాల లీకేజీ నేరంగా పేర్కొంటూ గత ఏడాది ఆగస్టులో ఇమ్రాన్‌తోపాటు అప్పటి విదేశాంగ మంత్రి ఖురేషిపై కేసు నమోదైంది. మరో 9 రోజుల్లో ఎన్నికలు జరగనున్న సమయంలో ఇమ్రాన్, ఖురేషిలు జైలులోనే ఉన్నారు. తాజా తీర్పుతో వీరిద్దరూ అయిదేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కోల్పోనున్నారు.

నితీశ్‌తో ఇక పని లేదు: రాహుల్



పూర్ణియా(బిహార్): బిహార్ ప్రజలకు సామాజిక న్యాయం అందించేందుకు మహాఘట్‌బంధన్ పోరాటం కొనసాగిస్తుందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ చెప్పారు. ఈ విషయంలో తమ కూటమికి సీఎం నితీశ్‌కుమార్‌తో ఇక అవసరమే లేదన్నారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర మంగళవారం బిహార్‌లోని పూర్ణియా జిల్లాలో ప్రవేశించింది. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. 'పెద్ద సంఖ్యలో ఉన్న వెనుకబడిన వర్గాల ప్రజలకు ఏ రంగంలోనూ సరైన ప్రాతినిథ్యం లభించడం లేదు. మీడియాలో సైతం వారికి అన్యాయమే జరుగుతోంది. రిపోర్టర్ల స్థాయి నుంచి పైకి ఎదిగిన వారు చాలా అరుదు'అని చెప్పారు. 'దళిత, ఓబీసీ, గిరిజనజనాభా వివరాలు కచ్చితంగా నిర్ధారణ కావాలంటే కుల గణన అవసరం ఎంతో ఉంది. ఇది ఎక్స్ రే వంటిది. దీని తర్వాత ఎంఆర్‌ఐకి వెళతాం'అని రాహుల్ అన్నారు. బిహార్ రాజకీయ పరిణామాలను వివరిస్తూ రాహుల్.. 'మహాఘట్‌బంధన్‌లో కీలక భాగస్వామిగా ఉన్న ఆర్‌జేడీ, కాంగ్రెస్‌లు కుల గణన సర్వే చేపడతామన్న హామీ అమలు కోసం నితీశ్‌పై రాజీలేని ఒత్తిడి పెంచాయి. ఇది ఇష్టం లేని నితీశ్ భయపడ్డారు. కులగణనకు పూర్తి వ్యతిరేకమైన బీజేపీ సాయంతో ఆయన బయటపడ్డారు. తరచూ కూటములను మార్చే అలవాటున్న నితీశ్ ఏ మాత్రం కష్టపడాల్సి వచ్చినా వెంటనే తేలిగ్గా యూటర్న్ తీసుకుంటారు'అని పేర్కొన్నారు. కులగణన విషయంలో తమకు ఎలాంటి భయమూ లేదన్నారు. మణిపూర్‌లో పరిస్థితులపై ఆయన మాట్లాడుతూ.. అక్కడ వాతావరణం అంతర్యుద్ధాన్ని తలపిస్తోందన్నారు. అతలాకుతలమవుతున్న ఆ రాష్ట్రానికి ప్రధాని మోదీ ఇప్పటికీ వెళ్లనేలేదని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ర్యాలీనుద్దేశించి వర్చువల్‌గా మాట్లాడారు.

సోరెన్ ఢిల్లీ నివాసంలో ఈడీ సోదాలు

- రూ.36 లక్షలతోపాటు, బీఎండబ్ల్యూ కారు, కీలక పత్రాలు స్వాధీనం
- 30 గంటల తర్వాత రాంచీలో ప్రత్యక్షమైన జార్ఖండ్ సీఎం

న్యూఢిల్లీ/రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ నివాసంలో ఈడీ అధికారులు మంగళవారం సోదాలు జరిపారు. రోజంతా జరిపిన తనిఖీల్లో రూ.36 లక్షల నగదుతోపాటు, బీఎండబ్ల్యూ కారు, కీలక పత్రాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భూకుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలకు సంబంధించి ప్రశ్నించేందుకు ఈడీ బృందం సోమవారం ఉదయం ఢిల్లీలోని హేమంత్ నివాసానికి వెళ్లింది. అక్కడ ఆయన లేకపోవడంతో 13 గంటలపాటు వేచి చూశారు. ఫలితం లేకపోవడంతో సీఎం సోరెన్ కనిపించకుండా పోయారంటూ అధికారులు ప్రకటించారు. అరెస్ట్ భయంతోనే ఆయన పారిపోయారంటూ బీజేపీ ఎద్దేవా చేసింది. ఈ నెల 27న అధికారిక కార్యక్రమాలన్నిటినీ రద్దు చేసుకున్న సోరెన్ రాంచీ నుంచి ఢిల్లీకి వెళ్లారు. అనంతరం ఆయన ఎక్కడున్నదీ ఎవరికీ తెలియలేదు. దాదాపు 30 గంటల సస్పెన్స్ అనంతరం సోరెన్ మంగళవారం రాంచీలో ప్రత్యక్షమయ్యారు. తమ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. సోరెన్ భార్య కల్పన సైతం ఈ సమావేశంలో పాల్గొనడంపై ఊహాగానాలు వెల్లువెత్తాయి. తనను ఈడీ అరెస్ట్ చేస్తే భార్యను సీఎం పీఠంపై కూర్చోబెట్టాలని హేమంత్ ప్లాన్ చేస్తున్నారని బీజేపీ ఆరోపించింది.



రాంచీలో ప్రత్యక్షమైన సోరెన్

ఛత్తీస్‌గఢ్‌లో భీకర ఎన్‌కౌంటర్

నేలకొరిగిన ముగ్గురు జవాన్లు..మరో 15 మందికి గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్, సుక్మా జిల్లాల సరిహద్దుల్లో మావోయిస్టులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు సీఆర్పీఎఫ్ జవాన్లు నేలకొరిగారు. మరో 15 మంది జవాన్లు గాయపడ్డారు. ఆరుగురు మావోయిస్టులు కూడా మృతి చెందినట్లు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. మావోయిస్టులకు గట్టిపట్టున్న అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని టేకులగూడెం వద్ద భద్రతా బలగాలు సోమవారం కొత్తగా క్యాంప్‌ను ఏర్పాటు చేశాయి. స్పెషల్ టాస్క్‌ఫోర్స్, జిల్లా రిజర్వు గార్డులు, కోబ్రా దళం జొనగూడ–అలిగూడ గ్రామాల సమీపంలో మంగళవారం గాలింపు జరుపుతుండగా మావోయిస్టులు అకస్మాత్తుగా కాల్పులకు దిగారు. బలగాలు దీటుగా స్పందించాయి. ఈ ఘటనలో ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోగా వారిలో ఇద్దరు కోబ్రా 201వ బెటాలియన్‌కు, ఒకరు సీఆర్‌పీఎఫ్ 150వ బెటాలియన్‌కు చెందిన జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. బలగాల కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు సైతం మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాలను మావోయిస్టులు తమ వెంట తీసుకెళ్లారు. . 2021లో ఇదే టేకులగూడెం ప్రాంతంలో మావోయిస్టులతో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో 23 మంది జవాన్లు అమరులైన సంగతి తెలిసిందే.

బీజేపీ నేత హత్య కేసు.. 15 మంది పీఎఫ్‌ఐ కార్యకర్తలకు మరణ శిక్ష

అలప్పుజ: 2021లో జరిగిన బీజేపీ ఓబీసీ విభాగం నేత రంజిత్ శ్రీనివాసన్ హత్య కేసులో నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్‌ఐ)కు చెందిన 15 మంది కార్యకర్తలకు కేరళ కోర్టు మరణ శిక్ష విధించింది. ఈ నెల 20వ తేదీన విచారణ ముగించిన మవెలిక్కర అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి వీజీ శ్రీదేవి మంగళవారం ఈ మేరకు తీర్పు ఇచ్చినట్లు స్పెషల్ ప్రాసిక్యూటర్ ప్రతాప్ జి.పడికల్ వెల్లడించారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న మొత్తం 15 మందినీ కోర్టు దోషిగా తేల్చిందన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న శ్రీనివాసన్‌ను 2021 డిసెంబర్ 19వ తేదీన ఆయన ఇంట్లో తల్లి, భార్య, కుమార్తె కళ్లెదుటే పీఎఫ్‌ఐ కార్యకర్తలు మారణాయుధాలతో దారుణంగా చంపారు. మొత్తం 15 మంది దోషుల్లో 8 మంది ప్రత్యక్షంగా హత్యలో పాల్గొనగా, నలుగురు అక్కడే ఉండి ఇతరులు రాకుండా కాపలాకాశారు. మరో ముగ్గురు హత్యకు కుట్ర పన్నినట్లు కోర్టు గుర్తించిందని ప్రాసిక్యూటర్ చెప్పారు. పోలీసులు తమ ముందుకు తీసుకువచ్చిన 14 మంది దోషులకు మరణ శిక్ష విధిస్తున్నట్లు జడ్జి ప్రకటించారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉన్న మరో దోషికి, కోర్టు ముందుకు తీసుకొచ్చాక మరణ శిక్షను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. దోషులపై ఇతర సెక్షన్ల కింద కూడా కేసులు నమోదయ్యాయి. ఈ తీర్పుపై శ్రీనివాసన్ కుటుంబంతోపాటు బీజేపీ హర్షం వ్యక్తం చేసింది.

ఇండియా కూటమికి మొదటి షాక్

చండీగఢ్: చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో టాప్ మూడు పోస్టులను బీజేపీ కైవసం చేసుకోవడంతో ఉమ్మడిగా బరిలోకి దిగిన ఇండియా కూటమి పార్టీలు కాంగ్రెస్, ఆప్‌లకు ఎదురు దెబ్బ తగిలింది. మేయర్ పదవి బీజేపీ అభ్యర్థికి దక్కిందని తెలియగానే బ్యాలెట్ పేపర్ల టాంపరింగ్ జరిగిందని ఆరోపిస్తూ ఆప్, కాంగ్రెస్ కౌన్సిలర్లు చండీగఢ్ మునిసిపల్ కార్పొరేషన్ హౌస్‌లో గలాటా సృష్టించారు. తర్వాతి దశలో సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులకు జరిగే ఎన్నికల్లో పాల్గొనబోమని ప్రకటించారు. ఈ ఎన్నికను పట్టపగలే జరిగిన మోసంగా ఆప్ చీఫ్ కేజ్రీవాల్ అభివర్ణించారు. కాంగ్రెస్, ఆప్‌లకు చెందిన 8 ఓట్లను చెల్లనివిగా ప్రిసైడింగ్ అధికారి ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ ఆప్ పంజాబ్ హర్యానా హైకోర్టును ఆశ్రయించింది. మేయర్ పదవికి జరిగిన పోటీలో బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకార్ చేతిలో ఆప్‌కు చెందిన కుల్దీప్ కుమార్ ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు పోటీ పడిన సీనియర్ డిప్యూటీ మేయర్, డిప్యూటీ మేయర్ పదవులను సైతం బీజేపీ అభ్యర్థులే గెలుచుకున్నారు. ప్రతిపక్షాల బహిష్కరణ నిర్ణయం నేపథ్యంలో మిగతా రెండు పదవులు సైతం బీజేపీ ఖాతాలోనే జమ కానున్నాయి. 36 మంది సభ్యులున్న కార్పొరేషన్‌లో బీజేపీకి 14 మంది, ఆప్‌నకు 13 మంది, కాంగ్రెస్‌కు ఏడుగురు కౌన్సిలర్లున్నారు. బీజేపీకి చెందిన చండీగఢ్ ఎంపీ కిరణ్ ఖేర్‌కు ఎక్స్ అఫీషియో సభ్యురాలి హోదాలో ఓటింగ్ హక్కుంది.

సాక్షి
కరీంనగర్
బుధవారం | 31 | జనవరి | 2024

నిలకడగా పత్తి ధరలు

జమ్మికుంట: జమ్మికుంటలో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. మార్కెట్‌కు 98 వాహనాల్లో 1,303 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.6,600, కనిష్ట ధర రూ.6,000 పలికింది. గన్నీ సంచుల్లో 12మంది 26 క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు. గరిష్ట ధర రూ.6,200, మోడల్ ధర రూ.6,000, కనిష్ట ధర రూ.5,500కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు.



ఎములాడలో సప్తస్వర ఝరి

రాజన్న సన్నిధిలో జరుగుతున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వర్ణలత బృందం సంగీత కచేరీ సభికులను ఆకట్టుకుంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం చలితీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఎంపీ సంజయ్ నోరు అదుపులో పెట్టుకోవాలి



మాట్లాడుతున్న సిద్ధం వేణు

కరీంనగర్: ఎంపీ బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌పై తప్పుడు కూతలు కూస్తే ఊరుకోబోమని రాజన్న సిరిసిల్ల జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ విద్యార్థి, యూత్ నాయకులు జక్కుల నాగరాజు యాదవ్, భూక్య తిరుపతి నాయక్, ద్యావ మధుసూదన్‌రెడ్డి, కేంసారం తిరుపతి అన్నారు. వినోద్‌కుమార్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ.. బోయినపల్లి వినోద్‌కుమార్ నాస్తికుడని, స్థానికేతరుడని పసలేని విమర్శలు బండి సంజయ్ చేయడం సిగ్గుచేటని అన్నారు. తెలంగాణ కోసం 14ఏళ్లు పోరాడారని గుర్తు చేశారు. ఎన్నికలు రాగానే మతం ముసుగులో రాజకీయాలు చేసే బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పి ఓట్లు అడగాలని హితవు పలికారు. వేములవాడ, కొండగటుకు నయాపైసా తేలేదని అన్నారు. గవ్వ వంశీధర్‌రెడ్డి, బండ వేణు, శ్రావణ్, సత్తినేని శ్రీనివాస్, ప్రదీప్, తరుణ్, నవీన్, ఓంకార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీపీ తీరుపై జెడ్పీ సీఈవోకు ఫిర్యాదు



జెడ్పీసీఈవోకు ఫిర్యాదు చేస్తున్న జెడ్పీటీసీలు

కరీంనగర్: మానకొండూరు మండల ప్రజాపరిషత్ సమావేశంలో స్థానిక జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్‌తో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంపీపీ ముద్దసాని సులోచన వ్యవహరించిన తీరుపై విచారణ జరిపి, కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జెడ్పీ సీఈవో పవన్‌కుమార్‌కు మానకొండూర్ నియోజకవర్గ జెడ్పీటీసీలు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం మానకొండూరు మండలపరిషత్ సమావేశంలో జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్‌కు వేదికపై కుర్చీవేయకుండా వేదిక కింద కూర్చోవాలని ఎంపీపీ, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పడం, ఇదేం విధానం అని ప్రశ్నిస్తే సమావేశం నుంచి పోలీసులతో బయటకు గెంటివేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో ఎంపీపీ కక్ష సాధింపు చర్యలో భాగంగానే అవమానపరిచారని వివరించారు. జెడ్పీటీసీలు లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాడుగుల రవీందర్‌రెడ్డి, సిద్ధం వేణు, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు పాల్గొన్నారు.

కవ్వంపల్లి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: మానకొండూర్ మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్‌కు వేదికపై సీటు కేటాయించకుండా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అవమానపర్చినందుకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని మంగళవారం మాట్లాడుతూ కాలం చెల్లిన జీవోను చూపుతూ ప్రొటోకాల్‌ను తప్పుదోవ పట్టించడం ఆయనకే చెల్లిందన్నారు. అధికార దర్పంతో సమావేశం నుంచి పోలీసులతో బయటికి పంపించడం ఎంతవరకు సమంజసమన్నారు. బీఆర్‌ఎస్ దొరల పాలనంటూ వ్యంగంగా మాట్లాడుతున్నారని, ప్రస్తుతం కాంగ్రెస్‌వాళ్లు దొరపాలన చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో చైర్మన్ల పదవీకాలం ముగియక ముందే అవిశ్వాస తీర్మాణాలు పెడుతూ కక్షసాధింపు చర్యలకు పాల్పడడం, అవి వీగిపోతున్నా బుద్ధిరావడం లేదని అన్నారు. జెడ్పీటీసీలు సిద్దంవేణు, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జంగిలి సాగర్‌పై రౌడీషీట్

కరీంనగర్‌క్రైం: నగరపాలక సంస్థ పరిధిలోని సీతారాంపూర్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు తెలిపారు. ఆయన ఇటీవల సీతారాంపూర్‌కు చెందిన ఒక వ్యక్తి భూమి విషయంలో ఇబ్బందులు పెట్టి బెదిరింపులకు గురిచేసినట్లు సీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా విచారణ జరిపారు. సాగర్ సీపీ కార్యాలయంలో లొంగిపోగా అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ కేసుతో పాటు సాగర్‌పై మరో నాలుగు కేసులు ఉండడంతో రౌడీ షీట్ ఓపెన్ చేసినట్లు ఏసీపీ పేర్కొన్నారు.

నెక్స్ట్ ఎవరు..?

- అక్రమార్కుల్లో గుబులు
- పెరుగుతున్న భూ ఫిర్యాదులు
- ఇప్పటికే ఇద్దరు జైలుకు
- మరికొందరిపైనా విచారణ



కరీంనగర్ కార్పొరేషన్:

'ఈ రోజు ఎవరట'.. నగరంలో ఇటీవల తరుచూ వినిపిస్తున్న పదం ఇది. భూ కబ్జాలపై ఫిర్యాదులు పెరుగుతుండగా, ఏ రోజుకారోజు కొత్తగా ఓ కార్పొరేటర్ పేరు వినిపిస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల ఈ పదం చాలా పాపులరైంది. నగర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా భూ కబ్జాలపై కొనసాగుతున్న ఫిర్యాదులు.. విచారణ.. అరెస్టులు నగర పాలకసంస్థలో తీవ్ర ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి.

వందల సంఖ్యలో ఫిర్యాదులు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, గత బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన భూ ఆక్రమణలపై ఫిర్యాదులు ఆహ్వానించడం తెలిసిందే. ఈ క్రమంలోనే పోలీసు కమిషనర్ భూ ఆక్రమణలపై విచారణకు ఏసీపీల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. భూ కబ్జాలపై ఫిర్యాదులు స్వీకరిస్తుండడంతో, వందలాది మంది బాధితులు ధైర్యంగా పోలీసుస్టేషన్ల తలుపు తడుతున్నారు. నగరవ్యాప్తంగా ఈ ఫిర్యాదులు వస్తుండగా ప్రధానంగా శివారు డివిజన్ల నుంచి ఎక్కువగా ఉన్నాయి. ఫిర్యాదుల్లో 90శాతం స్థానిక ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లపైనే కావడం ప్రస్తుతం సంచలనంగా మారింది.

మరి కొంతమందిపైనా విచారణ

ప్రజల చేత ఎన్నుకోబడ్డ కార్పొరేటర్ల చుట్టూనే భూ కబ్జాల ఫిర్యాదులు తిరుగుతుండడం గమనార్హం. రోజురోజుకు భూ ఫిర్యాదులు పెరుగుతుండగా, ఆ ఫిర్యాదుల్లో ఎక్కడో ఒక చోట ఎవరో ఒక కార్పొరేటర్ పేరు బయటకు వస్తోంది. దీంతో సదరు కార్పొరేటర్లను ఎప్పటికప్పుడు పోలీసులు విచారిస్తున్నారు. విచారణలో కొంతమంది అధికారాన్ని అడ్డం పెట్టుకొని సాగించిన భూదందాలు వెలుగు చూస్తుండగా, ఫిర్యాదులు వస్తున్న తీరు చూసి పోలీసులే ఆశ్చర్యపోతున్నారు. మంగళవారం నాటికి దాదాపు 15మంది వరకు కార్పొరేటర్లపైన ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇందులో కొంత మంది భూ ఆక్రమణలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉండగా, మరికొంతమంది మాత్రం 'పంచాయితీ' చేసే క్రమంలో ఇరుక్కున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమ డివిజన్‌లలో ఇరు వర్గాల నడుమ నెల కొన్న భూ వివాదాలను పరిష్కరించేందుకు గతంలో చేసిన పంచాయితీలు ఇప్పుడు భూ ఫిర్యాదుల రూపంలో వస్తున్నట్లు ఒకరిద్దరు కార్పొరేటర్లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం.

కార్పొరేటర్ రివర్స్‌గేర్

నగరంలో భూ ఆక్రమణలపై కార్పొరేటర్లపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండగా, 18వ డివిజన్ కార్పొరేటర్ సుదగోని మాధవి కృష్ణాగౌడ్ మాత్రం రివర్స్‌గేర్ వేశారు. తమ డివిజన్ రేకుర్తి పరిధిలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలంటూ ఎస్‌ఆర్‌ఎస్‌పీ, రెవెన్యూ, నగరపాలకసంస్థ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. సర్వే చేయించి కెనాల్ భూములను కాపాడాలంటూ ట్విస్ట్ ఇచ్చారు. ఏదేమైనా నగరచరిత్రలో తొలిసారిగా భూ ఆక్రమణలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండడం, భూ దందాల్లో రోజుకో కార్పొరేటర్ పేరు వినిపిస్తుండడం నగరంలో తీవ్రచర్చకు దారితీస్తోంది.

ఇప్పటికే ఇద్దరు జైలుకు

భూ కబ్జాలపై ఫిర్యాదు చేయండి.. విచారణ జరిపి మీ భూములు మీకిప్పిస్తాం.. అంటూ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల పదేపదే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అందుకు అనుగుణంగా సీపీ ప్రత్యేక బృందాలను ఆచరణలోకి దింపారు. దీంతో భూ బాధితుల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతానికి భిన్నంగా ఫిర్యాదులు, విచారణ, చర్యలు కూడా వేగంగా జరుగుతుండడం ప్రస్తుతం ఆసక్తికర పరిణామం. భగత్‌నగర్, సీతారాంపూర్‌లలో భూ ఆక్రమణలు, దౌర్జన్యాల ఫిర్యాదులపై 12వ డివిజన్ కార్పొరేటర్ తోట రాములు, 21వ డివిజన్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపడం తెలిసిందే. ఇందులో తోట రాములు బెయిల్‌పై విడుదల అయ్యారు. వీరే కాకుండా ఒకరిద్దరు కార్పొరేటర్లు కూడా అరెస్ట్ అవుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ప్రాక్టికల్స్‌కు సర్వం సిద్ధం

- రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- 74 కేంద్రాలు.. 27,104మంది విద్యార్థులు
- జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జగన్మోహన్‌రెడ్డి



జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జగన్మోహన్‌రెడ్డి

కరీంనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గురువారం నుంచి నిర్వహించనున్న ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జగన్మోహన్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

సాక్షి: పరీక్షలకు ఎంత మంది హాజరవుతున్నారు?

డీఐఈవో: ప్రాక్టికల్ జనరల్ విభాగంలో జిల్లాలో 58 కేంద్రాలు, ఒకేషనల్ విభాగంలో 16 మొత్తంగా 74 కేంద్రాలు ఏర్పాటు చేశాం. బోటనీలో 2,264 మంది విద్యార్థులు, జువాలజీలో 2,263 మంది, ఫిజిక్స్‌లో 11,289 మంది, కెమిస్ట్రీలో 11,288 మంది మొత్తంగా 27,104 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారు.

సాక్షి: ప్రాక్టికల్స్‌కు ఎన్ని విడతల్లో పూర్తి చేయనున్నారు?

డీఐఈవో: ఫిబ్రవరి 1న ప్రారంభమై పరీక్షలు 15వ తేదీన ముగుస్తాయి. మూడు విడతల్లో నిర్వహిస్తాం. 1వ విడత ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు, 2వ విడత ఫిబ్రవరి 6 నుంచి 10వ తేదీ వరకు, 3వ విడత ఫిబ్రవరి11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తాం. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయి.

సాక్షి: జిల్లాలో ఎన్ని జూనియర్ కళాశాలలు ఉన్నాయి?

డీఐఈవో: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 108 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు11, ఆదర్శ పాఠశాలలు 11, కేజీబీవీలు 08, మహాత్మాజ్యోతిబాపూలే 10, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌స్కూల్స్ 06, మైనార్టీ జూనియర్ కళాశాలలు 09, ప్రైవేట్ కళాశాలలు 53 ఉన్నాయి.

సాక్షి: ప్రాక్టికల్ కేంద్రాల్లో పరికరాలు, రసాయనాలు ఉన్నాయా?

డీఐఈవో: కావాల్సిన పరికరాలు, సరిపడా రసాయనాలు సిద్ధంగా ఉన్నాయి. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పరీక్షల నిర్వహణపై ఇది వరకే కలెక్టర్ అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేశాం. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.

సాక్షి: ఇంకా ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

డీఐఈవో: ప్రాక్టికల్స్ నిర్వహణకు ఓ కమిటీ ఏర్పాటు చేశాం. నిరంతరం పర్యవేక్షిస్తుంది. సీసీ కెమెరాలు ఉన్న ప్రాక్టికల్ గదుల్లో ఇంటర్‌బోర్డు నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాల్సిందే. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్ల నుంచి తీసుకోవాలి. హాల్‌టికెట్లు ఇవ్వకుంటే కఠిన చర్యలు ఉంటాయి.

ఈకేవైసీ గడువు పొడిగింపు

- రేషన్ కార్డుదారులకు మరో అవకాశం

కరీంనగర్ అర్బన్: రేషన్‌కార్డుదారుల ఆందోళనకు తెరపడింది. ఈకేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) గడువు నేటితో ముగియనుండగా జిల్లాలో చాలామంది కార్డుదారులు, కుటుంబసభ్యులు ఈకేవైసీ చేసుకోలేదు. జిల్లాలో 85శాతం కేవైసీ పూర్తవగా ఉన్నత విద్య, వలసలతో పాటు మీ సేవలో రద్దీ క్రమంలో తరువాత చేసుకుందామనుకునేవారు నిరీక్షించారు. కార్డుదారులు ఆధార్ అనుసంధానంతో పాటు రేషన్ దుకాణంలో వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. రేషన్ దుకాణాల్లో చాలామంది వేలిముద్ర వేయగా రిజెక్ట్ కావడంతో ఆధార్ సెంటర్‌కు వెళ్లి అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వేలమందికి సమస్య ఎదురవడంతో రద్దీ తగ్గకపోగా గడువు సమీపించడంతో ఆందోళన చెందారు. జిల్లాలో 2.75లక్షల రేషన్ కార్డులుండగా 10లక్షల వరకు యూనిట్లున్నాయి. ఇందులో 2.32లక్షల కార్డుదారులు ఈకేవైసీ చేసుకోగా మరో 43వేల మంది కేవైసీ చేసుకోవాల్సి ఉండగా ప్రభుత్వం మరోమారు గడువు పొడిగించడంతో కార్డుదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఫిబ్రవరి నెలాఖరు వరకు గడువు పొడిగించగా సదరు గడువు క్రమంలో జిల్లాలో 100శాతం కేవైసీ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు.

అమరుల త్యాగం అజరామరం



నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, వివిధశాఖల అధికారులు

- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కరీంనగర్ అర్బన్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించి అమరులైన వారి త్యాగాలు అజరామరమని అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ కొనియాడారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవం క్రమంలో మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే దృఢ సంకల్పంతో వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించి అమరులైన వీరుల స్మృత్యర్థం ప్రతి సంవత్సరం జనవరి 30న అమర వీరుల సంస్మరణ దినోత్సం సందర్భంగా 2 నిమిషాలు మౌనం పాటించడం జరుగుతుందని అన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి అమరులుగా నిలిచారని, వారి త్యాగాల ఫలితాలను నేడు మనం అనుభవిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పవన్ కుమార్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గడ్డం సుధాకర్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదరం షెడ్యూల్ విడుదల



కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వికలాంగుల నిర్ధారణ కోసం ఫిబ్రవరి, మార్చి నెలలో నిర్వహించే సదరం శిబిరాల షెడ్యూల్‌ను మంగళవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి విడుదల చేశారు. ఫిబ్రవరి 6న ఆర్థో, 13న మానసిక, 20న కంటిచూపు, 26న వినికిడి, మార్చి 4న ఆర్థోన, 12న మానసిక, 19న కంటిచూపు, 26న వినికిడి లోపం ఉన్నవారికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరానికి హాజరయ్యేవారు ఫిబ్రవరి 2న ఉదయం 11.30 గంటల నుంచి మీసేవలో స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు. శిబిరానికి హాజరయ్యే వారు సదరం స్లాట్ కాపీతో పాటు ఆధార్ కార్డు, ఒక పాస్‌పోర్టుసైజు ఫొటోతో సంబంధిత తేదీల్లో ఆసుపత్రిలో హాజరుకావాలని సూచించారు.

ప్రజా సంఘాల నాయకులకు బేడీలా?

- ఖండించిన సీఐటీయూ నేతలు





ప్రజా సంఘాల నాయకులకు పోలీసులు వేసిన బేడీలు

కరీంనగర్: సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులపై అక్రమ కేసులు బనాయించడమే కాకుండా జగిత్యాలకు కోర్టు పేషీ పేరిట మంగళవారం కరీంనగర్ జిల్లా జైలు నుంచి బేడీలు వేసి తీసుకెళ్లడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముకుందరెడ్డి, ఎడ్ల రమేశ్‌లు తీవ్రంగా ఖండించారు. జగిత్యాల జిల్లాలో కార్మికులకు, పేద ప్రజలకు ఇండ్లు, ఇళ్లస్థలాలు కావాలని భూపోరాటం చేస్తున్న సీఐటీయూ, ప్రజా సంఘాల నాయకులను అక్రమకేసులు నమోదు చేసి 15రోజుల క్రితం జిల్లాజైలుల పెట్టారని, వారిని జగిత్యాలకు తీసుకెళ్లేందుకు పోలీసులు వ్యవహరించిన తీరు అప్రజాస్వామికమని అన్నారు. ప్రజలకోసం పోరాటం చేస్తున్న లెక్కల బాలకృష్ణ, తిరుపతి నాయక్, రమేశ్‌కు బేడీలు వేయడం దుర్మార్గమన్నారు. వెంటనే వారిని విడుదల చేయాలని, బేడీలు వేసిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో యశ్వంత్‌పూర్ టు గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు హాల్టింగ్ ఏర్పాటుచేయడంతో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేశ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘన స్వాగతం పలికారు. వ్యాపారకేంద్రమైన జమ్మికుంట రైల్వేస్టేషన్‌లో యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇవ్వడం వ్యాపారులు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట రైల్వేస్టేషన్ మేనేజర్ బుర్ర నర్సయ్యగౌడ్, మాడ గౌతంరెడ్డి, శీలం శ్రీనివాస్, ఆకుల రాజేందర్, తూర్పటి రాజు, దొంతుల రాజ్‌కుమార్, కొండ్లె పాపయ్య, రాజేష్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాల పుట్ట 'వారధి'

- పలుకుబడి, పైసలకే ప్రాధాన్యం
- కలెక్టర్‌కు న్యాయవాది ఫిర్యాదు

కరీంనగర్ అర్బన్: ప్రతిభావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వారధి సొసైటీ అక్రమాలకు నెలవైందని న్యాయవాది ఏవీ.రమణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారధి సొసైటీపై విచారణ జరిపి సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ చైర్మన్‌గా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి ఆంజనేయులు సెక్రెటరీగా నిర్వహణలో ఉన్న వారధి సొసైటీలో అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వశాఖల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పనతో పాటు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు లక్ష్యంగా ఏర్పడిన సంస్థ సెక్రెటరీ ఒంటెద్దు పోకడ ప్రతికూలంగా మారిందన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో డబ్బులు ఇస్తేనే ఉద్యోగ అవకాశం ఇస్తున్నారన్న ఆరోపణలు కోకొల్లలుగా ఉన్నాయని, తక్షణమే కమిటీ వేసి విచారించాలన్నారు. వారధి ఏర్పడ్డ నాటి నుంచి సొసైటీ ఆడిట్ రిపోర్ట్ బహిర్గత పర్చాలని, ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారో చెప్పాలన్నారు. సొసైటీ ఆదాయ, వ్యయాలు, చెల్లిస్తున్న జీతభత్యాల వివరాలు, సెక్రెటరీ పొందుతున్న వేతనం ఎంతో కూడా చెప్పాలని ఫిర్యాదులో కోరారు.

మామిడి కొమ్మా.. పూత ఏదమ్మా?

- జనవరి పూర్తవుతున్నా కనిపించట్లే
- మరోవైపు తోటలకు తెగుళ్ల బెడద
- ఆందోళనలో రైతులు
- జిల్లాలో మామిడి విస్తీర్ణం 2,600 హెక్టార్లు

పూత మామిడి రైతుల్లో గుబులు రేపుతోంది. ఇప్పటికే విరగబూయాల్సి ఉండగా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈసారి పంట వస్తుందా.. రాదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడైనా డిసెంబర్‌లో పూత వస్తే వ్యాపారులు కూడా ఆ సమయంలోనే తోటలను పట్టుకోవడం జరిగేది. ఈసారి జనవరి పూర్తవుతున్నా పూతే లేకపోవడంతో వారు ముఖం చాటేస్తున్నారు. గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో వర్షాలు కురవడంతో పూత ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు. ఈ దఫా ఆఫ్ సీజన్ కావడం కూడా పంటపై ప్రభావం చూపుతోంది. ఇది చాలదన్నట్లు తేనె మంచు తదితర తెగుళ్ల బెడద తోటలను వెంటాడుతోంది.



గంగాధరలో అరకొర పూతతో మామిడి చెట్టు

కరీంనగర్ అర్బన్: జిల్లాలో కరీంనగర్ రూరల్, మానకొండూర్, చొప్పదండి, గంగాధర, చిగురుమామిడి, సైదాపూర్, గన్నేరువరం, ఇల్లందకుంట వంటి ప్రాంతాల్లో మామిడి తోటలున్నాయి. జిల్లాలో సాగు విస్తీర్ణం 2,600 హెక్టార్లు. బంగినపల్లి, దసరి, హిమాయత్, రసాలు వంటి రకాలున్నాయి. వీటిలో సింహభాగం బంగినపల్లిదే. గతేడాది 18,200 టన్నుల దిగుబడి రాగా ఈసారి అందులో సగమైనా వచ్చే పరిస్థితి లేదని తెలుస్తోంది. సాధారణంగా హెక్టార్‌కు 7 టన్నుల దిగుబడి రావాలి. ప్రస్తుత పరిస్థితుల్లో 4 టన్నులకు మించి వచ్చే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు. బంగినపల్లి తోటల్లో ఇప్పటికీ పూత రాకపోగా పలు తోటల్లో వచ్చినా అరకొరే. ఈ దఫా పూత అంచనా 60 శాతం కాగా, పూత దశలో ఉన్న తోటలు 65 శాతం.

వర్షాలు, చలి..

డిసెంబర్, జనవరిలో మామిడి కొమ్మలకు పూత వస్తుంది. ఫిబ్రవరి, మార్చిలో కాడ దిగుతుంది. గత జూన్‌లో పంట పూర్తయ్యాక చాలా తోటల్లో గూడు పురుగు కనిపించింది. అప్పట్లో రైతులు మందులు పిచికారీ చేయకపోవడం ఇప్పుడు పూతపై ప్రభావం చూపిస్తోంది. ఈ నెలలో మంచు కురుస్తుండటం కూడా కారణమవుతోంది. తోటలకు తేనె మంచు వంటి తెగుళ్లు, చలి తీవ్రత ఎక్కువగా ఉండటమూ కారణమేనని ఉద్యానవన అధికారులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు పడిపోవడం, వాతావరణంలో మార్పుతో పూత తగ్గిందని అంటున్నారు.

ఆసక్తి చూపని వ్యాపారులు..

ఏటా నాందేడ్, ఢిల్లీ, నాగ్‌పూర్, ఔరంగాబాద్ ప్రాంతాలకు మామిడి ఎగుమతి చేస్తుంటారు. ఈ నెలలోపే వ్యాపారులు తోటల్లోకి చేరి, గుత్తగా మాట్లాడుకొని వాటిని రక్షించుకుంటారు. కాయలను ప్రత్యేక ప్యాకింగ్‌తో ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారు. పూత పట్టని తోటలను చూసిన వ్యాపారులు ఈసారి ముందస్తు కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. ఈ దఫా ఆఫ్ సీజన్ కాబట్టి నష్టాలొస్తాయని వెనకడుగేస్తున్నారు. మూడేళ్ల కాంట్రాక్టు ఉందని, తోటల్లో పూత నిలవడం లేదని చెబుతున్నారు. చలి వాతావరణం ఉంది కాబట్టి పూత కాస్త ఆలస్యమయ్యే పరిస్థితులున్నాయి. పూ మొగ్గలను ఉత్తేజపరిచి, పూత రప్పించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

క్లుప్తంగా

కరీంనగర్ జిల్లాస్థాయి రగ్బీ పోటీలు



శంకరపట్నం(మానకొండూర్): తాడికల్‌లో రగ్బీ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు టి.చిరంజీవి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్ –14 బాలబాలికల పోటీలను మంగళవారం నిర్వహించారు. వీణవంక, హుజూరాబాద్, మానకొండూర్, కరీంనగర్, శంకరపట్నం మండలాల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైనవారు యాదాద్రి భువనగిరి జిల్లాలో ఫిబ్రవరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

నామాపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి సస్పెన్షన్

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని నామాపూర్ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ సంతోష్, జీపీ కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ యాస్మిన్‌బాషా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీవో మహేందర్ తెలిపారు. గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన బోరుబావులతోపాటు ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో బిగించిన హైమాస్ట్ లైట్లకు గ్రామ పంచాయతీ నుంచి నిధులు డ్రా చేసి, దుర్వినియోగం చేశారని గ్రామానికే చెందిన ముదిగంటి పవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో కనకదుర్గ ఇటీవల విచారణ జరిపి, కలెక్టర్‌కు నివేదిక అందించడంతో ఆ ముగ్గురిపై తాత్కాలికంగా సస్పెన్షన్ వేటు వేసినట్లు ఎంపీవో పేర్కొన్నారు.

‘అర్చక’ క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడి నియామకం



మాధవాచార్యులు


కథలాపూర్(వేములవాడ): మండలంలోని గంభీర్‌పూర్‌కు చెందిన అర్చకుడు ఓరుగంటి మాధవాచార్యులు ధూపదీప నైవేద్య అర్చక సంఘం క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాధవాచార్యులు ప్రస్తుతం సంఘం జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు.

దుస్తుల షాపులో అగ్ని ప్రమాదం

కరీంనగర్‌క్రైం: నగరంలోని బస్టాండు సమీపంలో ఉన్న ఓ దుస్తుల దుకాణంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఫైర్ అధికారుల వివరాల ప్రకారం.. బస్టాండు సమీపంలోని రాజేశ్ గ్యాస్ చందాకు చెందిన జ్యోతి డ్రెస్సెస్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే వచ్చి, ఫైర్ ఇంజిన్ సహాయంతో మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశామని స్టేషన్ ఫైర్ అధికారి పరమేశ్వర్ వెల్లడించారు.

గోదావరిలో ప్రాణగుండాలు

- ఎగువ ప్రాంతాల్లో 5 గుండాలు
- సత్యవతి, బ్రహ్మ అతి ప్రమాదకరం
- పుణ్యస్నానాలకు వెళ్లి గతంలో ఎంతోమంది మృతి
- ధర్మపురి వద్ద తగ్గుముఖం పట్టిన నీటిమట్టం
- ప్రమాద సూచికలు ఏర్పాటు చేయని వైనం



ప్రమాదకర గుండాల వద్ద స్నానం చేస్తున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి గోదావరి వద్ద నీటిమట్టం తగ్గుతోంది. పుణ్యస్నానం కోసం వెళ్తున్నవారు జర భద్రం. ఎందుకంటే పై ప్రాంతాల్లో ప్రమాదకర గుండాలున్నాయి. లోతు తెలుసుకోకుండా వెళ్లిన ఎంతోమందిని అవి మింగేశాయి. వారి కుటుంబాలకు కడుపుకోత మిగిలింది. ఏటా వేసవి సమీపిస్తే చాలు గోదావరి నీటిమట్టం తగ్గుతుంది. భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ఎగువ ప్రాంతాలకు వెళ్తుంటారు. ఈ క్రమంలో జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాలకే ప్రమాదం.

దక్షిణ కాశీగా పేరు..

జగిత్యాల జిల్లాలోని ధర్మపురిని దక్షిణ కాశీగా పిలుస్తుంటారు. ఇది ఒక ప్రాచీన పుణ్యక్షేత్రం. ఇక్కడ లక్ష్మీనృసింహస్వామితోపాటు పవిత్ర గోదావరి ఉంది. నది దక్షిణ ముఖంగా ప్రవహించడంతో దక్షిణ కాశీగా పేరొచ్చింది. ఇందులో స్నానం చేస్తే కాశీలో చేసినంత పుణ్యఫలం లభిస్తుందని భక్తుల విశ్వాసం. అందుకే, ఈ క్షేత్రానికి నిత్యం మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది వస్తుంటారు. ముందుగా గోదావరిలో స్నానం చేసి, స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ.

ఎల్లంపల్లి బ్యాక్ వాటర్..

ధర్మపురి గోదావరిలో సత్యవతి, బ్రహ్మ, యమ, పాల, చక్ర గుండాలున్నాయి. వీటిలో అతి ప్రమాదకరమైనవి సత్యవతి, బ్రహ్మగుండాలు. ఇవి అతి లోతైన ప్రదేశాలు. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌తో ఏడాదిలో 8 నెలలపాటు గోదావరి నిండుకుండను తలపిస్తూ పుష్కరఘాట్లను ఆనుకొని పారుతుంది. దీంతో భక్తులు ఎగువ ప్రాంతాలకు వెళ్లలేక పుష్కరఘాట్ల వద్దే పుణ్యస్నానాలు ఆచరిస్తుంటారు. ప్రస్తుతం వేసవి సమీపిస్తుండటంతో నీటిమట్టం తగ్గుముఖం పడుతోంది. దీంతో భక్తులు తమ కుటుంసభ్యులతో కలిసి స్నానాల కోసం ఎగువ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఇక్కడ గతంలో ఈత కొట్టేందుకు వెళ్లిన మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, నిజామాబాద్, ఆర్మూర్, ఆదిలాబాద్, మంచిర్యాల, హైదరాబాద్, వరంగల్ జిల్లాలకు చెందిన చాలామంది నీటమునిగి చనిపోయారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ప్రాణాలు కోల్పోయిన సంఘటలున్నాయి. అందుకే భక్తులు జాగ్రత్తలు పాటించాలి.

బోర్డులు, జాలీలు ఏర్పాటు చేయాలి

ప్రమాదకర గుండాలున్నాయని దేవస్థానం వారు గోదావరి ఒడ్డున సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని పరిశీలించని భక్తులు స్నానం చేసేందుకు ఎగువ ప్రాంతాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆయా గుండాల వద్ద సూచిక బోర్డులు, జాలీలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని పలువురు అంటున్నారు. ముఖ్యంగా భక్తులు స్నానాలు చేసే చోట నిఘా కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మాకు లోతు తెల్వదు



మాది పెగడపెల్లి మండలం దోమలకుంట. ప్రతీ సంవత్సరం గోదావరి స్నానానికి వస్తున్నం. మాకు ఇక్కడ లోతు ఎంతుంటదో తెల్వదు. బోర్డులు పెడితే బాగుంటది. – లక్ష్మి, భక్తురాలు

లోపలికి పోతున్నరు



మాది మల్యాల మండలం. గోదావరి గుండాల కాడ స్నానం కోసం చాలామంది లోపలికి పోతున్నరు. ప్రమాదం జరగకముందే లోపలికి వెళ్లకుండా జాలీలు పెట్టాలి. – విజయ, భక్తురాలు

ఆటోలో ఆఫీస్‌కు వెళ్తూ.. కిందపడి

- యువకుడి మృతి
- పెళ్లయిన ఏడాదికే అనంతలోకాలకు..



సంతోష్ మృతదేహం

ధర్మపురి: ఆఫీస్‌కు వెళ్లేందుకు ఇంటినుంచి బయలుదేరిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి పడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ధర్మపురికి చెందిన మ్యాన శంకర్–పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. చిన్న కొడుకు సంతోష్(27) వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఆటోలో ఆఫీస్‌కు వెళ్తుండగా బూరుగుపల్లె సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయమైంది. 108 వాహనంలో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తీసుకెళ్లి, చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు.

ఇటీవలే ఘనంగా పెళ్లిరోజు..

సంతోష్‌కు గతేడాది వెల్గటూర్ మండలంలోని కొత్తపేటకు చెందిన సుమలతతో వివాహం జరిగింది. ఇటీవలే పెళ్లిరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెళ్లయిన ఏడాదికే అతను మృతి చెందడంతో భార్య, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆటోడ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా ఆటో నడపడం వల్లే సంతోష్ కిందపడ్డాడని అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

వ్యక్తి దుర్మరణం



తిరుపతి మృతదేహం

జగిత్యాల క్రైం/ధర్మపురి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని దోనూర్‌కు చెందిన గొల్లెన తిరుపతి(37), అతని మిత్రుడు శివరాత్రి తిరుపతి సోమవారం బైక్‌పై జగిత్యాల వెళ్లారు. రాత్రి తిరిగి వస్తూ తిప్పన్నపేట శివారులో వాహనం ఆపగా, శివరాత్రి తిరుపతి మూత్ర విసర్జనకు వెళ్లాడు. గొల్లెన తిరుపతి బైక్‌పై ఉండగా ఓ కారు అతివేగంగా వచ్చి, ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

బావిలో పడి గొర్రెల కాపరి మృతి

రుద్రంగి(వేములవాడ): బావిలో పడి ఓ గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన రుద్రంగి మండలంలోని మానాలలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్‌కుంద మండల కేంద్రానికి చెందిన భాగయ్య(24) తన గొర్రెలను మేత కోసం మానాలకు తీసుకువచ్చాడు. మంగళవారం జీవాలను మేపుతూ ప్రమాదవశాత్తు బావిలో పడి, మృతిచెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చాక మృతదేహాన్ని వెలికితీయించి, పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

లైంగిక దాడికి యత్నించిన కేసులో వ్యక్తికి జైలు

కరీంనగర్ క్రైం: బాలికపై లైంగిక దాడికి యత్నించిన కేసులో ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ కరీంనగర్ రెండో ప్రత్యేక పోక్సో కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీవాణి మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... వెల్గటూర్ మండలంలోని ఎండపల్లికి చెందిన దంపతులు చొప్పదండిలో నివసిస్తూ కూలీ పని చేస్తున్నారు. వీరికి ఒక పాప, బాబు సంతానం. 2020 జూలై 15న ఉద యం తల్లిదండ్రులు పనికి వెళ్లగా ఇద్దరు పిల్లలు ఇంటివద్ద ఉన్నారు. వీరి ఇంటి పక్కన ఉండే తాళ్లపల్లి శంకరయ్య మధ్యాహ్నం తొమ్మిదేళ్ల బాలికను తన ఇంట్లోకి తీసుకెళ్లి, లైంగిక దాడికి యత్నించాడు. ఆమె తమ్ముడు అరవడంతో శంకరయ్య పారిపోయాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చొప్పదండి అప్పటి ఎస్సై వంశీకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు జరిపారు. సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరెల్లి రాములు కోర్టులో ప్రవేశపెట్టి, వాదనలు వినిపించారు. న్యాయమూర్తి సాక్ష్యాధారాలను పరిశీలించి, శంకరయ్యకు శిక్ష విధించారు.

గోపరపల్లి, పెగడపల్లి గ్రామాల్లో విషాదం

కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్(పెద్దపల్లి): ఓదెల మండలంలోని గోపరపల్లిలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం గ్రామంతోపాటు కాల్వశ్రీరాంపూర్ మండలంలోని పెగడపల్లిలో విషాదం నింపింది. పెగడపల్లికి చెందిన మహేశ్, గోపరపల్లెకు చెందిన వంశీకృష్ణారెడ్డిల మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఇదే ప్రమాదంలో గాయపడిన సుల్తానాబాద్ పట్టణంలోని సుగ్లాంపల్లి చెందిన పసెడ్ల సంజయ్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని అతని తండ్రి సంపత్ తెలిపారు. వైద్యులు మంగళవారం ఒక శస్త్రచికిత్స చేశారని, మరో రెండు ఆపరేషన్లు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. కాగా, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో మహేశ్, వంశీకృష్ణారెడ్డిల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తయింది. మృతుల కుటుంబసభ్యులను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఓదార్చారు.

ధర్మనిధి సాహిత్య పురస్కారం అందజేత



అవార్డు అందుకుంటున్న దాస్యం సేనాధిపతి

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ సారస్వత పరిషత్తు ధర్మనిధి సాహిత్య పురస్కారాన్ని కరీంనగర్‌కు చెందిన కవి, విమర్శకుడు దాస్యం సేనాధిపతి అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని పరిషత్తు ప్రాంగణంలో గల దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, పరిషత్తు అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లూరి శివారెడ్డి, జుర్రు చెన్నయ్యల చేతులమీదుగా అవార్డు, రూ.5 వేలు, జ్ఞాపిక అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్): జేఈఈ మెయిన్స్ పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతోంది. తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్, శ్రీ చైతన్య కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. శ్రీ చైతన్యలో మంగళవారం ఉదయం 147 మంది విద్యార్థులకు గాను 142 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం ఇక్కడ పరీక్ష నిర్వహించలేదు. అయాన్ సెంటర్‌లో ఉదయం 680 మందికి గానూ 673 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 634 మందికి గానూ 620 మంది వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎల్ఎండీ ఎస్సై చేరాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైస్‌మిల్లులో పేలిన బాయిలర్



పేలిన బాయిలర్

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులోని గోపికృష్ణ ఇండస్ట్రీస్‌లో బాయిలర్ పేలింది. స్థానికుల వివరాల ప్రకారం.. రైస్‌మిల్లులో ధాన్యం ఉడకబెట్టే బాయిలర్ మంగళవారం ప్రమాదవశాత్తు పేలింది. ఆ సమయంలో అక్కడ మిల్లు కార్మికులు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. కాగా, ఈ ప్రమాదంలో గోదాం, ఊక రూం కూలిపోయాయని, సుమారు రూ.70 లక్షల వరకు నష్టం వాటిల్లిందని యజమాని సాగర్‌రావు తెలిపారు. విషయం తెలుసుకున్న రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు తిరుపతిరెడ్డి, నగునూరి అశోక్, పురుషోత్తంరావు తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ధీర వనిత కామ్రేడ్ కూర మల్లమ్మ

- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క



నివాళి అర్పిస్తున్న విమలక్క, ఉద్యమకారులు

వేములవాడ: నిత్య నిర్బంధాల మధ్య దాదాపు నిండు నూరేళ్ల జీవించిన కామ్రేడ్ కూర మల్లమ్మ పోరాటవీరులకు జన్మనిచ్చిన మహాతల్లి అని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క కొనియాడారు. వేములవాడ పట్టణంలోని మల్లమ్మ ఇంట్లో మంగళవారం ఆమె 5వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. మల్లమ్మ తాణాల చుట్టూ తిరిగినా ఏనాడూ తన పిల్లలకు లొంగిపోవాలని చెప్పని ధీర వనిత అన్నారు. చిన్న కొడుకు జైల్లో, పెద్ద కొడుకు అజ్ఞాతంలో ఉండగా భర్త బాలయ్య మరణిస్తే ఆయన చితికి నిప్పు పెట్టారని పేర్కొన్నారు. మల్లమ్మ యాదిలో అమర్ రాసిన పాటను పాడి, నివాళి అర్పించారు. కార్యక్రమంలో శ్రామిక శక్తి రాష్ట్ర నాయకురాలు రాజేశ్వరి, రేవతి, పురుషోత్తంరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్సూర్, పోతుల రమేష్, రాకేశ్, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

తాహెర్‌కొండాపూర్‌లో శిక్షణ బృందం పర్యటన



గ్రామస్తులతో మాట్లాడుతున్న శిక్షణ అధికారులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని తాహెర్‌కొండాపూర్‌లో మంగళవారం 5 జిల్లాల శిక్షణ అధికారుల బృందం పర్యటించింది. పారిశుధ్య కార్మికుల రక్షణ, భద్రత, గౌరవం, ఆరోగ్యం తదితర అంశాలపై కరీంనగర్‌లో రెండు రోజుల శిక్షణకు హాజరైన కొమురం భీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు యూనిసెఫ్ జిల్లా కో–ఆర్డినేటర్ కిషన్‌స్వామి ఆధ్వర్యంలో గ్రామాన్ని సందర్శించారు. మరుగుదొడ్ల వినియో గం, మురికి కాల్వల నిర్వహణ, తడి, పొడి చెత్త తరలింపు, కంపోస్టు షెడ్డు నిర్వహిస్తున్న తీరు, అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీలో మొక్కల పెంపకం, వైకుంఠధామం తదితరాలపై స్థానికులతో మాట్లాడారు. స్వచ్ఛత, పరిశుభ్రతలో తాహెర్‌కొండాపూర్ జిల్లాలోని మిగిలిన గ్రామాల కంటే ముందంజలో ఉందని తెలిపారు. అనంతరం చెర్లభూత్కూర్‌లో పారిశుధ్య కార్మికులను కలిసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ వాష్ కన్సల్టెంట్ ఫణీంద్రకుమార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి, సర్పంచు మడికంటి మమత, ఎస్‌బీఎం సభ్యులు రమేశ్, వేణు, ఫణి, హరిణి, సురేశ్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

చోరీలు చేస్తున్న యువకుల అరెస్టు

- 11 విద్యుత్ మోటార్లు, ఒక ట్రాక్టర్ ట్రాలీ స్వాధీనం



ట్రాలీ, మోటార్లను చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి: జల్సాలకు అలవాటు పడి, చోరీలు చేస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రవీందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్‌కు చెందిన గుగ్లావత్ నరేశ్, జరుపుల ప్రకాశ్, గుగ్లావత్ రవిలాల్, గుగ్లావత్ అనిల్ జల్సాలకు అలవాటుపడ్డారు. డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. గత నవంబర్ 10న గ్రామ శివారులో విద్యుత్ మోటార్లు చోరీ చేయడానికి వెళ్తుండగా ఓ ట్రాక్టర్ ట్రాలీ కనిపించడంతో తీసుకెళ్లి, పొదల్లో దాచిపెట్టారు. గడిచిన మూడు నెలల్లో ఆత్మకూర్‌తోపాటు జగ్గాసాగర్, రాఘవపేట, వెల్లుల్ల తదితర గ్రామాల్లో 11 విద్యుత్ మోటార్లను దొంగలించారు. వాటిని నిజామాబాద్‌లో విక్రయించడానికి మంగళవారం ట్రాలీలో తీసుకెళ్తుండగా జగ్గాసాగర్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. మోటార్లను స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సమావేశంలో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవి పాల్గొన్నారు.

గల్ఫ్ వెళ్లొచ్చి.. తనువు చాలించి

- అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య
- ధర్మారంలో విషాదం



అంకూస్ మృతదేహం

జగిత్యాల క్రైం: ఊళ్లో పని లేదు.. ఉపాధి కోసం అప్పు చేసి, దేశాలు తిరిగాడు.. ఎక్కడా పని దొరకలేదు.. చివరికి స్వగ్రామం చేరాడు.. పనిలేక.. అప్పులు తీర్చే మార్గం లేక తనువు చాలించాడు జగి త్యాల రూరల్ మండలం ధర్మారానికి చెందిన నేరెళ్ల అంకూస్(44). ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది. ఎస్సై సదాకర్ వివరాల ప్రకారం.. అంకూస్ జీవనోపాధి కోసం అప్పు చేసి, దుబాయ్ వెళ్లాడు. అక్కడ పని లేకపోవడంతో సౌదీ వెళ్లాడు. అక్కడి కంపెనీ జీతాలు ఇవ్వకపోవడంతో తిరిగి వచ్చాడు. మళ్లీ అప్పు చేసి, ఇరాక్ వెళ్లాడు. అక్కడా పని లేకపోవడంతో స్వగ్రామం చేరాడు. తనకు పని లేదని, అప్పులు ఎలా తీర్చాలంటూ నిత్యం మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం లక్ష్మీపూర్ శివారులో క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



స్వామివారి చిత్రపటం తీసుకువస్తున్న అర్చకులు, అధికారులు

వేములవాడ: వేములాడ రాజన్న సన్నిధిలో 5 రోజులపాటు జరిగే త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం అర్చకులు పూజలు చేశారు. అనంతరం త్యాగరాజస్వామి వారి చిత్రపటాన్ని పురవీధుల గుండా సభావేదిక వద్దకు తీసుకొచ్చారు. స్థానిక సరస్వతి శిశుమందిర్ విద్యార్థినుల కోలాట విన్యాసాలు ఆకట్టుకున్నారు. ఉపన్యాసకుడు పాలెపు చంద్రశేఖర్ శర్మ త్యాగరాజస్వామి జీవిత విశేషాలు, జోత్స్న బృందంచే పంచరత్న గానం, స్వర్ణలత హరికథ, పద్మలత బృందంచే సంగీత కచేరి, గుమ్మడి జనార్దన్, వాణిలచే సితార సోలో కచేరి, ఉమాదేవి సంగీత కచేరి, మంగళంపల్లి స్వర్ణలత శాస్త్రీయ సంగీత కచేరి, రేఖ బృందం నృత్య ప్రదర్శన, దుర్గాభవాని నాట్య మండలి వారిచే నాటక కార్యక్రమాలు నిర్వహించాయి. ఆలయ ఈవో కృష్ణప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, పర్యవేక్షకుడు శంకర్, కళాకారులు పాల్గొన్నారు.



శిశుమందిర్ విద్యార్థినుల కోలాట ప్రదర్శన



హరికథ చెబుతున్న స్వర్ణలత

అంజన్న సేవలో భక్తజనం

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు మంగళవారం వేలాదిగా తరలివచ్చారు. కోనేరులో స్నానాలు చేసి, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. తాగునీరు, పార్కింగ్ స్థలం లేక ఇబ్బంది పడ్డారు. ఈవో వెంకటేశ్, ఏఈవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, సిబ్బంది అందుబాటులో ఉన్నారు.



ఆలయం ఎదుట భక్తుల సందడి



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



బేతాళస్వామి ఆలయంలో పూజలు

క్లుప్తంగా

కుష్ఠు వ్యాధిపై అవగాహన


ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

కరీంనగర్‌టౌన్: మహాత్మాగాంధీ వర్ధంతి, జాతీయ కుష్ఠు నిర్మూలన దినోత్సవంలో భాగంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం, వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో స్పర్శ కుష్ఠు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 11వ డివిజన్ కట్టరాంపూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్పొరేటర్ ఆకుల నర్మద డివిజన్‌లోని మహిళలకు కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, మెడికల్ ఆఫీసర్ సాయి రాజ్. దేవేందర్ రెడ్డి, లింగారెడ్డి, కిషోర్, సాగర్, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై సమావేశం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం ఫకీర్‌పేట గ్రామంలో మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కులపై సమావేశం నిర్వహించారు. రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన హక్కులు, బాధ్యతలపై ఆర్‌ఐ రజనీకాంత్ రెడ్డి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో సర్పంచ్ కటుకం నందయ్య, అంగన్‌వాడీ టీచర్ నీలతో పాటు అంబేడ్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బహుమతులు ప్రదానం


బహుమతులు అందుకున్న విద్యార్థులు


కరీంనగర్: గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని కోతిరాంపూర్‌లోని అచీవర్స్ అక్టీవ్ పాఠశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక క్రీడోత్సవాల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులు అందజేసినట్లు పాఠశాల డైరెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏటా విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు, క్రీడల్లో ప్రావీణ్యం పొందేందుకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించి బహుమతులు గెలుపొందారని తెలిపారు. జాతీయస్థాయిలో కూడా బహుమతులు గెలువాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్.పల్లవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



కరీంనగర్: నగరంలోని పద్మావతి కల్యాణ మండపంలో ఈనెల 28న జరిగిన మూడో స్టేట్ లెవల్ ఆల్ స్టైల్ కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కోరా జాన్సన్ విద్యార్థులు ప్రతిభకనబర్చి బహుమతులు సాధించారు. లాస్యశ్రీ గోల్డ్‌మెడల్ మొదటి బహుమతి, ఎం.మనస్విని సిల్వర్ మెడల్ రెండో బహుమతి, రుత్విక్ వెండి బహుమతులు పొందారు. ప్రతిభకనబర్చిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డిలు అభినందించారు.

ఎమ్మెల్సీ కవితను కలిసిన రవీందర్‌సింగ్



సప్తగిరికాలనీ: హైదరాబాద్‌లో జరిగిన మహాత్మా జ్యోతిబాపూలే యునైటెడ్ ఫ్రంట్ ఆవిర్భావ సమావేశం సందర్భంగా కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్‌సింగ్ మంగళవారం ఎమ్మెల్సీ కవితను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు తెలంగాణ నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

కొత్తపల్లి: పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని మంగళవారం కరీంనగర్‌లోని ఇంజినీర్స్ అతిథిగృహంలో ఆవిష్కరించారు. అసోయేషన్ బ్రాంచ్ సెక్రెటరీ అంజయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ట్రాన్స్‌కో చీఫ్ ఇంజినీర్ రాంప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అసోసియేషన్ అడిషనల్ సెక్రెటరీ అంజయ్య, జాయింట్ సెక్రటరీ రమేశ్, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాలకు చెందిన ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మా పాఠశాలలో చేరండి



కరీంనగర్ మండలం ఇరుకుల్లలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాలలో చేరాలంటూ మంగళవారం కరీంనగర్‌లోని హుస్సేనీపురా, సాలంపుర, ఖాస్‌పురా, నాఖా చౌరస్తా వీధుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 5వరకు ప్రవేశం కోసం అవకాశముందని ప్రిన్సిపాల్ నాజీయా ఫాతిమా తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవనీత్‌రెడ్డి, కుమారస్వామి, సాజీయొద్దిన్, ఫక్రొద్దిన్ పాల్గొన్నారు. – కరీంనగర్‌రూరల్

బస్‌షెల్టర్ పునర్నిర్మాణానికి భూమిపూజ

సాక్షి ఎఫెక్ట్



కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో మంగళవారం ఆర్టీసీ బస్‌షెల్టర్ పునర్మిణానికి రెండో డిపో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కమల భూమిపూజ చేశారు. దాదాపు 40 ఏళ్ల క్రితం నిర్మించిన బస్‌షెల్టర్ శిథిలావస్థకు చేరి కూలిపోయే దశలో ఉంది. గతంలో 'సాక్షి'లో పలుమార్లు ప్రచురితమైన కథనాలకు ఆర్టీసీ అధికారులు స్పందించారు. బస్‌షెల్టర్‌ను పునర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. సీటీఐ కమల భూమిపూజ చేసిన అనంతరం కాంట్రాక్టర్ మహ్మద్ షాహిద్ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జక్కం నర్సయ్య, ఉప సర్పంచ్ కూకట్ల తిరుపతి, నాయకులు డి.అంజిరెడ్డి, ఎం. నాగరాజు, టి.ఎల్లారెడ్డి, కె.భూమయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు. – కరీంనగర్‌రూరల్

ఉత్తమ డ్రైవర్లకు బహుమతులు అందజేత


బహుమతులు అందజేస్తున్న అధికారులు

విద్యానగర్(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్ టూ డిపోలో డిసెంబర్ నెల ప్రగతి రథచక్రంలో ఉత్తమ డ్రైవర్లుగా ప్రతిభ కనబర్చిన రాజన్న, డీఎం రెడ్డి, కండక్టర్లుగా పీఏ రావులకు మంగళవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వి.మల్లయ్య, అసిస్టెంట్ మేనేజర్లు పీవీ లక్ష్మి, తిరుపతి, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కమల, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ డీఎల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ ఆశయ సాధనకు పాటుపడాలి


నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు


ప్రతిజ్ఞ చేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కరీంనగర్‌కార్పొరేషన్: గాంధీజీ ఆశయసాధనకు నేటి యువత పాటుపడాలని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ 75వ వర్ధంతి సందర్భంగా మంగళవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తుందని అన్నారు. నాయకులు మడుపు మోహన్, పులి ఆంజనేయులు, శ్రావణ్‌నాయక్, వెన్నరాజ మల్లయ్య, మల్యాల సుజిత్ కుమార్, మల్లికార్జున రాజేందర్, పడిశెట్టి భూమయ్య, విక్టర్ ముస్తాక్, వెన్నం రజిత, రాచర్ల పద్మ తదితరులు పాల్గొన్నారు. కార్ఖానగడ్డలోని గాంధీ విగ్రహానికి పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, నాయకులు లింగంపల్లి బాబు, అబ్దుల్ రహమాన్, దీకొండ శేఖర్, గడప అజయ్, కంకణాల అనిల్‌కుమార్‌లు నివాళి అర్పించారు.

డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో..

కరీంనగర్: నగరంలోని డీవైఎఫ్‌ఐ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి డీవైఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాజ్యాంగ పీఠికను యువతతో ప్రతిజ్ఞ చేయించారు. కొన్ని మతోన్మాద శక్తులు రాజ్యాంగ పీఠికను కాలరాయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న అమరుల స్ఫూర్తితో మతసామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతీ యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు నరేశ్, రాజు, కిషన్ నాయక్, కృష్ణ, వెంకటేశ్, నితిన్, రాజేందర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

విద్యానగర్: నగరంలోని గాంధీరోడ్‌లో గల మహాత్మాగాంధీ విగ్రహానికి కరీంనగర్ పట్టణ ఆర్య వైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం అల్పాహారాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నగునూరి రాజేందర్, ఆర్య వైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు మల్లికార్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వాసవీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


భగవద్గీత పారాయణం చేసున్న సభ్యులు

భగవద్గీత పారాయణం

కరీంనగర్ కల్చరల్ :మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా నగరంలోని గాంధీరోడ్‌లో గల గాంధీ విగ్రహం వద్ద గీతాభక్త సమాజం సభ్యులు శ్రీభగవద్గీత 2వ అధ్యాయం పారాయణం చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సత్తయ్య, కార్య నిర్వాహకుడు రామేశం, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై విద్యార్థి సంఘాల ఆందోళన


ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట సాంఘీక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో విద్యార్థిని అక్షిత ఆత్మహత్యను నిరసిస్తూ మంగళవారం విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. విద్యార్థిని తల్లిదండ్రులతో కలిసి విద్యార్థి సంఘాలు చేపట్టిన ఆందోళనతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థిని తల్లిదండ్రుల అనుమతి లేకుండా మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి ఎలా తరలించారని, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి కళాశాల ప్రిన్సిపాల్, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులకు నచ్చజెప్పి పంపించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు తెలిపారు.

వరిపంట పరిశీలించిన శాస్త్రవేత్త

సాక్షి ఎఫెక్ట్


వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు, చెర్లభూత్కూర్ గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్త ఎం.రాజేంద్రప్రసాద్ పర్యటించారు. ఈనెల 26న 'సాక్షి'లో 'వరిపంటకు తెగుళ్ల బెడద' శీర్షికన ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. శాస్త్రవేత్తలు రాజేంద్రప్రసాద్, శ్రావణి, ఏవో సత్యం మంగళవారం ఆయా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. వరిపంటలో ప్రధానంగా మొగిపురుగు, సల్ఫైడ్ యాక్సైడ్ ఆశిస్తుందని తెలిపారు. వరి నాటేసిన 15రోజుల్లోపు మొగిపురుగు నియంత్రణకు ఎకరానికి 10కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు లేదా 8కిలోల కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను చల్లాలని సూచించారు. పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్‌పీ 400 గ్రాములు ఎకరానికి లేదా క్లోరోనింత్రిప్రోలు 60మిల్లీలీటర్లను ఎకరానికి పిచికారీ చేయాలని అన్నారు.

గ్రామీణ ఓటర్లే లక్ష్యంగా 'గావ్ చలో అభియాన్'


మాట్లాడుతున్న రంజిత్‌మోహన్

కరీంనగర్‌టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లను చేరుకోవడమే లక్ష్యంగా బీజేపీ జాతీయ నాయకత్వం గావ్ చలో అభియాన్ పేరిట కార్యక్రమం చేపట్టిందని పార్టీ సీనియర్ నేత, ప్రోగ్రాం రాష్ట్ర కన్వీనర్ రంజిత్ మోహన్ తెలిపారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో గావ్ చలో అభియాన్ ప్రోగ్రాం జిల్లా కన్వీనర్ మేకల ప్రభాకర్ యాదవ్ అధ్యక్షతన ప్రోగ్రాం సన్నాక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచి జిల్లాలో జరగనున్న గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్లను చేరుకుని, బీజేపీ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, మాడ వెంకట్ రెడ్డి, బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు, ఎర్రబెల్లి సంపత్‌రావు, వెంకటరెడ్డి, రంగు భాస్కరాచారి, బొంతాల కల్యాణ్ చంద్ర, జానపట్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

'అవగాహన లేని వారికి మాట్లాడే అర్హత లేదు'


మాట్లాడుతున్న సోమిడి వేణుప్రసాద్

కరీంనగర్‌టౌన్: కనీస విషయ పరిజ్ఞానం, అవగాహన లేని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు ఎంపీ బండి సంజయ్ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి వేణుప్రసాద్ అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎంపీ బండి సంజయ్ చేసిన అభివృద్ధిపై రవిశంకర్ అజ్ఞానిలా మాట్లాడుతున్నారని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా బండి సంజయ్ ఎనలేని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, సుమారు తొమ్మిదివేల కోట్ల నిధులు వివిధ అభివృద్ధి పనులకు తీసుకొచ్చిన ఘనత సంజయ్‌దే అన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ నాయకులకు అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు జానపట్ల స్వామి, తూర్పాటి రాజు, ప్రవీణ్, పురం హరి తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌ను విమర్శించే అర్హత లేదు

కరీంనగర్‌టౌన్: ఎంపీ బండి సంజయ్‌ను విమర్శించే అర్హత మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు లేదని బీజేజీ రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేకుర్తిలో విలేకరులతో మాట్లాడారు.ప్రజల కోసం నిరంతరం సేవ చేసే వ్యక్తిపై విమర్శలు చేసేటప్పుడు హుందాగా మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో పింగిలి ప్రతాపరెడ్డి, చంద్రగిరి వేణు, రావుల భాస్కరాచారి, నాగుల వెంకటేశ్‌గౌడ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మందులపల్లి సర్పంచ్ కాంగ్రెస్‌లో చేరిక



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మందులపల్లి గ్రామ సర్పంచ్ యార్వ రాజమల్లు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం బొమ్మకల్‌లో సర్పంచ్ యార్వ రాజమల్లు, ఉప సర్పంచ్ మేకల శకుంతలతో పాటు వార్డుసభ్యులు కాంగ్రెస్‌లో చేరగా కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కె.రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షహనవాజ్, ఎస్సీ సెల్ కన్వీనర్ తొప్పెట్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కరీంనగర్: జిల్లాలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దారం జగన్నాథరెడ్డి అన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా నూతనంగా ఎన్నికైన జగన్నాథరెడ్డిని మంగళవారం ప్రెస్‌భవన్‌లో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గాండ్ల గోపాల్, వేల్పుల శ్రీనివాస్, మల్లెత్తుల దేవేందర్, వేల్పుల మహేష్, పాలగాని అంజయ్య, పైడి రవి, ఆడెపు శ్రీకాంత్‌లతో పాటు యూనియన్ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, నాయకులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, రామకృష్ణ, ప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


సాయిప్రియ

కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఫిబ్రవరి 1 నుంచి 4వ వరకు జరిగే 49వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ప్రభుత్వ మహిళా కళాశాలకు చెందిన జి.సాయిప్రియ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఫిజికల్ డైరెక్టర్ జి.శ్రీధర్‌రావు తెలిపారు. సాయి ప్రియను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

నగరంలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్


పట్టుబడిన వాహనాలు

కరీంనగర్‌క్రైం: ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజల భద్రత దృష్ట్యా తీసుకునే చర్యల్లో భాగంగా మంగళవారం కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో నంబర్ ప్లేట్లు లేని, ట్యాంపరింగ్ చేసిన, రిజిస్ట్రేషన్ కాని వాహనాలను గుర్తించి చలాన్ ద్వారా జరిమానాలు విధించారు. ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో దాదాపు 75పైగా ద్విచక్ర వాహనాలను గుర్తించి పట్టుకున్నామన్నారు. స్పెషల్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సబ్ ఇన్‌స్పెక్టర్లు రాజు, సాగర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్లకు సన్మానం


నర్సింగ్ ఆఫీసర్లను సన్మానించిన బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: ఇటీవల స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్స్ పరీక్షలో ఉద్యోగం సాధించిన రేకుర్తికి చెందిన గడప సుజాత, హస్తపురం నిరోషలను మంగళవారం రేకుర్తిలో జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం సీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రావుల భాస్కరాచారి, హస్తపురం లింగయ్య, నరసయ్య, విష్ణు, గడప ప్రశాంత్, ఏదుల్ల లింగయ్య, అంజయ్య, వెంకటేశ్‌గౌడ్, లక్ష్మణ్, మీసాల కొండగట్టు తదితరులు పాల్గొన్నారు.

డీజిల్ బంక్ మార్పునకు బల్దియా ప్రతిపాదన

కరీంనగర్‌కార్పొరేషన్: నగరపాలక సంస్థకు సంబంధించిన వాహనాలకు ఖాతాపై డీజిల్ పోసే పెట్రోల్ బంక్‌ను మార్చాలని అధికారులు నిర్ణయించారు. చాలా ఏళ్ల నుంచి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బంక్‌లో నగరపాలక సంస్థకు ఖాతా ఉంది. నెలకోసారి డీజిల్ బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారు. అయితే ఇటీవల డీజిల్ వినియోగంపై ఆరోపణలు వస్తుండడంతో బంక్‌ను మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు బల్దియా ఖాతాను జైలు బంక్‌కు మార్చాలని, అందుకు అనుమతి ఇవ్వాలంటూ జైలు సూపరింటెండెంట్‌కు నగరపాలక కమిషనర్ శ్రీనివాస్ లేఖ రాశారు. తమ సంస్థకు చెందిన 47 వాహనాలకు రోజూ డీజిల్ పోయాలని, నెలకోసారి బిల్లులు చెల్లిస్తామని లేఖలో పేర్కొన్నారు. కాగా జైలు అధికారులు ఈ ప్రతిపాదను అంగీకరించాల్సి ఉంది.

దాడి చేసిన ఇద్దరిపై కేసు

కరీంనగర్‌క్రైం: బైక్‌ను ఆటో ఢీకొట్టిన ఘటనలో జరిగిన గొడవలో దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కట్టరాంపూర్‌లో నివాసముండే విమలాచారి తన బావ రమేశ్‌లతో కలిసి సోమవారం రాత్రి రాజీవ్‌చౌక్ నుంచి మార్కెట్ వైపునకు వెళ్తుండగా వెనుక నుంచి ఆటో ఢీకొట్టిందన్నారు. వారు ఎందుకు ఢీకొట్టావని అడుగడంతో ఆటోలో నుంచి శాబాద్, సాహిల్‌లు విమలాచారి, రమేశ్‌లపై కర్రలతో దాడి చేసినట్లు తెలిపారు. బాధితులు వన్‌టౌన్‌లో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

షాపు యజమానిపై..

ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జి.చక్రధర్‌రెడ్డి తన బృందంతో మంగళవారం తనిఖీలు చేపడుతుండగా నగరంలోని వాసవిస్ట్రీట్‌లో గల మాన్సి ఫ్యాషన్‌లో ఓ బాలుడు (14) పనిచేస్తుండగా గుర్తించారు. యజమాని కమలేశ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని చక్రధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

సంక్షిప్తంగా..

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తిలో అక్రమ నిర్మాణాలు, అందుకు సహకరిస్తున్న పట్టణ ప్రణాళిక అధికారులపై చర్య తీసుకోవాలని దుర్గం మనోహర్ మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 18, 19 డివిజన్‌లలో ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్ చేశారని, ఇందుకు టౌన్‌ప్లానింగ్ అధికారి ఒకరు కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పొదుపు సంఘాలతో ఆర్థిక ప్రగతి

కరీంనగర్ కార్పొరేషన్: పొదుపు సంఘాల ద్వారా మహిళల ఆత్మగౌరవం పెరిగిందని కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, ఎడ్ల సరిత అన్నారు. కిసాన్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన అమ్మ భగవాన్ సమాఖ్య, పొదుపు సంఘం సమావేశంలో మాట్లాడారు. పొదుపు సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక ప్రగతిని సాధించారన్నారు. ఒక్కో గ్రూప్‌నకు ఎలాంటి గ్యారంటీ లేకుండా రూ.20 లక్షలు రుణాలు ఇచ్చేందుకు బ్యాంక్‌లు ముందుకు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీ లత తదితరులు పాల్గొన్నారు.

టెండర్లు మళ్లీ వాయిదా

కరీంనగర్ కల్చరల్: రేకుర్తి సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా మంగళవారం నిర్వహించిన వేలంలో హెచ్చుపాటలు రానందున టెంకాయల అమ్మకం, కొబ్బరి ముక్కల ప్రోగు, లడ్డూ పులిహోర అమ్మకాలకు టెండర్లు వాయిదా పడినట్లు జాతర అధికారి ఎండపల్లి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గోసారి తిరిగి ఫిబ్రవరి 3న వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా ఈనెల 20న తలనీలాలు, బెల్లం అమ్ముకునే హక్కు కోసం వేలం జరిగిందన్నారు. చింతకుంటలో ఫిబ్రవరి 2న పార్కింగ్, తలనీలాలతో పాటు బెల్లం, పూజాద్రవ్యాలు, కూల్డ్రింక్స్ అమ్ముకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు జాతర అధికారి నాగుల అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

కరీంనగర్‌క్రైం: నేషనల్ రోడ్ సేఫ్టీ వీక్‌లో భాగంగా మంగళవారం కరీంనగర్‌లోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో ట్రాఫిక్ ఏసీపీ సర్వర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పర్స రమేశ్‌లు యువకులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో కరీంనగర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

సప్తగిరికాలనీ: ఖమ్మం జిల్లాలో ఫిబ్రవరి 11,12వ తేదీల్లో జరుగనున్న టీపీటీఎఫ్ ద్వితీయ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ జిల్లా బాధ్యులు చంద్రశేఖర్, పెంటయ్య, రాజమల్లు, బాలయ్య, శ్రీనివాస్, ఆంజనేయరావు, లక్ష్మీరాజం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అధిక సీట్లు ఇవ్వాలి

సప్తగిరికాలనీ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు బీసీలకు అధిక సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు.ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, సంజీవ్, పరుశురాం, మధు, వాసాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ-ఈలో నూర్‌బాషా కులస్తులను చేర్చాలి

సప్తగిరికాలనీ: బీసీ ఈ లో ముస్లిం నూర్‌బాషా కులస్తులను చేర్చాలని లేదా ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీముద్దీన్, వసీం అహ్మద్, అహ్మద్ హసీన్, ఎండీ రజాక్, నసీరొద్దీన్ హైదరాబాద్‌లో మంత్రి భట్టి విక్రమార్కకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ విభజన అనంతరం ఏపీలో నూర్‌బాషా కార్పొరేషన్ ఏర్పడగా తెలంగాణలో అమలు కాలేదని బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో దూదేకుల జీవితాలు కుదేలయ్యాయని మంత్రికి తెలిపారు.

క్లుప్తంగా...



చిన్నజీయర్ స్వామికి సీతారామచంద్రుల ప్రతిమను అందజేస్తున్న మోహన్ భగవత్

చిన్న జీయర్ ఆశ్రమంలో మోహన్ భగవత్

శంషాబాద్ (హైదరాబాద్): ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ముచ్చింతల్‌లోని చిన్నజీయర్ ఆశ్రమాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆశ్రమంలో చిన్నజీయర్ స్వామి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాసేపు వివిధ అంశాలపై చర్చించారు. సీతారామచంద్రుల ప్రతిమను చిన్నజీయర్ స్వామికి ఆర్ఎస్ఎస్ మోహన్ భగవత్ అందజేశారు. అనంతరం దివ్యసాకేత మందిరంతో పాటు రామానుజుల ఆలయంలో ఆయన పూజలు నిర్వహించారు.

బీసీ కులగణన నిర్ణయంపై హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ కులగణన చేపడతామన్న సీఎం ప్రకటనను స్వాగతిస్తున్నామని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు కృష్ణయ్య బృందం తెలంగాణ సచివాలయంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో, బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ ప్రకారం కులగణన చేపడతామన్న ప్రకటనపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. అధికారం చేపట్టిన రోజు నుంచే తెలంగాణలో ప్రజాపాలనను అందిస్తున్న సీఎంకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే కులగణన బిల్లు పెట్టేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుండటంపై కృష్ణయ్య ఆనందం వ్యక్తం చేశారు.

త్వరలో బీసీ మేధావుల సమావేశం

సాక్షి, హైదరాబాద్: బీసీ కులగణనపై ఫిబ్రవరి రెండో వారంలో బీసీ మేధావుల సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. కులగణనపై మేధావులతో బీసీ నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కులగణనపై అధ్యయనానికి బిహార్, ఆంధ్రప్రదేశ్‌లో త్వర లోనే పర్యటిస్తామన్నారు. ఈ మేధావుల సమావేశానికి రాష్ట్రంలోని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తులను, రిటైర్డ్ ఐఏఎస్, ఐపీఎస్‌లను, ప్రొఫెసర్లు, రచయితలు, మేధావులను ఆహ్వానిస్తున్నట్లు జాజుల తెలిపారు.

మోస్తరు క్లిష్టంగా మ్యాథ్స్

- మూడోరోజు ముగిసిన జేఈఈ మెయిన్

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఎన్ఐటీలు, ట్రిపుల్‌ఐటీల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్-2024 ఆన్‌లైన్ పరీక్షల ప్రక్రియ కొనసాగుతోంది. సెషన్-1 పరీక్షల్లో భాగంగా ఈ నెల 24న పేపర్-2 (బీఆర్క్, బీప్లాన్) ప్రవేశపరీక్షలు జరగ్గా ప్రస్తుతం (జనవరి 27, 29, 30, 31, ఫిబ్రవరి 1) పేపర్-1 (బీటెక్) ప్రవేశ పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం వేళల్లో రెండు షిఫ్టులుగా జరుగుతున్నాయి. మంగళవారం రెండు షిఫ్టుల్లో జరిగిన పరీక్షల్లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ ప్రశ్నల కఠినత మధ్యస్థ స్థాయిలో ఉండగా కెమిస్ట్రీ మాత్రం సులభంగా ఉందని విద్యార్థులు, సబ్జెక్టు నిపుణులు అభిప్రాయపడ్డారు. మొత్తంగా ప్రశ్నపత్రం మధ్యస్థంగా ఉందన్నారు. మ్యాథమెటిక్స్‌లో కాలిక్యులస్-ఆల్జీబ్రాకు ప్రాధాన్యతనిస్తూ అన్ని అధ్యాయాల నుంచి ప్రశ్నలు అడిగారు. వెక్టర్స్, 3డీ జామెట్రీ, మ్యాట్రిసెస్ తదితర అంశాల నుంచి ఒకటి కంటే ఎక్కువ ప్రశ్నలు ఇచ్చారు. ఫిజిక్స్‌లోనూ ఎంసీక్యూలు-న్యూమరికల్ ఆధారిత ప్రశ్నలు సుదీర్ఘంగా ఉన్నాయి. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచి ప్రశ్నలు కూడా అడిగారు. ఎన్‌సీఈఆర్‌టీ ఇంటర్ రెండో సంవత్సరం పుస్తకాల్లోని అంశాలకు ఎన్‌టీఏ ఎక్కువ వెయిటేజీ ఇచ్చినట్లు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. కెమిస్ట్రీలో ఇనార్గానిక్ కెమిస్ట్రీతో పోలిస్తే ఆర్గానిక్-ఫిజికల్ కెమిస్ట్రీకి ఎక్కువ వెయిటేజీ ఇచ్చినట్లు తెలిపారు. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల నుంచి కొన్ని ప్రశ్నలు నేరుగా ఇవ్వడంతో ఈ విభాగంలో విద్యార్థులు సులభంగా సమాధానాలు రాయగలిగారని నిపుణులు పేర్కొన్నారు. ఏప్రిల్ 1 నుంచి 15 మధ్య జేఈఈ మెయిన్-2024 సెషన్-2 పరీక్షలు జరగనున్నాయి.



సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన అపోలో హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ శోభనా కామినేని, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతా రెడ్డి

నవయుగంపై జగన్ సంతకం

అక్కాచెల్లెళ్లకు ఆస్తి పత్రాలు.. 30.61 లక్షల మంది మహిళలకు పక్కా రిజిస్ట్రేషన్‌తో ఇళ్లస్థలాలు

- మహిళల పేరుతో రిజిస్ట్రేషన్.. కన్వేయన్స్ డీడ్లు కూడా
- పట్టా పొందిన నాటి నుంచి పదేళ్ల తర్వాత సర్వహక్కులు
- గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు



సాక్షి, అమరావతి: దేశంలోనే తొలిసారిగా ఒకేసారి 30.61 లక్షల ఇళ్ల పట్టాలను ఇచ్చి పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు వాటిని అక్కచెల్లెమ్మల పేరు మీద రిజిస్టర్ చేసి మరో చరిత్ర సృష్టించనుంది. తద్వారా పేదలకు ఇచ్చిన ఇళ్లను రిజిస్టర్ చేసిన తొలి ప్రభుత్వంగా సీఎం జగన్ సర్కారు రికార్డుకెక్కనుంది. దీనివల్ల పట్టాలు పొందిన పేదలకు తమ ఇళ్లపై పూర్తి భరోసా దక్కుతుంది. రిజిస్ట్రేషన్ తర్వాత లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్‌లు అందచేస్తారు. ఈమేరకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం నేడో రేపో పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది. ఒకేసారి 30.61 లక్షల రిజిస్ట్రేషన్లు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు పూర్తి చేసింది. 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ ప్రభుత్వం 30.61 లక్షల ఇళ్ల స్థలాలను ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందుకోసం రూ.31,832 కోట్ల విలువైన 71,811 ఎకరాల భూమిని సేకరించి 17 వేలకుపైగా లేఅవుట్లు నిర్మించింది. అందులో భాగంగా 25,374 ఎకరాల ప్రైవేటు భూమిని రూ.11,343 కోట్లు ఖర్చు పెట్టి భూసేకరణ ద్వారా సేకరించింది. ఇళ్ల పట్టాల కోసం ప్రైవేట్ భూమిని సేకరించడం, రూ.వేల కోట్లు వెచ్చించి పేదల ఇంటి కలను నెరవేరుస్తున్న తొలి ప్రభుత్వం ఇదే కావడం గమనార్హం.

ఇప్పటివరకు 'డి'పట్టాలే..

ఇప్పటివరకు ప్రభుత్వాలేవీ ఇళ్ల పట్టాలను పేదల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయలేదు. 1977 అసైన్డ్ భూముల చట్టం (పీఓటీ) ప్రకారం గత ప్రభుత్వాలు పేదలకు 'డి'పట్టాలు మాత్రమే జారీ చేసేవి. అది కూడా చాలా స్వల్ప సంఖ్యలోనే ఉండేవి. ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వం మొదటిసారిగా లక్షల మందికి ఒకేసారి ఇళ్ల పట్టాలు ఇచ్చింది. ఇప్పుడు వాటిని మహిళలకు సర్వ హక్కులతో రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనుంది. వాస్తవానికి 2020 ఉగాది నాడే ఇళ్లతోపాటు రిజిస్ట్రేషన్లు కూడా చేసి ఇవ్వాలని సీఎం జగన్ భావించారు. ఇందుకోసం పదేళ్ల తర్వాత ఇళ్ల పట్టాలపై లబ్ధిదారులు యాజమాన్య హక్కులు పొందేలా అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించారు. కానీ అప్పట్లో కొందరు రాజకీయ స్వార్థంతో పేదలకు మేలు చేసే ఈ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. దీంతో అప్పటికి తాత్కాలికంగా 'డి'పట్టాల ప్రకారం ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

మాటకు కట్టుబడి రిజిస్ట్రేషన్లు

అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం సర్వ హక్కులతో వారి పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసేందుకు అసైన్డ్ భూముల చట్టాన్ని ప్రభుత్వం ఇటీవల మరోసారి సవరించింది. దాని ప్రకారం 2021లో 'డి'పట్టాలు ఇచ్చిన 30.61 లక్షల మందికి ఇప్పుడు రిజిస్ట్రేషన్లు చేయనుంది. అనంతరం ఆ స్థలాల లబ్ధిదారులైన అక్క చెల్లెమ్మలకు కన్వేయన్స్ డీడ్‌లు అందించనుంది. ఈ డీడ్‌లు పదేళ్ల గడువు ముగిసిన తర్వాత ఆటోమేటిక్‌గా సేల్ డీడ్‌లుగా మారతాయి. అప్పుడు ప్రభుత్వ జోక్యం లేకుండానే నేరుగా ఆ స్థలాలను అమ్ముకోవడానికి, ఇతర ప్రయోజనాల కోసం వినియోగించుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

సంక్లిష్ట ప్రక్రియకు తెర

ప్రస్తుతం గడువు ముగిసిన 'డి'పట్టాలను క్రమబద్ధీకరించుకోవడం ఎంత కష్టమో అందరికి తెలిసిన విషయమే. దానికి రెవెన్యూ శాఖ నుంచి ఎన్వోసీ, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ శాఖ వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగించడం క్లిష్టమైన ప్రక్రియ. పేద మహిళలు అలాంటి అవస్థలు పడకుండా వారికిచ్చిన ఇళ్ల స్థలాలను వారి పేరుతోనే ప్రభుత్వం రిజిస్టర్ చేసి కన్వేయన్స్ డీడ్‌లు ఇస్తోంది. ఈ డీడ్‌ల వల్ల ఆ స్థలాలు విలువైన స్థిరాస్తిగా వారికి సమకూరనున్నాయి. ఆ ఆస్తిపై బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశం కలుగుతుంది. ప్రైవేట్ ఆస్తి మాదిరిగానే లబ్ధిదారులు, వారి వారసులు అనుభవించే అవకాశం ఏర్పడుతుంది. ఆ ఆస్తి వివాదంలో చిక్కుకునే అవకాశం ఉండదు. తద్వారా పేద మహిళలకు వారు పొందిన ఇళ్ల పట్టాలపై పూర్తి భరోసా లభిస్తుంది. పదేళ్ల తర్వాత ఎవరితోనూ సంబంధం లేకుండా ఆ స్థలాలపై వారికి పూర్తి హక్కులు సంక్రమిస్తాయి. తహసీల్దార్ల నుంచి నిరభ్యంతర పత్రాలు తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఆ స్థలాలు వారి పేరు రిజిస్టర్ అయి ఉండడం, కన్వేయన్స్ డీడ్‌లు కూడా ఇస్తున్నందున వాటిని ఆస్తిపత్రాలు (సేల్ డీడ్)గా వినియోగించుకునే అవకాశం లభిస్తుంది.

సీమకు ఇం'ధనం'

- ఆంధ్రప్రదేశ్‌కి రూ.22,302 కోట్ల పెట్టుబడుల రాక
- రాయలసీమలో భారీగా సోలార్, విండ్ ప్రాజెక్టులు
- ప్రత్యక్షంగా 5,300 మందికి ఉద్యోగాలు
- సీఎం జగన్ అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులకు సంబంధించిన పలు ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు) ఆమోద ముద్ర వేసింది. ప్రధానంగా రాయలసీమ ప్రాంతంలో ఇంధన రంగంలో భారీ పెట్టుబడులు తరలి రానున్నాయి. ఇంధన రంగంలో పలు ప్రాజెక్టుల ద్వారా రూ.22,302 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. తద్వారా ప్రత్యక్షంగా 5,300 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులివీ

- జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ దాదాపు రూ.12,065 కోట్ల పెట్టుబడితో ఏపీలో 3,350 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టులను నెలకొల్పనుంది. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట వద్ద 400 మెగావాట్లు, శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బవద్ద 1,050 మెగావాట్లు, అనంతపురం జిల్లా కనగానపల్లె, రాప్తాడుల్లో 1,050 మెగావాట్లు, అనంతపురం జిల్లాలో డి.హీరేహాళ్, బొమ్మనహాళ్‌లో 850 మెగావాట్ల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. ప్లాంట్ల ఏర్పాటు ద్వారా 3,300 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.
- జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ నంద్యాల జిల్లా అవుకు మండలం కునుకుంట్ల, కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం జలదుర్గం వద్ద రెండు విండ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనుంది. రూ.1,287 కోట్ల పెట్టుబడితో 171.60 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులు సాకారం కావడం ద్వారా 200 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.
- శ్రీసత్యసాయి జిల్లా తలుపుల మండలం పులిగుండ్లపల్లెలో 1,000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్ట్‌ను ఆక్వా గ్రీన్ ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.4,000 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది. తద్వారా 1,000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు దక్కుతాయి.
- కర్నూలు జిల్లా ఆస్పరి వద్ద 200 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎక్రోస్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ.1350 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 200 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయి.
- శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో 600 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్‌లను రెన్యూ విక్రం శక్తి ప్రైవేట్ లిమిటెడ్ రూ.3,600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనుంది. తద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించనున్నాయి.

రూ.1.33 లక్షల కోట్ల రుణం

▶ మొదటి పేజీ తరువాయి

రుణ ప్రణాళికలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు పెద్దపీట వేయటం విశేషం. నడుస్తున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణ ప్రణాళికలో నాబార్డు ఖరారు చేసిన మొత్తం రూ.1,12,762 కోట్లు మాత్రమే కావటం గమనార్హం. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖరారైన వ్యవసాయ రుణాల్లో.. పంటల సాగు, మార్కెటింగ్ కోసం రూ.81,478.02 కోట్లు, టర్మ్‌లోన్‌ల కింద రూ.27,664.91 కోట్లు, వ్యవసాయ రంగంలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు రూ.5197.26 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.19,247.67 కోట్ల రుణాలను ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించింది. వ్యవసాయ రంగం తర్వాత సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు రుణాలను ఖరారు చేసింది. ఈ రంగానికి రూ.1,29,635.83 కోట్ల వరకు రుణాల రూపంలో ఇవ్వవచ్చని బ్యాంకర్లకు సూచించింది.

బ్యాంకర్లు మరింత సాయానికి ముందుకు రావాలి: తుమ్మల

దేశ వ్యవసాయ రంగంలో తెలంగాణకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా బ్యాంకర్లు మరింత ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు రావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం వ్యవసాయంపై ఫోకస్ చేస్తుండటాన్ని నాబార్డు, బ్యాంకర్లు గుర్తించాలని కోరారు. పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని సూచించారు. ఆ రంగంలో గేదెలపైనే ఎక్కువగా దృష్టిసారిస్తున్నారని, కానీ ఆవు పాల వృద్ధిని కోరుకుందామని, దీని వల్ల ఆరోగ్యంతోపాటు, మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రోత్సహించినట్లవుతుందని మంత్రి తుమ్మల సూచించారు. పామాయిల్ సాగుకు కూడా మరింత ప్రోత్సాహం అవసరమన్నారు. వరి సాగు విస్తృతంగా సాగుతోందని, కానీ సంప్రదాయ తృణ ధాన్యాల వృద్ధిపై రైతులు దృష్టి సారించాలని మంత్రి కోరారు.

నాగార్జున గ్రామీణ బ్యాంకు రుణంతోనే నా తొలి నామినేషన్

తనకు వ్యవసాయం రంగం, అందుకు రుణాలిచ్చే గ్రామీణ బ్యాంకులతో మంచి అనుబంధం ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. తాను సాగు కోసం నాగార్జున గ్రామీణ బ్యాంకు నుంచి రుణం తీసుకునేవాడినని, 1983 తొలి నామినేషన్ కోసం కూడా ఆ బ్యాంకు నుంచే రుణం తీసుకున్నట్టు వెల్లడించారు.

రైతు బంధు నిధులను పెంచుతాం: రఘునందన్‌రావు

రాష్ట్రంలో ప్రతి రెండున్నర వేల మంది రైతులకు ఒకటి చొప్పున ఉన్న రైతు వేదికలను ఆధునికీకరించటం ద్వారా వాటి వినియోగాన్ని పెంచి రైతులకు మరింత ఉపయోగకరంగా మారుస్తామని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్‌రావు వెల్లడించారు. వాటిల్లో టూ వే ఆడియో విజువల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో క్రాప్ ఇన్స్యూ పథకాన్ని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. రైతు భరోసా ద్వారా ప్రస్తుతం అందుతున్న రైతు బంధు నిధులను పెంచుతున్నట్లు చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో వీటన్నిటి రంగాలను అభివృద్ధి చేసేందుకు నాబార్డు తీవ్రంగా కృషి చేస్తోందని, వాటి అవసరాలకు తగ్గట్టుగా రుణాలు అందేలా చర్యలు తీసుకుంటోందని ఆ సంస్థ సీజీఎం సుశీల చింతల పేర్కొన్నారు. ఆర్బీ డీజీఎం రాజేంద్రప్రసాద్, ఎస్‌బీఐ జీఎం, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ దేబాశీష్ మిత్ర తదితరులు పాల్గొన్నారు.

2024-25 సంవత్సరానికి వివిధ రంగాలకు నాబార్డు ఖరారు చేసిన రుణ ప్రణాళిక

- వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.133587.86 కోట్లు
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు రూ. 129635.83 కోట్లు
- ఎగుమతుల కోసం రుణాలు రూ. 451.67 కోట్లు
- విద్య రూ.2706.50 కోట్లు
- గృహనిర్మాణం రూ.10768.58 కోట్లు
- పునరుత్పాదక విద్యుత్తు రూ.566.61కోట్లు
- ఇతర రంగాలు రూ.2283.51



రెండవ తరం ఎంటర్‌ప్రెన్యూర్లపై బాధ్యతలు ఎక్కువ

- ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- రాయదుర్గంలో దాసోస్ కేబినెట్స్ ప్రారంభం

హఫీజ్‌పేట్ (హైదరాబాద్): ప్రస్తుత మార్కెట్‌లో రెండవ తరం ఎంటర్‌ప్రెన్యూర్‌లపై బరువు, బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాయదుర్గంలోని జీఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం రాత్రి దాసోస్ కేబినెట్ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, కుటుంబసభ్యులు, స్నేహితులు, సన్నిహితులు మొదటి తరంతో పోల్చిచూసి మన పనితీరును అంచనా వేస్తారని గుర్తుంచుకోవాలన్నారు. మొదటి తరంతో పోలిస్తే రెండవతరం మరింత కష్టపడి, శ్రమపడి పనిచేయాల్సి ఉంటుందన్నారు. వ్యాపారం, రాజకీయమేకాకుండా ఏ రంగంలో వారైనా రెండవతరం వారు బాధ్యతలను గుర్తెరిగి పనిచేయాలన్నారు. మొదటి, రెండవ తరాల వారిని ఆదర్శంగా తీసుకొని అక్కినేని నాగచైతన్య, దాసోస్ సంస్థ యాజమాన్యం కూడా మొదటి తరం వారిని ఆదర్శంగా తీసుకొని విజయవంతంగా ముందుకు సాగడం సంతోషంగా ఉందన్నారు. సినీ హీరో అక్కినేని నాగచైతన్య మాట్లాడుతూ దాసోస్ గ్రూప్ బ్రాండ్ అంబాసిడర్ కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దాసోస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోజ్‌కశ్యప్ తదితరులు పాల్గొన్నారు.

6న గోదావరి బోర్డు సమావేశం

సాక్షి, హైదరాబాద్: గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశం ఫిబ్రవరి 6న హైదరాబాద్‌లో జరగనుంది. ప్రాజెక్టుల అప్పగింతతో పాటు పలు ప్రాజెక్టుల నిర్మాణాలు, నీటి వినియోగంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఫిబ్రవరి 5 నుంచి 9వ తేదీ మధ్యలో ఏ రోజు సమావేశానికి హాజరుకావడానికి వీలవుతుందని ఏపీ నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్‌ను బోర్డు ఆరా తీయగా.. ఫిబ్రవరి 6న పెట్టుకోవాలని ఆయన సూచించారు.

సాగర్, శ్రీశైలంను అప్పగించండి

- ఆ ప్రాజెక్టుల అప్పగింత కోసం కేంద్రం వద్ద ఇరు రాష్ట్రాలూ అంగీకరించాయి
- ఆ మేరకు ఇచ్చిన మాట నిలుపుకోవాలి
- తెలుగు రాష్ట్రాలకు కృష్ణాబోర్డు లేఖ
- అప్పగింతపై ఫిబ్రవరి 1న సమావేశం

సాక్షి, హైదరాబాద్: నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల అప్పగింతకు తెలుగు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయని, దీని ప్రకారం ఆయా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) స్పష్టం చేసింది. ఈనెల 17వ తేదీన న్యూఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయా ప్రాజెక్టులతో పాటు వాటి పరిధిలోని కాంపోనెంట్లను అప్పగించేందుకు రాష్ట్రాలు పరస్పరం అంగీకారం తెలిపాయని బోర్డు సభ్యుడు అజయ్‌కుమార్ గుప్తా గుర్తు చేశారు. ఈ మేరకు మంగళవారం తెలుగు రాష్ట్రాలకు లేఖ రాశారు.

మా అధికారులను అనుమతించడం లేదు

వాస్తవానికి దీనికన్నా ముందు ఈనెల 22వ తేదీన కృష్ణాబోర్డుకు తెలంగాణ రాష్ట్రం సాగర్‌పై లేఖ రాసింది. గత నవంబరు 29వ తేదీ రాత్రి నాగార్జున సాగర్ డ్యామ్‌లోకి ఏపీ అధికారులు చొరబడి ప్రాజెక్టులోని ఏపీవైపు ఉన్న భాగాన్ని స్వాధీనం చేసుకుని గేటు నెం.13ను ఎత్తి కుడికాలువకు నీటిని విడుదల చేశారని ఆరోపించింది. దీనిపై కేంద్ర జలశక్తి శాఖతో పాటు కేంద్ర హోంశాఖ వద్ద జరిగిన సమావేశం నేపథ్యంలో నవంబరు 28వ తేదీకి ముందు ఉన్న పరిస్థితిని పునరుద్ధరించాలనే ఆదేశాలు ఉన్నాయని, అయితే ఇప్పటిదాకా ఏ నిర్ణయం తీసుకోలేదని బోర్డుకు లేఖ ద్వారా తెలంగాణ గుర్తు చేసింది. ప్రస్తుతం డ్యామ్ రక్షణకు ముడిపడిన పనులు చేపట్టాల్సి ఉండగా.. డ్యామ్‌లోని గేటు నెం.14 నుంచి 26 వరకు తెలంగాణ అధికారులను అనుమతించడం లేదని, దీనివల్ల పనులు చేపట్టలేక పోతున్నామని నివేదించింది.

రెండు రాష్ట్రాలూ మరమ్మతు పనులు చేపట్టాలన్న బోర్డు: తెలంగాణ వాదనలకు బోర్డు స్పందిస్తూ ఇరు రాష్ట్రాలకూ లేఖ రాసింది నాగార్జున సాగర్ డ్యామ్ ప్రస్తుత పరిస్థితిపై ఈనెల 17వ తేదీన జరిగిన సమావేశంలో నెలరోజుల్లో శ్రీశైలంతో పాటు సాగర్ డ్యామ్‌తో పాటు వాటి కింద ఉన్న మొత్తం 15 కాంపోనెంట్లను అప్పగించడానికి తెలుగు రాష్ట్రాలు పరస్పరం అంగీకారం తెలిపాయని గుర్తు చేసింది. ఆయా ప్రాజెక్టులను నెలరోజుల్లోగా తెలుగు రాష్ట్రాలు అప్పగించాల్సి ఉంటుందని, ఇక సాగర్‌పై తెలంగాణ వైపు తెలంగాణ అధికారులు, ఏపీ వైపు ఏపీ అధికారులు మరమ్మతు పనులు చేపట్టాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియ అంతా కూడా కృష్ణా బోర్డు అనుమతితోనే చేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలు కూడా బకాయిలను, నిధులను విడుదల చేయాలని కోరింది.

అప్పగింతపై ఫిబ్రవరి 1న సమావేశం

శ్రీశైలం, నాగార్జునసాగర్ల అప్పగింత లాంఛనాలపై చర్చించేందుకు వీలుగా ఫిబ్రవరి 1వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు బోర్డు తెలుగు రాష్ట్రాలకు సమాచారం ఇచ్చింది. హైదరాబాద్ జలసౌధలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశాలకు ఈఎన్‌సీలు హాజరుకావాలని కోరింది.

ఎన్డీఎస్ఏ కమిటీల్లో కృష్ణాబోర్డు అధికారులు

నామినేట్ చేస్తూ బోర్డు ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ భద్రతపై అధ్యయనం చేయడానికి ఫిబ్రవరి 6 నుంచి 15వ తేదీ మధ్యలో జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) ఆయా డ్యామ్‌లను పరిశీలించనున్న నేపథ్యంలో పరిశీలన కమిటీల్లో అధికారులను నామినేట్ చేస్తూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం పరిశీలన కమిటీలో బోర్డు నుంచి సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) ఆర్.వి.ప్రకాశ్, నాగార్జునసాగర్ కమిటీలో ఎస్ఈ గంటెల వరలక్ష్మీదేవిని నామినేట్ చేస్తూ చైర్మన్ శివనందన్‌కుమార్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఎన్డీఎస్ఏకు సమాచారం ఇచ్చారు. ఫిబ్రవరి 6 నుంచి 8వ తేదీ మధ్యలో శ్రీశైలం ప్రాజెక్టును ఎన్డీఎస్ఏ సభ్యుడు వివేక్ త్రిపాఠి నేతృత్వంలో డిప్యూటీ డైరెక్టర్ అమిత్ మిట్టల్, కన్సల్టెంట్ కమలేశ్ జైన్ సభ్యులుగా ఉన్న కమిటీ పరిశీలించనుండగా.. నాగార్జునసాగర్ డ్యామ్‌ను ఈనెల 13–15వ తేదీ మధ్యలో ఎన్డీఎస్ఏకు చెందిన సాంకేతిక సభ్యుడు రాకేశ్ కశ్యప్ నేతృత్వంలోని ఎన్డీఎస్ఏ డైరెక్టర్ (రెగ్యులేషన్) ఎంఎస్ వర్మ, డిప్యూటీ డైరెక్టర్ మహ్మద్ జీషన్, కన్సల్టెంట్ రాకేశ్ గౌరానాతో కమిటీ పరిశీలించనున్న విషయం తెలిసిందే.

6,956 మంది స్టాఫ్ నర్సు ఉద్యోగాల భర్తీ పూర్తి

- నేడు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాల అందజేత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో 6,956 స్టాఫ్‌నర్సు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ పూర్తయింది. ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం నియామక పత్రాలను అందించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరగనున్న ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పాల్గొననుండగా సభాధ్యక్షుడిగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వ్యవహరించనున్నారు. గతేడాది 5,204 స్టాఫ్‌నర్సు పోస్టుల భర్తీకి తొలుత నోటిఫికేషన్ వెలువడగా ఆ తర్వాత మరో 1,890 పోస్టులను నోటిఫై చేయడంతో వాటిని కూడా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పోస్టుల సంఖ్య 7,094కి పెరిగింది. చివరకు 6,956 మంది ఎంపికయ్యారు. ఆర్థోపెడికల్ ఛాలెంజ్ కేటగిరీలో అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో 138 పోస్టులు భర్తీ కాలేదు.

- కొత్తగా ఎంపికైన స్టాఫ్‌నర్సులకు కనీస ప్రాథమిక వేతనం రూ. 36,750. దీంతోపాటు టీఏ, డీఏ, హెచ్ఆర్ఏ తదితర అలవెన్సులు ఉంటాయి.
- స్టాఫ్ నర్సుల జీతభత్యాల కోసం నెలకు దాదాపు రూ. 35 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయనుంది.
- 26 వైద్య కళాశాలలు, ఇతర స్పెషాలిటీ ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలోని ఖాళీల్లో వారికి పోస్టింగ్ ఇవ్వనున్నారు. దీంతో అన్ని ఆస్పత్రుల్లో స్టాఫ్ నర్సుల ఖాళీలు దాదాపు భర్తీ అవుతాయి.
- తాజాగా నియమితులైన స్టాఫ్ నర్సుల్లో బీసీలు 45.97%, ఎస్సీలు 30.64%, ఎస్టీలు 12.81% మంది ఉన్నారు. అలాగే మహిళలు 88.16% మంది, పురుషులు 11.83% మంది ఉన్నారు.


నేడు సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్: ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలను తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ ఎడమకాల్వకు బుధవారం నీటిని విడుదల చేయనున్నారు. ఖమ్మంలోని పాలేరు జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా పడిపోవడంతో తాగునీటి అవసరాలు తీర్చేందుకు నీటిని విడుదల చేయనున్నారు.

సాగర్ జలాశయం నీటిమట్టం ప్రస్తుతం 520.10 అడుగులు (149.4580 టీఎంసీలు) ఉంది. డెడ్ స్టోరేజీ మట్టం 510 అడుగులు. హైదరాబాద్‌తో పాటు పలు పట్టణాలకు సాగర్ జలాశయం నుండే నీటిని పంపింగ్ చేస్తారు.

ఎన్నికల ముంగిట... ఎన్నో ఆశలు

కీలక రైల్వే ప్రాజెక్టులకు ఎదురుచూస్తున్న తెలంగాణ



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ముందు ప్రవేశపెడుతున్న బడ్జెట్ కావడంతో రైల్వే ప్రాజెక్టులకు భారీగానే కేటాయింపులు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. గత మూడు బడ్జెట్‌లలో లైన్లు, రైళ్ల పరంగా నిరాశే కలిగినా, కేటాయింపులు కొంత మెరుగ్గానే ఉన్నాయి. కానీ, తెలంగాణలో రైల్వేపరంగా ఉన్న డిమాండ్లతో పోలిస్తే, ఇవి సరిపోవు. దీంతో ప్రతీ బడ్జెట్ ఇంకా మెరుగ్గా ఉంటుందన్న ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. బడ్జెట్ ముందు ఎంపీలతో భేటీ అయ్యి వారి నుంచి అధికారులు ప్రతిపాదనలు స్వీకరిస్తారు. కానీ ఈసారి అలాంటి భేటీ దక్షిణమధ్య రైల్వే నిర్వహించలేదు. తను కూడా ప్రత్యేకంగా ప్రతిపాదనలు పంపలేదని తెలిసింది.

ఆయా రైల్వే లైన్లు ఇలా....

ఆర్మూరు–ఆదిలాబాద్ : ఈ లైన్ కీలకం. దీనికోసం బీజేపీ ఎంపీలు ధర్మపురి అరవింద్, సోయం బాపూరావు, బండి సంజయ్ లాంటి వారు డిమాండ్ చేస్తున్నారు.

- 15 ఏళ్ల క్రితం పటాన్‌చెరు-ఆదిలాబాద్ లైన్ మంజూరైంది. ఆర్మూరు- నిర్మల్ మీదుగా సాగాల్సిన దీని నిడివి. 317 కి.మీ. ఇందుకు రూ.3771 కోట్లు ఖర్చవుతుదని అంచనా వేశారు. కానీ, ఆ తర్వాత దానిని కేంద్రం పక్కనపెట్టింది.
- పెద్దపల్లి-నిజామాబాద్ లైన్ పూర్తయిన నేపథ్యంలో కొత్త ప్రతిపాదన పట్టాలెక్కింది. కరీంనగర్-నిజామాబాద్ లైన్‌లో ఉన్న ఆర్మూరు స్టేషన్ నుంచి కొత్త లైన్ మొదలై ముద్ఖేడ్-నాగ్‌పూర్ లైన్‌లో ఉన్న ఆదిలాబాద్ స్టేషన్‌తో అనుసంధానమవుతుంది. దీని నిడివి 300 కి.మీ., రూ. 2800 కోట్ల అంచనాతో 2017లో ఈ లైన్ మంజూరైంది. సర్వే పూర్తయ్యాక పనులు పట్టాలెక్కలేదు. దీనికి నిధులు కేటాయించాలన్న ఒత్తిడి పెరిగింది.
- వికారాబాద్-కృష్ణా: తెలంగాణ సీఎం మొదలు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గట్టిగా డిమాండ్ చేస్తున్న ప్రాజెక్టు వికారాబాద్-కృష్ణా లైను. గత బడ్జెట్‌లో ఫైనల్ లొకేషన్ సర్వే కూడా మంజూరైనా పనులు మొదలు కాలేదు. వికారాబాద్-పరిగి-కొడంగల్-దౌలతాబాద్-మక్తల్-నారాయణపేట్-కృష్ణా మీదుగా 122 కి.మీ.మేర కొనసాగే ఈ ప్రాజెక్టుకు రూ.2196 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. రైల్వే కనెక్టివిటీ లేని కొత్త ప్రాంతాలకు ఆ రవాణా వసతి కల్పిస్తుంది. ఇటీవలే దక్షిణ మధ్య రైల్వే జీఎంతో సీఎం భేటీ అయి దీనిపై చర్చించారు. ఈ రెండు తెలంగాణకు కీలక ప్రాజెక్టులు కావటంతో వీటి కేటాయింపులపై ఆశలు పెరుగుతున్నాయి.

రాష్ట్రానికొచ్చేసరికి....

మనోహరాబాద్-కొత్తపల్లి లైన్‌కు, కాజీపేట వ్యాగన్ ఫ్యాక్టరీకి భారీగానే కేటాయింపులుంటాయని, కాజీపేట-బల్లార్షా, కాజీపేట-విజయవాడ మూడో లైన్‌కు కూడా ప్రాధాన్యం దక్కుతుందని భావిస్తున్నారు. భద్రాచలం-కొవ్వూరు, రామగుండం-మణుగూరు ప్రాజెక్టు విషయంలోనూ ఒత్తిడి పెరుగుతోంది. ఎంఎంటీఎస్ రెండోదశ, యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది.

- గత బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు కేంద్రం రూ.13786.19 కోట్లు కేటాయించింది. ఇందులో తెలంగాణ రాష్ట్ర వాటా రూ.4418 కోట్లు. 2022-23లో కేటాయించిన మొత్తం రూ.8349.75 కోట్లు. ఇందులో తెలంగాణ వాటా రూ.3048 కోట్లు.

భూ లీజు కేటాయింపు నిలిపివేత

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఖానామెట్‌లో సాయి సింధూ ఫౌండేషన్‌కు గత ప్రభుత్వం ఇచ్చిన 15 ఎకరాల భూమి లీజు ఉత్తర్వులను నిలిపివేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎకరాకు రూ.2 లక్షల లీజు రుసుముతో 30 ఏళ్ల కోసం ఈ భూమిని లీజుకు కేటాయించింది. క్యాన్సర్, ప్రాణహాని కలిగించే వ్యాధుల బారినపడే రోగులను రక్షించడానికి లాభాపేక్ష లేకుండా ఆసుపత్రి నిర్వహణ కోసం ఈ భూమిని గత ప్రభుత్వం కేటాయించింది. గతంలో భూ కేటాయింపుపై హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు, ఇతర అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకుని లీజు ఉత్తర్వులను నిలిపివేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.



రెక్కల పురుగు కథ ఏమిటో అడుగు

రెక్కల పురుగులన్నీ సీతాకోక చిలుకలు కావు. కాని సీతాకోకచిలుకలన్నీ రెక్కల పురుగులే. హిమాలయ ప్రాంతాలకు చెందిన మాత్ (రెక్కల పురుగు)లపై తీసిన 'నాక్టర్న్స్' డాక్యుమెంటరీ అమెరికాలో జరిగిన 'సండాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్'లో స్పెషల్ జ్యూరీ అవార్డ్ పొందింది. ఇండియా నుంచి అవార్డ్ గెలిచిన డాక్యుమెంటరీ ఇదొక్కటే. డైరెక్టర్ అనుపమ శ్రీనివాసన్ పరిచయం.



అనుపమ శ్రీనివాసన్

అమెరికాలో ప్రతి ఏటా జరిగే సండాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నామినేషన్ పొందడమే పెద్ద గుర్తింపుగా భావిస్తారు. అవార్డు రావడం ఇంకా పెద్ద గౌరవం. ఈ సంవత్సరం ఉటాలో జనవరి 18–28 తేదీల మధ్య జరిగిన ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మన దేశం నుంచి 'వరల్డ్ డాక్యుమెంటరీ కాంపిటీషన్'లో 'నాక్టర్న్స్'లో చోటు సంపాదించడమే కాకుండా 'స్పెషల్ జ్యూరీ అవార్డ్ ఫర్ క్రాఫ్ట్' అవార్డు పొందింది. అనిర్ బన్‌దత్తాతో కలిసి అనుపమా శ్రీనివాసన్ దర్శకత్వం వహించిన ఈ డాక్యుమెంటరీ రెక్కల పురుగుల లోకంలో ప్రేక్షకులను విహరింపచేస్తుంది.

ఢిల్లీ కృత్రిమత్వం నుంచి

'నేను, అనిర్ బన్ దత్త ఢిల్లీలో జీవిస్తుంటాము. రోజూ ఒకే రకమైన ట్రాఫిక్, పొల్యూషన్. ప్రకృతితో మాకు ఏమీ సంబంధం లేదనిపించేది. ఆ సమయంలో మాకు మాన్సీ అనే పర్యావరణ శాస్త్రవేత్త పరిచయం అయ్యింది. హిమాలయాలలో 'మాత్స్' (రెక్కల పురుగులు) మీద పరిశోధన చేస్తున్నానని చెప్పింది. వాతావరణ మార్పుల వల్ల వీటికి కలుగుతున్న నష్టం ఏమిటో ఆమె తెలుసుకుంటోంది. ఇది డాక్యుమెంటరీ చేయాల్సిన విషయం అనుకున్నాం. గత కొన్నేళ్లుగా నేను, అనిర్‌బన్ డాక్యుమెంటరీలు తీస్తున్నాం. మెయిన్‌స్ట్రీమ్ పట్టించుకోని విషయాలను మేం పట్టించుకుంటాం. దీనికి ముందు మేము ఇండో–మయన్మార్ సరిహద్దులోని తోరా అనే పల్లెకు (మణిపూర్‌లో ఉంది) కరెంటు రావడం గురించి డాక్యుమెంటరీ తీశాం. దాని పేరు 'ఫ్లికరింగ్ లైట్స్'. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా కరెంటు లేని పల్లె ఉండటం, దానికి కరెంటు కోసం కొందరు ఎదురు చూడటం, దేశంలోనే ఉన్నా పరాయీకరణ భావన ఎదుర్కొనడం దీనిలో చూపించాం. ఈ డాక్యుమెంటరీకి ఆమ్‌స్టర్‌డ్యామ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అవార్డు దక్కింది. ఇప్పుడు మాత్స్ గురించి తీసిన 'నాక్టర్న్స్'కు కూడా సండాన్స్ ఫెస్టివల్‌లో అవార్డ్ వచ్చింది. ఇందుకు మాకు చాలా సంతోషంగా ఉంది' అని తెలిపింది అనుపమా శ్రీనివాసన్.

కష్టనష్టాలకు ఓర్చి

'నాక్టర్న్స్ డాక్యుమెంటరీలో రెండే పాత్రలుంటాయి. ఒకటి పర్యావరణ శాస్త్రవేత్త మాన్సీ, రెండు హిమాలయాల స్థానిక బగున్ తెగకు చెందిన బికి అనే గిరిజనుడు. అతని సాయంతో ఆమె రెక్కల పురుగులను అన్వేషణ చేస్తుంటే మేం రికార్డు చేస్తూ వెళ్లాం. సాయంత్రం అయ్యాక మాన్సీ పలచటి తెర కట్టి దాని వెనుక నీలం రంగు బల్బు వెలిగించేది. ఆ తర్వాత కాసేపటికే వేలాది రెక్కల పురుగులు వచ్చి ఆ స్క్రీన్ మీద వాలేవి. వాటి రంగులు, రూపాలు, ఆకారాలు అన్నీ అద్భుతం. అవి తాము మనిషితో కలిసి జీవిస్తున్నామన్నట్టు ఉన్నాయి. మనమే వాటితో కలిసి జీవిస్తున్నాం అన్న ఎరుకలో లేము' అంటుంది అనుపమా శ్రీనివాసన్. 'హిమాలయాల్లో షూటింగ్... అదీ అడవుల్లో అంటే చాలా శ్రమ. అక్కడంతా తేమగా ఉంటుంది. ఏ క్షణమైనా వాన పడొచ్చు. అంతేగాక రాత్రి వేళల్లో విపరీతమైన చలి. జలగలు పట్టి పీక్కుతినాలని చూసేవి. కాని ఇన్ని సమస్యల మధ్య ఆ రెక్కల పురుగుల జీవనం, వాటి కదలికలు ఎంతో ఆసక్తి కలిగించేవి. మా డాక్యుమెంటరీకి అవార్డు రావడానికి కారణం మేము ప్రకృతి ధ్వనులను పరిపూర్ణంగా రికార్డు చేశాం. ఆ ధ్వనుల వల్ల అడవిలో ఉంటూ మాత్స్‌ను చూస్తున్న అనుభూతి కలుగుతుంది' అంది అనుపమా శ్రీనివాసన్.





జాన్వీ కపూర్



సారా అలీఖాన్

యూత్ పల్స్

అసతోమా సద్గమయ ఆధ్యాత్మిక ప్రయాణం ఆనందమయా

యువతకు ప్రయాణం కొత్త కాదు. ఆనందం కొత్త కాదు. అయితే గత కొంతకాలంగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించింది యువతరం. ఇది గత ప్రయాణాల కంటే భిన్నమైనది. ఇది ఆధ్యాత్మిక ప్రయాణం మాత్రమే కాదు, తమలోకి తాము చేసే అంతర్ ప్రయాణం. ఆనందం, ఆధ్యాత్మికం ఏకమైన అద్భుత ప్రయాణం.

ట్రావెల్ ఏజెన్సీ 'స్కైస్కానర్స్' రిపోర్ట్ ప్రకారం ప్రతి ఇద్దరు భారతీయులలో ఒకరు స్పిరిచ్యువల్ హాలిడేస్ కోసం ప్లాన్ చేసుకుంటున్నారు. వారిలో యువతరమే ఎక్కువ. 'మా ట్రావెల్ ట్రెండ్స్ రిపోర్ట్ 2024 ప్రకారం 18 నుండి 24 సంవత్సరాల మధ్య వయసు గల వారిలో 52 శాతం, 25 నుండి 34 సంవత్సరాల మధ్య వయసుగల వారిలో 59 శాతం ఆధ్యాత్మిక ప్రయాణాలను ప్లాన్ చేసుకుంటున్నారు' అంటున్నాడు ట్రావెల్ అండ్ డెస్టినేషన్ నిపుణుడు మోహిత్ జోషి.

'చిన్నప్పుడు ఆధ్యాత్మిక యాత్రలు ఇష్టపడేవాడిని కాదు. ఇప్పుడు మాత్రం నేనే కాదు నా స్నేహితులు కూడా ఆధ్యాత్మిక యాత్రలకు ప్రాధాన్యత ఇస్తున్నారు' అంటున్నాడు చేతన్‌శర్మ. ఇండోర్‌కు చెందిన 29 సంవత్సరాల చేతన్ శర్మ ఎంటర్‌ప్రెన్యూర్. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆధ్యాత్మిక యాత్ర ప్లాన్ చేస్తుంటాడు.

దిల్లీ నుంచి జైపూర్ వరకు



మన దేశంలోని సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైవిధ్యాన్ని ఆస్వాదించడానికి ప్రయాణాలను ఒక మార్గంగా ఎంచుకుంది బాలీవుడ్ యువ నటి సారాఅలీఖాన్. అజ్మీర్ దర్గా నుంచి కేదార్‌నాథ్ వరకు ఎన్నో ఆధ్యాత్మిక ప్రయాణాలు చేసింది. 2016లో దిల్లీ నుంచి జైపూర్ వరకు స్నేహితురాలితో కలిసి చేసిన కారు యాత్ర అద్భుత అనుభవాన్ని మిగిల్చింది. దేవాలయం, మసీదు, చర్చి, గురుద్వారాలను సందర్శిస్తూ ప్రశాంతతని సొంతం చేసుకున్నారు.

'తెల్లారిలేస్తే పరుగు అన్నట్లుగా తయారైంది జీవితం. పనిభారం, టిక్నాలజీతో విరామం అంటూ లేకుండా పోయింది. మనసుకు ప్రశాంతత దూరమైంది' అంటున్న చేతన్ శర్మ కొన్ని నెలల క్రితం కేదార్‌నాథ్ వెళ్లాడు.

'అక్కడికి వెళితే ప్రకృతి అందాల పరవశమే కాదు సానుకూల శక్తి మనకు చేరుతుంది' కేదార్‌నాథ్ గురించి అంటాడు శర్మ.

'గత రెండేళ్లలో మిలీనియల్స్, జెన్‌జెడ్‌లో మార్పు వచ్చింది. కోవిడ్ మహమ్మారి తరువాత ఆరోగ్యం, ఆధ్యాత్మికతపై దృష్టి సారించారు' అంటున్నాడు 'ఎస్‌వోటీసీ ట్రావెల్' ప్రెసిడెంట్ అండ్ కంట్రీ హెడ్ డేనియల్ డిసౌజా.

సారా అలీఖాన్, జాన్వీకపూర్ లాంటి యంగ్ సెలబ్రిటీలు కేదార్‌నాథ్, తిరుపతి, ఉజ్జయినిలాంటి ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లడం స్పిరిచ్యువల్ టూరిజంపై యంగర్ జెనరేషన్‌లో ఆసక్తిని పెంచుతుంది. సారా మొదటి సినిమా కేదార్‌నాథ్ సబ్జెక్ట్‌తో రూపొందించారు. తాను సందర్శించిన ఆధ్యాత్మిక క్షేత్రాలకు సంబంధించి సారా రెగ్యులర్‌గా స్టోరీలు, వ్లోగ్స్ షేర్ చేస్తుంటుంది.

'స్పిరిచ్యువల్ డెస్టినేషన్స్ కోసం వెదకడం అనేది ఇటీవల యువతరంలో బాగా పెరిగింది' అంటున్నాడు 'మేక్ మై ట్రిప్' చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ రాజ్ రిషిసింగ్.

పూరీ జగన్నాథ్ హెరిటేజ్ కారిడార్ నుంచి కాశీ–విశ్వనాథ్ కారిడార్ వరకు యూత్–ఫ్రెండ్లీ అకామడేషన్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ట్రావెల్ ఏజెన్సీలు కొత్త ఆఫర్‌లతో ముందుకు వస్తున్నాయి. ఉదాహరణకు థామస్ కుక్ ఇండియా 'స్పిరిచ్యువల్ ప్లస్' టూర్ ప్యాకేజీని ప్రారంభించింది. రిషికేశ్‌లో డజన్ల కొద్దీ హాస్టల్స్ ఉన్నాయి. ఈ హాస్టల్స్ ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉన్న ప్రదేశాలకు స్కూటర్‌లను అద్దెకు ఇవ్వడమే కాకుండా లైవ్ స్పిరిచువల్ మ్యూజిక్ సెషన్‌లు నిర్వహిస్తున్నాయి. సాధువులతో సంభాషించే అవకాశాన్ని కల్పించే 'డెత్ అండ్ రీబర్త్ వాక్' లాంటివి కూడా ట్రావెల్ ఏజెన్సీల ప్యాకేజీలో భాగం అవుతున్నాయి.

'యంగ్ టూరిస్ట్‌లతో ప్రయాణ స్వభావం మారుతోంది. ఆనందం, ఆధ్యాత్మికతను యువతరం మిళితం చేస్తోంది' అంటున్నాడు 'ఎస్‌వోటీసీ ట్రావెల్' ప్రెసిడెంట్ డిసౌజా.

ట్రావెల్ కంపెనీలు యువ పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని వారితో సులభంగా కలిసిపోయే గైడ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. 'యువతను దృష్టిలో పెట్టుకొని వివిధ బడ్జెట్‌లలో వీఐపీ దర్శనాలు, హెలికాప్టర్ సర్వీసులాంటి ప్రత్యేక సర్వీసులు ప్రవేశపెట్టాం. 2019తో పోల్చితే జెన్ జెడ్, మిలీనియల్స్‌లో ఆధ్యాత్మిక ప్రయాణ ఆసక్తి పెరిగింది. స్పష్టమైన మార్పు కనిపిస్తోంది' అంటున్నాడు 'థామస్ కుక్' కంట్రీ హెడ్ రాజీవ్ కాలే.

కొండంత అండ



యువనటుల ఆధ్యాత్మిక యాత్రల నుంచి యువతలో ఎంతోమంది స్ఫూర్తి పొందుతున్నారు. ఉజ్జాయినిలోని మహాకాలేశ్వర్ ఆలయం, తిరుమల... జాన్వీకపూర్ స్పిరిచ్యువల్ ట్రిప్‌కు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కామెంట్ సెక్షన్‌లో కనిపించే యువత అభిప్రాయాలు ఆధ్యాత్మిక ప్రయాణాల పట్ల వారి ఆసక్తికి అద్దం పడతాయి.

స్ఫూర్తి

వెన్ను విరిగినా వెన్నుదన్నుగా...

'సోల్ ఫ్రీ' ప్రీతి స్ఫూర్తిదాయక జర్నీ

క్రికెటర్‌గా తమిళనాడు రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఉండే ప్రీతి శ్రీనివాసన్‌కు 18 ఏళ్ల వయసులో వెన్నుకు పక్షవాతం వచ్చి, వీల్ చెయిర్‌కే పరిమితం అయ్యింది. తనను తాను మెరుగుపరుచుకుంటూ సోల్‌ఫ్రీ ఫౌండేషన్ ద్వారా స్పైనల్‌కార్డ్ సమస్యలతో బాధపడే 2,500 మందికి వెన్నుదన్నుగా నిలిచింది. సోషియాలజీలో పీహెచ్‌డీ చేస్తూ, సైకాలజీలో రాణిస్తూ తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటోంది. జీవితంలో ఏదైనా కారణం చేత పడిపోయినప్పుడు తిరిగి నిలబడే శక్తిని పెంచుకోవాలనే స్ఫూర్తిని నింపుతుంది ప్రీతి జీవనం.





ప్రీతీ శ్రీనివాసన్

''అథ్లెట్‌గా నాది అద్భుతమైన జీవితం. చెన్నైలో పుట్టి మూడు ఖండాల్లో పెరిగిన నేను జాతీయ స్థాయి స్విమ్మర్ స్థాయికి చేరుకున్నాను. మూడేళ్ల వయసు నుంచే స్విమ్మింగ్ ప్రారంభించాను. నాలుగేళ్ల వయసులో క్రికెట్ ఆడటం స్టార్ట్ చేశాను. ఎనిమిదేళ్ల వయసులో తమిళనాడు అండర్ –19 జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాను. చదువులోనూ ముందంజలో ఉండేదాన్ని. ప్రతిదీ విజయాల బాటగా జీవితం వెళ్లిపోతుంది. వైఫల్యం నీడ కూడా నా జీవితాన్ని తాకలేదు అనుకున్నాను. కానీ, 18 ఏళ్లు వచ్చేసరికి రెప్పపాటులో అంతా మారిపోయింది.

బీచ్‌లో జరిగిన ప్రమాదం..

పుదుచ్చేరి బీచ్‌లో స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేస్తున్న సమయంలో నీటిలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా కిందపడిపోయాను. వెన్నెముకకు గాయం కావడంతో మెడ కింది భాగం అంతా కదలిక కోల్పోయింది. అమ్మానాన్నల ప్రేమ, వారి సపోర్ట్‌తో నన్ను నేను మరో మార్గంలో వెతుక్కోవడం మొదలుపెట్టాను.

వందలాది మందికి రెక్కలు

వెన్నుపాము సమస్యలు ఉన్నవారికి పూర్తి చికిత్స, పునరావాసం, వైద్య సంరక్షణ, విద్య, కౌన్సెలింగ్, ఉపాధి అవకాశాలను అందించడానికి 'సోల్‌ఫ్రీ' పేరుతో స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాను. ఈ సంస్థ తిరువణ్ణామలైలో 20 వేల అడుగుల చదరపు అడుగుల విస్తీర్ణంలో తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న 200 మందికి గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి కావల్సిన వసతి సదుపాయాలను అందిస్తోంది. సోల్ ఫ్రీలో ఇప్పటి వరకు 2,500 మంది ఆశ్రయం పొందారు.

అడుగడుగునా అవరోధాలే..

ఇప్పుడు నా వయసు 42. కానీ, పద్దెనిమిదేళ్ల వయసులో జరిగిన సంఘటనతో నా గుండె ఆగిపోయినట్టు అనిపించింది. అప్పటి వరకు ఉన్న నా విశేషమైన ఉనికి ఒక్కసారిగా పాతాళానికి పడిపోయినట్టుగా అనిపించింది. అమెరికాలో చదువుకుంటున్న టాప్ స్టూడెంట్స్‌లో నేనూ ఒకదాన్ని. పెద్ద పెద్ద క్రీడాకారులతో కలిసి క్రికెట్ ఆడాను. ఫిట్‌గా, అందంగా ఉండేదాన్ని. వేగంగా బంతిని విసిరే సామర్థ్యం ఉన్న నేను చిటికెన వేలును కూడా కదపలేని స్థితికి చేరుకున్నాను. అన్ని విధాలుగా అసాధారణ ప్రతిభ ప్రదర్శించిన నేను అకస్మాత్తుగా నాకు నేను ఆహారం తీసుకోలేని... స్నానం చేయలేని... మంచం నుండి లేవలేని స్థితికి వెళ్లిపోయాను. అమ్మానాన్నలు నన్ను చూసుకోవడానికి వాళ్ల ఉద్యోగాల్ని విడిచిపెట్టారు. వైద్యం కోసం పెద్ద పెద్ద ఆసుపత్రులకు తీసుకెళ్లారు. కాస్త కోలుకున్న తర్వాత బీఏస్సీ సైకాలజీలో చేరడానికి వెళితే, ఇప్పుడు నీకు ఈ చదువు అవసరమా అన్నట్టు ప్రవర్తించిన అక్కడి యాజమాన్య తీరు నన్ను కన్నీరు పెట్టించింది. కానీ, నాన్న నన్ను ప్రోత్సహించారు. ఇంటి దగ్గరే ఉండి డిగ్రీ చదువుకునేలా స్ఫూర్తి నింపారు. ఫిక్షన్ స్టోరీస్, డిగ్రీ బుక్స్ మాత్రమే కాదు ఆధ్యాత్మిక పుస్తకాల వరకు అన్నీ చదివి వినిపించేవారు. నా నొప్పిని అధిగమించడానికి నాన్న నాకు ఎంతో సహాయపడ్డారు. కానీ, నాన్న గుండెపోటుతో మరణించడం ద్వారా విధి నన్ను మరోసారి బలంగా దెబ్బతీసింది. నాలుగు రోజుల తేడాతో అమ్మకూ గుండెపోటు వచ్చి, బైపాస్ సర్జరీ చేయాల్సి వచ్చింది. నా ప్రపంచం మళ్లీ శూన్యం అయ్యింది. 80 ఏళ్ల అమ్మమ్మ నన్ను చూసుకునేది. కానీ, ఆమె అమ్మ కోసం చెన్నై వెళ్ళాల్సి వచ్చింది. నాకు తినిపించడం, కూర్చోబెట్టడం ఎవరు చేస్తారో తెలియదు. డబ్బు సంపాదించడం ప్రారంభించాల్సి వచ్చింది. జీవితం మళ్లీ కష్టంగా అనిపించింది. అమ్మ, అమ్మమ్మల ఆరోగ్యం సమస్యాత్మకంగానే ఉండేది. ఈ సమయంలో మా ఫ్రెండ్స్ చదువును కంటిన్యూ చేయమన్నారు. బిఎస్సీ సోషియాలజీ తర్వాత సైకాలజీలో ఎంఎస్సీ కూడా పూర్తిచేశాను.



సంరక్షణకు స్థలం

ఈ దేశంలో దివ్యాంగులకు గౌరవంగా జీవించగలిగిన స్థలం ఎక్కడుంది అంటూ చాలా శోధించాను. కానీ, ఎక్కడా అలాంటి పునరావాస కేంద్రాలు, స్థలాలు లేవని తెలిసింది. దీంతో తీవ్ర వైకల్యాలున్న వ్యక్తులకు గౌరవ ప్రదమైన జీవితాన్ని అందించేందుకు ఓ స్వర్గధామాన్ని నేనే ప్రారంభించాలనుకున్నాను. లాభాపేక్ష లేని సంస్థను నడపడం లేదా ఎవరినుంచైనా ఫండింగ్ తీసుకోవడం అనే ఆలోచన కూడా చేయలేదు. దివ్యాంగుల కోసం ఏదైనా చేయాలని గట్టిగా అనుకున్నాను. సోల్ ఫ్రీ పేరుతో సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించాను. ఇక్కడ వారు తమకు ఇష్టమైన వ్యాపకాల్లో ఆర్నెల్లపాటు శిక్షణనూ పొందుతారు. దీనిని రీ–ఇంజనీరింగ్ అని పిలుస్తున్నాం. మేమందరమూ జీవించాలనే సంకల్పంతో ఈ కేంద్రాన్ని పునరుద్ధరించాను. ఇక్కడ శిక్షణ తీసుకున్నవారు వాళ్ల ఇంటికి వెళ్లి డబ్బు సంపాదించాలన్నది లక్ష్యం. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సంరక్షణను ఉచితంగా అందిస్తున్నాం. మాకు ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, హైడ్రోథెరపీ, స్పోర్ట్స్, కౌన్సెలింగ్ సెషన్‌లు, ట్రైనింగ్ సెషన్లు, టైలరింగ్, కంప్యూటర్ క్లాసులు.. ఉన్నాయి. ఇది నా అనుభవపూర్వకమైన ఫ్రేమ్ వర్క్ నుండి పుట్టిన సంపూర్ణ వ్యవస్థ. ఇక్కడ వెన్నెముకకు అయ్యే గాయాలపై అవగాహన కల్పిస్తాం. మంచాన పడి ఉన్నప్పుడు నా జీవితాన్నీ ముగించుకోవాలనుకున్నాను. కానీ, ఇప్పుడు ప్రభుత్వంతో కలిసి దివ్యాంగుల పునరావాసం కోసం కృషి చేస్తున్నాను. వికలాంగుల సంక్షేమ సలహా మండలి సభ్యురాలిగా ఉన్నాను. నాలాంటివారిపై జాలిపడే బదులు సవాల్‌తో అవకాశాలను ఉపయోగించుకోవాని అర్థం చేసుకున్నాను. ప్రత్యేక సామర్థ్యాలు ఉన్నప్పుడు ప్రత్యేక సవాళ్లే వస్తాయి. ప్రతిదాంట్లో విజయం సాధించడం పెద్ద విషయం కాదు. వచ్చిన సవాళ్లను అధిగమించడమే గొప్ప. ప్రపంచం నా ముందున్న తలుపులన్నీ మూసివేసింది. కానీ, కొత్త ప్రపంచాన్ని సృష్టించాలనుకున్నాను. సృష్టించాను. ఇప్పుడు పీహెచ్‌డీ చేస్తూ దివ్యాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తూ నన్ను నేను కొత్తగా చూసుకుంటున్నాను' అని వివరిస్తుంది ప్రీతి శ్రీనివాసన్.

బ్యూటిప్స్

చర్మకాంతికి మేలైనవి..

* కొబ్బరి నూనె.. బ్రౌన్ షుగర్

పొడిబారిన, నిస్తేజంగా ఉన్న చర్మానికి కొబ్బరి నూనె ఔషధంలా పనిచేస్తుంది. రాత్రి పడుకునే ముందు



గోరువెచ్చని కొబ్బరి నూనెను ముఖానికి, మెడకు రాసి, వేళ్లతో వలయాకారంలో మసాజ్ చేయాలి. మరుసటి రోజు ఉదయం ముఖాన్ని శుభ్రపరుచుకోవాలి. వారానికి రెండుసార్లు నూనెలో కొద్దిగా బ్రౌన్ షుగర్ వేసి, కలిపి, ముఖానికి అప్లై చేయాలి. దీని వల్ల నిస్తేజంగా ఉన్న చర్మం కాంతిమంతం అవుతుంది.



* అలోవెరా

చర్మకాంతికి మహత్తరంగా పనిచేసే జాబితాలో మొదటి వరసలో ఉంటుంది అలోవెరా. ముడతల నివారణకు పనిచేస్తుంది. అలొవెరా ఆకునుంచి తీసిన జెల్‌ను ముఖానికి, మేనికి పట్టించి 20 నిమిషాల తర్వాత వేడినీటితో కడిగితే పొడిబారే సమస్య దరిచేరదు.



* పాలు

నిస్తేజంగా ఉన్న చర్మానికి పాలు మెరుపును తీసుకువస్తాయి. దూదిని పాలలో ముంచి, ముఖానికి, మెడకు రాసి, ఆరిన తర్వాత కడిగేయాలి. పాలు, తేనె, శనగపిండి కలిపి ముఖానికి ప్యాక్ వేసుకొని 20 నిమిషాలు తర్వాత శుభ్రపరుచుకుంటే చర్మకాంతి మెరుగవుతుంది.



* తేనె

తేనెలో ఔషధ గుణాలు ఎక్కువ. పొడి చర్మ సమస్యకు నివారిణిగా పనిచేస్తుంది. వేళ్లతో తేనెను అద్దుకొని, ముఖానికి రాసుకొని, మృదువుగా మసాజ్ చేసి ఐదు నిమిషాలు వదిలేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి.

* బొప్పాయి

మృతకణాలను తొలగించడంలో బొప్పాయి ఎంతగానో సహాయపడుతుంది.



బొప్పాయి పండు చిన్న ముక్కను గుజ్జు చేయాలి. దీంతో తేనె వేసి కలిపి, ముఖానికి అప్లై చేయాలి. ఇరవై నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి.

* నీళ్లు

ప్రతి రోజూ 8–10 గ్లాసుల నీళ్లు తాగుతుంటే చర్మంలో ఉండే హానికారకాలు తొలగిపోయి చర్మానికి తాజాదనం లభిస్తుంది.





ఏడో ర్యాంక్‌లో ప్రణయ్

ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్ టాప్‌-100లో భారత్ నుంచి ఏకంగా 12 మంది చోటు సంపాదించారు. తాజా ర్యాంకింగ్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ ఒక స్థానం పురోగతి సాధించి ఏడో ర్యాంక్‌కు చేరుకొని భారత నంబర్‌వన్ ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా లక్ష్య సేన్ (20), శ్రీకాంత్ (24), ప్రియాన్షు (28), కిరణ్ జార్జి (36), సతీశ్ కుమార్ (49), మిథున్ మంజునాథ్ (63), శంకర్ ముత్తుస్వామి (70), సమీర్ వర్మ (77), సాయిప్రణీత్ (91), మెరాబా లువాంగ్ మైస్నమ్ (93), చిరాగ్ సేన్ (99) ఉన్నారు.

తెలుగు టైటాన్స్ ఓటమి నంబర్ 15



ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో తెలుగు టైటాన్స్ పేలవ ప్రదర్శన కొనసాగిస్తూ 15వ పరాజయాన్ని చవిచూసింది. మంగళవారం పట్నాలో పుణేరి పల్టన్‌తో జరిగిన పోరులో పవన్ సెహ్రావత్ నాయకత్వంలోని తెలుగు టైటాన్స్ 29-60 తో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో పుణేరి ఆల్‌రౌండ్ దెబ్బకు టైటాన్స్ జట్టు నాలుగుసార్లు ఆలౌటైంది. పల్టన్ తరఫున ఆకాశ్ 11 పాయింట్లతో రాణించాడు. టైటాన్స్ ప్లేయర్ సంజీవి అత్యధికంగా 8 పాయింట్లు సాధించాడు.



దీప్తి ... ఇక డీఎస్పీ

క్రికెటర్‌కు రూ. 3 కోట్ల నజరానా కూడా అందించిన యూపీ ప్రభుత్వం

లక్నో: భారత మహిళల క్రికెట్ జట్టులో కీలక సభ్యురాలు దీప్తి శర్మకు సొంతరాష్ట్రం ఉత్తరప్రదేశ్ నుంచి ఉన్నతోద్యోగంతో పాటు రూ.3 కోట్ల నజరానా లభించింది. ఆగ్రాకు చెందిన 26 ఏళ్ల ఈ ఆల్‌రౌండర్‌ను యోగి ఆదిత్యనాథ్ సర్కారు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా నియమించింది. కొంతకాలంగా ఆమె అంతర్జాతీయ క్రికెట్‌లో నిలకడగా రాణిస్తోంది. గతేడాది బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో రజతం నెగ్గిన భారత జట్టు చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో విజేతగా నిలిచి పసిడి పతకం నెగ్గింది. ఈ రెండు టోర్నీల్లో దీప్తి శర్మ ఆకట్టుకుంది. 2023 డిసెంబర్ నెలకుగాను 'ఐసీసీ మహిళా ప్లేయర్ ఆఫ్ ద మంత్'గా దీప్తి ఎంపికైంది. అట్టహాసంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమెతో పాటు పలువురు ఉత్తరప్రదేశ్ క్రీడాకారులను రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘనంగా సత్కరించారు. యూపీ అథ్లెట్లు పారుల్ చౌధరీకి డీఎస్పీ పదవితో పాటు రూ. 4 కోట్ల 50 లక్షలు... అన్ను రాణి (జావెలిన్ త్రో)కి రూ.3 కోట్లు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. శిక్షణ కోసం విదేశాల్లో ఉండటంతో ఈ కార్యక్రమానికి పారుల్, అన్ను రాణి హాజరుకాలేకపోయారు. పారా అథ్లెట్లు జతిన్ కుష్వాహ, యశ్ కుమార్‌లకు రూ. 5 లక్షల చొప్పున నజరానా అందజేశారు.

214 పరుగుల తేడాతో...

- న్యూజిలాండ్‌పై భారత్ ఘనవిజయం
- అండర్‌-19 ప్రపంచకప్ టోర్నీలో వరుసగా నాలుగో గెలుపు
- ముషీర్ ఖాన్ రెండో సెంచరీ
- సౌమీ పాండేకు నాలుగు వికెట్లు



ముషీర్ ఖాన్

బ్లూమ్‌ఫొంటెన్ (దక్షిణాఫ్రికా): సమష్టి ప్రదర్శనతో అదరగొడుతున్న భారత యువ జట్టు అండర్‌-19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో వరుసగా నాలుగో విజయం నమోదు చేసింది. లీగ్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన టీమిండియా 'సూపర్ సిక్స్' గ్రూప్‌-1తొలి మ్యాచ్‌లోనూ చెలరేగింది. న్యూజిలాండ్‌తో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఉదయ్ సహారణ్ నాయకత్వంలోని భారత జట్టు ఏకంగా 214 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఈ గెలుపుతో భారత్ 'సూపర్ సిక్స్' దశలో ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతూ సెమీఫైనల్‌కు మరింత చేరువైంది. టాస్ గెలిచిన న్యూజిలాండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 295 పరుగులు సాధించింది. ఓపెనర్ ఆదర్శ్ సింగ్ (58 బంతుల్లో 52; 6 ఫోర్లు) ఈ టోర్నీలో రెండో అర్ధసెంచరీ చేయగా... ఇంగ్లండ్‌తో రెండో టెస్టు కోసం ఎంపికైన ముంబై క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ సొంత తమ్ముడైన ముషీర్ ఖాన్ మరోసారి మెరిపించాడు. బాధ్యతాయుత బ్యాటింగ్‌తో ఆకట్టుకున్న ముషీర్ ఖాన్ (126 బంతుల్లో 131; 13 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఈ టోర్నీలో రెండో సెంచరీ నమోదు చేశాడు. ఉదయ్ (34; 2 ఫోర్లు), హైదరాబాద్ క్రికెటర్ అరవెల్లి అవినాష్ రావు (18 బంతుల్లో 17; 2 సిక్స్‌లు), సచిన్ (11 బంతుల్లో 15; 2 ఫోర్లు) కూడా రాణించారు. న్యూజిలాండ్ బౌలర్లలో మేసన్ క్లార్క్ 62 పరుగులిచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 296 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ 28.1 ఓవర్లలో కేవలం 81 పరుగులకే కుప్పకూలి ఓడిపోయింది. కెప్టెన్ ఆస్కార్ జాక్సన్ (19; 2 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. భారత ఎడం చేతి వాటం స్పిన్నర్ సౌమీ పాండే 19 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టగా...రాజ్ లింబాని 2 వికెట్లు, ముషీర్ ఖాన్ 2 వికెట్లు తీశారు. శుక్రవారం జరిగే 'సూపర్ సిక్స్' గ్రూప్‌-1 చివరిదైన రెండో మ్యాచ్‌లో నేపాల్‌తో భారత్ ఆడుతుంది.

మళ్లీ స్పిన్ పిచ్‌కు సిద్ధమే!

ఇంగ్లండ్ హెడ్ కోచ్ మెకల్లమ్ వ్యాఖ్య

విశాఖపట్నం: రెండో టెస్టులోనూ స్పిన్ పిచ్‌పై సమరానికి సిద్ధమని ఇంగ్లండ్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ బ్రెండన్ మెకల్లమ్ అన్నాడు. స్పిన్నర్ టామ్ హార్ట్లీ మాయాజాలంతో హైదరాబాద్ టెస్టులో గెలిచిన ఉత్సాహంతో ఉన్న ఇంగ్లండ్ ఐదు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సిరీస్‌లో మరో పూర్తిస్థాయి స్పిన్ ట్రాక్ ఎదురైనా... తమ దళంలో అందుబాటులో ఉన్న నలుగురు స్పిన్నర్లతో దీటుగా ఎదుర్కొంటామని కోచ్ చెప్పారు. 'ఒకవేళ తొలి టెస్టులాగే వైజాగ్‌లోని పిచ్ కూడా స్పిన్‌కే అనుకూలిస్తే భయపడం. జట్టులోని స్పిన్నర్లు దీన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటారు. షోయబ్ బషీర్ అబుదాబిలో నిరూపించుకున్నాడు. ప్రస్తుతం ఆడే సిరీస్‌లోనూ రాణించే నైపుణ్యం అతనికి ఉంది. తప్పకుండా ఇక్కడ కూడా అతను ప్రభావం చూపుతాడు' అని మెకల్లమ్ అన్నాడు. .



వైజాగ్ ఎయిర్‌పోర్ట్‌లో ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్, టీమిండియా సారథి రోహిత్ శర్మ

వైజాగ్ చేరుకున్న ఇరుజట్లు

భారత్, ఇంగ్లండ్ జట్లు మంగళవారం సాయంత్రం వైజాగ్ చేరుకున్నాయి. నేరుగా హైదరాబాద్ నుంచి విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఇరుజట్ల ఆటగాళ్లు అక్కడి నుంచి బస చేసే హోటల్‌కు వెళ్లిపోయారు. అనంతరం ఆటగాళ్లంతా ప్రయాణ బడలిక దృష్ట్యా పూర్తిగా హోటల్ గదులకే పరిమితమయ్యారు. ఫిబ్రవరి 2 నుంచి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో రెండో టెస్టు జరుగుతుంది.

శ్రమించి నెగ్గిన గాయత్రి-ట్రెసా జోడీ

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్‌-300 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ (భారత్) జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో గాయత్రి-ట్రెసా ద్వయం 74 నిమిషాల్లో 16-21, 21-10, 21-18తో లోక్ లోక్ లుయ్‌-వింగ్ యంగ్ ఎన్జీ (హాంకాంగ్) జంటపై శ్రమించి గెలిచింది. ప్రీక్వార్టర్ ఫైనల్లో భారత్‌కే చెందిన అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టోలతో గాయత్రి-ట్రెసా తలపడతారు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో అశ్విని-తనీషా ద్వయం 21-13, 21-17తో లింగ్ ఫాంగ్ హు-జియావో మిన్ లిన్ (చైనీస్ తైపీ) జంటను ఓడించింది. మరోవైపు భారత ఆటగాళ్లు సమీర్ వర్మ, శంకర్ ముత్తుస్వామి పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు.



భారత్ పరాజయం

మస్కట్: పురుషుల హాకీ 'ఫైవ్‌-ఎ-సైడ్' ప్రపంచ కప్ టోర్నీలో భారత జట్టు పతకం రేసులో నిలువలేకపోయింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు 4-7 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ చేతిలో ఓడిపోయింది. భారత్ తరఫున రహీల్ మొహమ్మద్ (1వ, 7వ, 25వ ని.లో) మూడు గోల్స్ చేయగా... మన్‌దీప్ మోర్ (11వ ని.లో) ఒక గోల్ సాధించాడు. క్వార్టర్ ఫైనల్లో ఓడిన భారత జట్టు 5 నుంచి 8 స్థానాల కోసం వర్గీకరణ మ్యాచ్‌ల్లో భాగంగా కెన్యాతో జరిగిన పోరులో 9-4తో ఘనవిజయం సాధించింది.



ఇస్లామాబాద్‌లో భారత ఆటగాళ్ల ప్రాక్టీస్

2, 3 తేదీల్లో పాకిస్తాన్ జట్టుతో డేవిస్‌కప్ టెన్నిస్ మ్యాచ్

ఇస్లామాబాద్: డేవిస్‌కప్ గ్రూప్‌-1 ప్లేఆఫ్ పోరులో భాగంగా పాకిస్తాన్ జట్టుతో తలపడేందుకు 1964 తర్వాత భారత జట్టు మళ్లీ పాకిస్తాన్‌లో అడుగు పెట్టింది. రామ్‌కుమార్, శశికుమార్ ముకుంద్, యూకీ బాంబ్రీ, శ్రీరామ్ బాలాజీ, దిగ్విజయ్‌లతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేని భారత బృందంలో ఉన్నారు. చివరిసారిగా భారత్, పాక్‌లు 1964లో పాక్ గడ్డపై పోటీపడ్డాయి. 2019లోనూ పాకిస్తాన్‌లో భారత జట్టు పర్యటించాల్సి ఉండగా... ఈ మ్యాచ్‌ను అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) తటస్థ వేదిక కజకిస్తాన్‌కు మార్చింది. ఈ పోరులో భారత్ 4-1తో పాకిస్తాన్‌ను ఓడించింది.



ఈసారి మాత్రం పాకిస్తాన్‌లో భారత జట్టు ఆడాల్సిందేనని, వేదిక మార్చడం వీలుకాదని ఐటీఎఫ్ స్పష్టం చేసింది. భారత జట్టు నాన్ ప్లేయింగ్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ వ్యక్తిగత కారణాలతో పాకిస్తాన్‌కు వెళ్లలేకపోవడంతో జీషాన్ అలీ ద్విపాత్రాభినయం చేయనున్నాడు. కోచ్‌గా వచ్చిన జీషాన్ నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గానూ వ్యవహరిస్తాడు.

20 కిలోమీటర్ల నడకలో అక్ష్‌దీప్ జాతీయ రికార్డు

మరో ముగ్గురు భారత అథ్లెట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత

చండీగఢ్: జాతీయ ఓపెన్ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్ పురుషుల 20 కిలోమీటర్ల విభాగంలో కొత్త జాతీయ రికార్డు నమోదైంది. ఇప్పటికే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన పంజాబ్ అథ్లెట్ అక్ష్‌దీప్ సింగ్ మంగళవారం జరిగిన పోటీల్లో 20 కిలోమీటర్ల దూరాన్ని ఒక గంట 19 నిమిషాల 38 సెకన్లలో నడిచి కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. ఒక గంట 19 నిమిషాల 55 సెకన్లతో తన పేరిట ఉన్న జాతీయ రికార్డును అక్ష్‌దీప్ బద్దలు కొట్టాడు. సూరజ్ పన్వర్ (1గం:19ని.44 సెకన్లు; ఉత్తరాఖండ్) రెండో స్థానంలో, సెర్విన్ సెబాస్టియన్ (1గం:20.03 సెకన్లు; తమిళనాడు) మూడో స్థానంలో, అర్ష్‌ప్రీత్ సింగ్ (1గం:20ని.04 సెకన్లు) నాలుగో స్థానంలో నిలిచారు. ఈ ముగ్గురు కూడా పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ (1గం:20.10 సెకన్లు) సమయాన్ని అధిగమించారు. దాంతో పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన భారత వాకర్ల సంఖ్య ఆరుకు చేరుకుంది. నిబంధనల ప్రకారం ఒలింపిక్స్‌లో రేస్ వాకింగ్‌లో ఒక దేశం నుంచి గరిష్టంగా ముగ్గురికి మాత్రమే పోటీపడే వీలుంది. దాంతో భారత అథ్లెటిక్స్ సమాఖ్య జూన్‌లో ట్రయల్స్ నిర్వహించి ఆరుగురి నుంచి ముగ్గురిని ఎంపిక చేస్తుంది.



సినిమా

ఊహా ప్రపంచానికి ఊ



'కల్కి'లో ప్రభాస్

'జై హనుమాన్' పోస్టర్

చిరంజీవి

అల్లు అర్జున్

'ఊరు పేరు భైరవకోన'లో సందీప్ కిషన్

'కంగువ'లో సూర్య

'గామి'లో విశ్వక్ సేన్

మంచి ఊహలు ఎప్పుడూ బాగుంటాయి. నేరుగా చూడలేని ప్రపంచాలను ఊహించుకున్నప్పుడు ఓ ఆనందం దక్కుతుంది. ఇక కొత్త ప్రపంచాలను సిల్వర్ స్క్రీన్‌పై చూసినప్పుడు కనువిందుగా ఉంటుంది. అలా ఊహా ప్రపంచం నేపథ్యంలోని కథలకు కొందరు స్టార్స్ ఊ అన్నారు. కొత్త ప్రపంచంలోకి ప్రేక్షకులను రా రమ్మంటున్న ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం...

పది సెట్స్‌లో విశ్వంభర

'జగదేకవీరుడు అతిలోక సుందరి' (1990), 'అంజి' (2004) వంటివి చిరంజీవి కెరీర్‌లోని సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్స్. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఈ జానర్‌ను టచ్ చేశారు చిరంజీవి. ఈ కోవలో 'విశ్వంభర' అనే సినిమా చేస్తున్నారు. దర్శకుడిగా తొలి సినిమా 'బింబిసార'ను సోషియో ఫ్యాంటసీ జానర్‌లో తీసిన వశిష్ఠ ఈ సినిమాకు దర్శకుడు. ఈ సినిమా మేజర్ షూటింగ్ అంతా ఓ కల్పిత ప్రాంతంలో జరుగుతుందట. చిత్రీకరణకు తగ్గట్లుగా పదికి పైగా సెట్స్ తయారు చేయిస్తున్నారట. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ మొదలైంది. ఫిబ్రవరిలో ఈ సినిమా సెట్స్‌లో జాయిన్ అవుతారట చిరంజీవి. ఈ చిత్రంలో హనుమంతుని భక్తుడు దొరబాబు పాత్రలో చిరంజీవి కనిపిస్తారని, త్రిష హీరోయిన్‌గా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఓ చైల్డ్ ఎపిసోడ్ కూడా ఉంటుందట. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రం 2025 సంక్రాంతికి విడుదల కానుంది. జనవరి 10న ఈ చిత్రం రిలీజ్ డేట్ అనే టాక్ ప్రచారంలోకి వచ్చింది.

కల్కి లోకం

భారతీయ ఇతిహాసాల ఆధారంగా సైంటిఫిక్ అంశాల మేళవింపుతో రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్ అండ్ ఫ్యూచరిస్టిక్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. ఈ సినిమా కథలో ఇతిహాసాల ప్రస్తావన ఉన్నట్లుగా వార్తలు వస్తున్నాయి కాబట్టి ఫ్యాంటసీ ఎలిమెంట్స్ ఉంటాయని ఊహించవచ్చు. ఓ నాలుగు వందల సంవత్సరాల తర్వాత ఇండియా ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూపిస్తాం అన్నట్లుగా ఈ చిత్రదర్శకుడు నాగ్ అశ్విన్ ఇటీవల సందర్భంలో పేర్కొన్నారు. ప్రభాస్ హీరోగా దీపికా పదుకోన్ హీరోయిన్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీ రోల్స్‌లో కనిపిస్తారు. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 9న రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సంగతి ఇలా ఉంచితే... 'సలార్' తర్వాత హీరో ప్రభాస్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'రావణం' అనే మైథలాజికల్ ఫిల్మ్ రానుందని, ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మిస్తారనే వార్తలు గతంలో వచ్చిన సంగతి తెలిసిందే. ఇది కూడా ఊహాజనిత ప్రపంచంలో జరిగే చిత్రం అని టాక్.

ట్రాక్ మారింది

'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల.. వైకుంఠపురములో'... హీరో అల్లు అర్జున్‌- దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు ఇవి. కమర్షియల్ అంశాలతో రూపొందిన ఈ సినిమాలు మంచి విజయాలు సాధించాయి. ఈ మూడు సినిమాల తర్వాత అల్లు అర్జున్‌-త్రివిక్రమ్ కాంబినేషన్‌లో నాలుగో సినిమా గురించిన ప్రకటన వెల్లడైంది. కానీ ట్రాక్ మారింది. రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌లో ఈ చిత్రం ఉండదట. ఇది పూర్తి స్థాయి సోషియో ఫ్యాంటసీ ఫిల్మ్ అని, మహాభారతం రిఫరెన్స్ ఈ సినిమాలో ఉంటుందనే టాక్ తెరపైకి వచ్చింది. అల్లు అరవింద్, సూర్యదేవర రాధాకృష్ణ ఈ సినిమాను నిర్మించనున్నారు. కాగా ఈ సినిమా ప్రారంభం కావడానికి కాస్త సమయం పట్టేలా ఉందని తెలిసింది.

కంగువ ప్రపంచం

'కంగువ' టీజర్ చూస్తున్నప్పుడు ఏదో కొత్త ప్రపంచంలోకి వెళ్తున్నట్లుగా ప్రేక్షకులకు అనిపిస్తుంటుంది. సూర్య హీరోగా నటించిన చిత్రం ఇది. పూర్తి స్థాయి ఫ్యాంటసీ ఫిల్మ్ కాకపోయినప్పటికీ 'కంగువ'లో ఆడియన్స్ ఆశ్చర్యపోయే, అబ్బురపరచే విజువల్స్ చాలానే ఉన్నాయన్నది కోలీవుడ్ టాక్. కథ రీత్యా కాస్త సైంటిఫిక్ టచ్ ఉన్న ఈ సినిమాలో సూర్య పదికి పైగా గెటప్స్‌లో కనిపిస్తారని సమాచారం. దిశా పటానీ, బాబీ డియోల్, యోగిబాబు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు శివ దర్శకుడు. కేఈ జ్ఞానవేల్ రాజాతో కలిసి ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ నిర్మించింది. రెండు భాగాలుగా ఈ సినిమా విడుదల కానుందట. తొలి భాగం ఈ ఏడాదిలోనే రిలీజ్ కానుంది.

కేరాఫ్ భైరవకోన

గరుడ పురాణంలో మిస్ అయిన ఓ నాలుగు పేజీల కథే 'భైరవకోన' అట. మరి.. ఈ గరుడ పురాణం పూర్తి వివరాలు, ఈ నాలుగు పేజీల మిస్టరీ ఏంటో తెలుసుకోవాలంటే ఫిబ్రవరి 16న థియేటర్స్‌లో విడుదలయ్యే 'ఊరు పేరు భైరవకోన' సినిమా చూడాలి. సందీప్ కిషన్ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన సోషియో ఫ్యాంటసీ అడ్వెంచరస్ ఫిల్మ్ ఇది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించిన ఈ చిత్రంలో వర్షా బొల్లమ్మ, కావ్యా థాపర్ హీరోయిన్లుగా నటించారు.



అఖిల్

అఖిల్ నెక్ట్స్ సినిమా గురించిన ఓ వార్త అక్కినేని ఫ్యాన్స్‌లో ఆసక్తిని కలిగిస్తోంది. అఖిల్ హీరోగా యూవీ క్రియేషన్స్, హోంబలే ఫిలింస్ కలిసి ఓ సోషియో ఫ్యాంటసీ సినిమాను నిర్మించనున్నాయట. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని తెలిసింది. ఈ సినిమాతో అనిల్ అనే కొత్త దర్శకుడు పరిచయం అవుతారని భోగట్టా. ఈ మూవీపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.

అఘోరా శంకర్

యంగ్ హీరోల్లో ఒకరైన విశ్వక్ సేన్ చేస్తున్న తాజా చిత్రాల్లో 'గామి' ఒకటి. ఇందులో శంకర్ అనే అఘోరా పాత్రలో విశ్వక్ కనిపిస్తారు. కథ రీత్యా శంకర్‌కు మానవ స్పర్శ తెలియదు. కానీ ఆ స్పర్శను అనుభూతి చెందాలన్నది అతని ఆకాంక్ష. ఈ క్రమంలో ఏం జరుగుతుంది? అనేదే 'గామి' కథ అట. ఈ సినిమాలో అఘోరా ట్రాక్ మాత్రమే కాకుండా మరో స్టోరీ ట్రాక్ కూడా ఉందని చిత్ర యూనిట్ చెబుతోంది. భారీ స్థాయిలో వీఎఫ్‌ఎక్స్ వర్క్స్ జరుగుతున్న ఈ చిత్రాన్ని దాదాపు నాలుగు సంవత్సరాలుగా తీస్తున్నారు. ఈ సినిమాలో ఫ్యాంటసీ ఎలిమెంట్స్ ఉంటాయని ఊహించవచ్చు. విద్యాధర కాగిత దర్శకత్వంలో కార్తీక్ శబరీష్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

జై హనుమాన్

ఈ సంక్రాంతికి 'హను-మాన్' సూపర్ హిట్. అంజనాద్రి అనే ఊహాజనిత ప్రాంతం నేపథ్యంలో ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో తేజ సజ్జా హీరో. కె. నిరంజన్‌రెడ్డి నిర్మించారు. కాగా 'హను-మాన్' సినిమాకు సీక్వెల్‌గా 'జై హనుమాన్' తీస్తున్నారు ప్రశాంత్ వర్మ. స్క్రిప్ట్ వర్క్ మొదలైంది. 'జై హను-మాన్' సినిమాలో ఫ్యాంటసీ ఎలిమెంట్స్ ఉండేట్లు కనిపిస్తున్నాయి. ఈ సినిమాలో నటించే నటీనటులపై త్వరలోనే అధికారిక ప్రకటన రానుంది.

ఇలా ఫ్యాంటసీ బ్యాక్‌డ్రాప్‌లో మరికొన్ని సినిమాలు రానున్నాయి.



తమన్నా

మరోసారి గ్రీన్ సిగ్నల్

ఓ వైపు సినిమాలు, మరోవైపు వెబ్ సిరీస్‌లతో ఫుల్ జోష్‌లో ఉన్నారు హీరోయిన్ తమన్నా. 'లెవంత్ హవర్, నవంబర్ స్టోరీ, జీ కర్దా, ఆఖ్రీ సచ్' వంటి పలు వెబ్ సిరీస్‌లలో నటించిన ఆమె తాజాగా మరో వెబ్ సిరీస్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'డాక్టర్ అరోరా' ఫేమ్ అర్పిత్ కుమార్ దర్శకత్వం వహించనున్న ఓ వెబ్ సిరీస్‌లో నటించేందుకు తమన్నా ఒప్పుకున్నారు. ఈ సిరీస్ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. ఇందులో ఇద్దరు మహిళలు లీడ్ రోల్స్‌లో కనిపిస్తారట. ఒక పాత్రకి తమన్నాని ఎంపిక చేసిన యూనిట్ రెండో లీడ్ కోసం అన్వేషిస్తోంది. ఈ సిరీస్ చిత్రీకరణ మార్చి లేదా ఏప్రిల్‌లో ప్రారంభమవుతుందట. ఇదిలా ఉంటే తమన్నా నటించిన తమిళ చిత్రం 'ఆరణ్మనై 4' పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. హిందీలో 'వేదా', 'స్త్రీ 2' వంటి చిత్రాలు చేస్తున్నారు.



అర్బాజ్ ఖాన్

ఆరేళ్ల తర్వాత...

చిరంజీవి హీరోగా నటించిన 'జై చిరంజీవ' (2005) చిత్రంతో తెలుగు పరిశ్రమకు పరిచయమయ్యారు బాలీవుడ్ నటుడు అర్బాజ్ ఖాన్ (సల్మాన్ ఖాన్ సోదరుడు). ఆ తర్వాత చాలా గ్యాప్‌తో 'కిట్టు ఉన్నాడు జాగ్రత్త' (2017) సినిమాలో నటించిన ఆయన ఆరేళ్లకు ఇప్పుడు తెలుగు సినిమాకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అశ్విన్ బాబు, దిగంగనా సూర్యవన్షీ జంటగా అప్సర్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. మహేశ్వర్ రెడ్డి మూలి నిర్మిస్తున్న ఈ సినిమాలో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు అర్బాజ్ ఖాన్. ఈ సినిమా షూటింగ్‌లో అర్బాజ్ మంగళవారం జాయిన్ అయినట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మూలి మాట్లాడుతూ–''వైవిధ్యమైన కథతో తెరకెక్కుతున్న చిత్రమిది. కొత్త కథ, కథనాలతో రూపొందుతున్న ఈ న్యూ ఏజ్ సినిమాలో అర్బాజ్ గారి పాత్ర అద్భుతంగా ఉంటుంది'' అన్నారు.



సుహాస్

ఆ ప్రేమకు మాటలు రాలేదు

''అంబాజీపేట మ్యారేజి బ్యాండు' సినిమా కోసం రెండేళ్లు కష్టపడ్డాం. ఆ కష్టం ఈ మూవీ సక్సెస్ రూపంలో మంచి ఫలితాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం'' అని హీరో సుహాస్ అన్నారు. దుష్యంత్ కటికినేని దర్శకత్వంలో సుహాస్, శివానీ నాగరం జంటగా నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సుహాస్ విలేకరులతో మాట్లాడుతూ– ''2007లో జరిగే కథే ఈ చిత్రం. మనుషుల మధ్య అహం ఎలాంటి అడ్డుగోడలు సృష్టిస్తుంది? అనేది మెయిన్ పాయింట్. వాస్తవ ఘటనల స్ఫూర్తితో ఈ కథని అద్భుతంగా రాసి, తెరకెక్కించాడు దుష్యంత్. గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌లో సినిమా చేస్తున్నానంటే ముందు మా అమ్మా నాన్న నమ్మలేదు.. పోస్టర్ చూపిస్తే నమ్మారు. అమలాపురంలో షూటింగ్ చేసినప్పుడు అక్కడి వాళ్లు మమ్మల్ని ఎంతో ప్రేమగా చూసుకున్నారు. వాళ్ల ప్రేమతో మాకు మాటలు రాకుండా చేశారు. ఈ సినిమా చూసి, చాలా బాగుందని అల్లు అరవింద్‌గారు ప్రశంసించారు. ఇక హీరోగా కంటే నటుడిగా పేరు తెచ్చుకోవడమే ఇష్టం. 'ప్రసన్న వదనం', 'కేబుల్ రెడ్డి' చిత్రాలతో పాటు 'దిల్' రాజుగారి బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్నాను. 'కలర్‌ఫొటో' దర్శకుడు సందీప్‌తో ఓ సినిమా చేయబోతున్నాను'' అన్నారు.

సాక్షి బిజినెస్

బుధవారం
31-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
802	215
71,140	21,522

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ			
నాస్‌డాక్	15,564	▽	64
డోజోన్స్	38,387	△	54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,666	△	34
డాక్స్	16,972	△	31
షాంఘై	2,831	▽	53
నికాయ్	36,066	△	39

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	62,413	▽	102
బంగారం (99.5 స్వచ్ఛత)	62,161	▽	104
వెండి (కిలో)	70,951	▽	420

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.74	83.76
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.54	107.09
€	యూరో	ఒకటి	89.00	91.36
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.84	57.11
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.07	56.00
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.19	62.63
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.71	23.50
¥	చైనా యువాన్	పదింటికి	10.50	12.49

ఎల్‌అండ్‌టీ లాభం అప్

క్యూ3లో రూ. 2,947 కోట్లు



న్యూఢిల్లీ: మౌలిక సదుపాయాల రంగ దిగ్గజం ఎల్ అండ్‌టీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) మూడో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 15 శాతం వృద్ధితో రూ. 2,947 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 2,553 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 47,145 కోట్ల నుంచి రూ. 55,966 కోట్లకు ఎగసింది. ఈ కాలంలో వార్షిక ప్రాతిపదికన 25 శాతం అధికంగా రూ. 75,990 కోట్ల విలువైన కాంట్రాక్టులను పొందింది.

ఆర్డర్ల రికార్డ్

అనిశ్చిత ప్రపంచ వాతావరణం, సరఫరా చైన్ సవాళ్ల నేపథ్యంలోనూ మరోసారి పటిష్ట ఫలితాలు సాధించగలిగినట్లు ఎల్‌అండ్‌టీ చైర్మన్, ఎండీ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యన్ పేర్కొన్నారు. ఈ ఏడాది తొలి 9 నెలల్లోనే గత పూర్తి ఏడాది(2022–23)కి లభించిన ఆర్డర్ల విలువను అధిగమించినట్లు తెలియజేశారు. విభిన్న విభాగాలలో కార్యకలాపాలు, సామర్థ్యాలు, ఆర్థిక పటిష్టతతోపాటు.. కంపెనీపట్ల కస్టమర్లకు గల విశ్వాసాన్ని ఇవి ప్రతిబింబిస్తున్నట్లు వివరించారు. ఏప్రిల్–డిసెంబర్ కాలంలో కంపెనీ మొత్తం ఆర్డర్ల విలువ 49 శాతం జంప్‌చేసి రూ. 2,30,662 కోట్లను తాకాయి. వీటిలో 60 శాతం(రూ. 1,37,894 కోట్లు) అంతర్జాతీయ కాంట్రాక్టులు కావడం గమనార్హం!

ఫలితాల నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ షేరు బీఎస్‌ఈలో 2 శాతం నీరసించి రూ. 3,633 వద్ద ముగిసింది.

బజాజ్ ఫిన్ లాభం జూమ్

క్యూ3లో రూ. 2,158 కోట్లు



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 22 శాతం జంప్‌చేసి రూ. 2,158 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో రూ. 1,782 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 21,755 కోట్ల నుంచి రూ. 29,038 కోట్లకు ఎగసింది. వడ్డీ ఆదాయం రూ. 10,430 కోట్ల నుంచి రూ. 13,922 కోట్లకు బలపడింది. అనుబంధ సంస్థ బజాజ్ అలయెంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లాభం 33% ఎగసి రూ. 108 కోట్లకు ఎగసింది. బజాజ్ అలయెంజ్ జనరల్ ఇన్సూరెన్స్ లాభం మాత్రం రూ. 281 కోట్లకు స్వల్పంగా మెరుగుపడింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఫిన్‌సర్వ్ షేరు 3 శాతం క్షీణించి రూ. 1,591 వద్ద ముగిసింది.

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ. 1,379 కోట్లు

- క్యూ3లో 11 శాతం అప్
- ఆదాయం రూ. 7,215 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్ (డీఆర్‌ఎల్) నికర లాభం 11 శాతం పెరిగి రూ. 1,379 కోట్లకు చేరింది. గత క్యూ3లో ఇది రూ. 1,247 కోట్లు. ఇక తాజా సమీక్షాకాలంలో ఆదాయం రూ. 6,770 కోట్ల నుంచి సుమారు 7 శాతం వృద్ధి చెంది రూ. 7,215 కోట్లకు ఎగిసింది. ఉత్తర అమెరికాలో ప్రస్తుతమున్న ఔషధాల మార్కెట్ వాటా పెరగడం, యూరప్ మార్కెట్లో వ్యాపార వృద్ధి తదితర అంశాలు ఇందుకు దోహదపడినట్లు కంపెనీ వెల్లడించింది. కొత్త ఉత్పత్తులు కూడా తోడు కావడంతో మూడో త్రైమాసికంలో పటిష్టమైన ఆర్థిక పనితీరు, అత్యధిక అమ్మకాలు సాధించినట్లు సంస్థ సహ చైర్మన్ జీవీ ప్రసాద్ తెలిపారు. సమీక్షాకాలంలో అమెరికాలో మెనో ల్యాబ్స్ బ్రాండెడ్ పోర్ట్‌ఫోలియోను కొనుగోలు చేసినట్లు మంగళవారమిక్కడ విలేకరులతో వర్చువల్ సమావేశంలో కంపెనీ సీఈవో ఎరెజ్ ఇజ్రేలీ వివరించారు. అలాగే కోయా 302 ఔషధ అభివృద్ధి కోసం కోయా థెరప్యూటిక్స్‌తో చేతులు కలిపినట్లు పేర్కొన్నారు. అటు బాచుపల్లి ప్లాంటులో అమెరికా ఎఫ్‌డీఏ తనిఖీలు పూర్తయ్యాయని, ఎఫ్‌డీఏ వ్యక్తపర్చిన అభ్యంతరాలపై వివరణను సమర్పించామని ఇజ్రేలీ వివరించారు.

మరిన్ని విశేషాలు..

- గ్లోబల్ జనరిక్స్ (జీజీ) వ్యాపార ఆదాయం 7 శాతం వృద్ధి చెంది రూ. 6,301 కోట్లకు చేరింది. కొన్ని మార్కెట్లలో ధరలు తగ్గినప్పటికీ కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ, ప్రధాన ఉత్పత్తుల మార్కెట్ వాటా పెరగడం ఇందుకు తోడ్పడ్డాయి. ఫార్మా సర్వీసెస్, యాక్టివ్ ఇంగ్రీడియంట్స్ (పీఎస్ఏఐ) విభాగ ఆదాయం 1 శాతం వృద్ధి చెంది రూ. 780 కోట్లకు చేరింది.
- గ్లోబల్ జనరిక్స్‌కి సంబంధించి కీలకమైన ఉత్తర అమెరికా మార్కెట్లో ఆదాయం 9 శాతం పెరిగి రూ. 3,350 కోట్లకు చేరింది. క్యూ3లో ఉత్తర అమెరికాలో మొత్తం 4 ఉత్పత్తులను కంపెనీ ఆవిష్కరించింది.
- యూరప్ మార్కెట్ 15 శాతం పెరిగి రూ. 500 కోట్లకు చేరింది. సమీక్షాకాలంలో కంపెనీ 6 కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టింది.
- భారత మార్కెట్ విషయానికొస్తే 5 శాతం వృద్ధితో ఆదాయం రూ. 1,180 కోట్లకు పెరిగింది. దేశీయంగా క్యూ3లో 3 కొత్త బ్రాండ్లను సంస్థ ప్రవేశపెట్టింది.

మంగళవారం డాక్టర్ రెడ్డీస్ షేరు స్వల్పంగా పెరిగి రూ. 5,846 వద్ద క్లోజయ్యింది.

రామ్‌రాజ్ కాటన్ బ్రాండ్ అంబాసిడర్‌గా రిషభ్ శెట్టి



చెన్నై: కాంతారా సినిమా నటుడు రిషభ్ శెట్టి ఇక రామ్‌రాజ్ కాటన్ ప్రచార కర్త అవతారమెత్తనున్నారు. ''తన ప్రతిభ తో విభిన్న ప్రేక్షకులను అలరించే సామర్థ్యాలున్న రిషభ్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసుకోవడం సంతోషంగా ఉంది. ఇకపై రామ్‌రాజ్ కంపెనీ తయారు చేస్తున్న ధోతీలు, షర్ట్స్, కుర్తాలకు రిషభ్ ప్రచారం చేస్తారు. దేశీయ మార్కెట్లో రామ్‌రాజ్ బ్రాండ్ ఉనికిని మరింత పటిష్టం చేసే లక్ష్యాల్లో ఇది ఒక భాగం'' అని కంపెనీ ఎండీ అరుణ్ ఈశ్వరన్ తెలిపారు.

ఇంటి వద్దకే ఐకియా ఉత్పత్తులు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కస్టమర్లకు మరింత చేరువ అయ్యేందుకు ఫర్నిచర్ దిగ్గజం ఐకియా తాజాగా 62 కొత్త మార్కెట్లలో ఇంటి వద్దకే డెలివరీ సేవలను విస్తరించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకలో ఈ మార్కెట్లు నెలకొన్నాయని కంపెనీ తెలిపింది. ప్రస్తుతం ఆన్‌లైన్ వేదికగా 25 శాతం విక్రయాలు నమోదవుతున్నాయి. ఫోన్ ద్వారా ఆర్డర్ ఇస్తే సరుకు డెలివరీ చేసేలా ఫిబ్రవరి 1 నుంచి సేవలను ప్రారంభిస్తామని ఐకియా ఇండియా సీఈవో సుసాన్ పల్వర్ తెలిపారు.

పడగొట్టిన రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ

- బజాజ్ ద్వయం, ఐటీసీ షేర్లలో విక్రయాలు
- మార్కెట్లలో 'ఫెడ్ పాలసీ' ముందు అప్రమత్తత
- ఒక శాతం నష్టపోయిన సూచీలు



ముంబై: అధిక వెయిటేజీ రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. క్యూ3 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో బజాజ్ ద్వయం, ఐటీసీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫెడరల్ ద్రవ్య విధాన వైఖరి వెల్లడి(బుధవారం)కి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫలితంగా స్టాక్ సూచీలు మంగళవారం ఒక శాతం పతనమయ్యాయి. సెన్సెక్స్ 802 పాయింట్లు నష్టపోయి 71,140 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 215 పాయింట్లు క్షీణించి 21,522 వద్ద నిలిచింది. ఉదయం స్తబ్దుగా మొదలైన సూచీలు అమ్మకాల ఒత్తిడితో రోజంతా నష్టాల్లో కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 866 పాయింట్లు క్షీణించి 71,076 వద్ద, నిఫ్టీ 236 పాయింట్లు పతనమై 21,502 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, రియల్టీ, మీడియా షేర్లకు మాత్రమే స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు లభించింది. కన్జూమర్ డ్యూరబుల్స్, క్యాపిటల్ గూడ్స్, విద్యుత్, ఎఫ్ఎంసీజీ, యుటిలిటీ, పారిశ్రామిక రంగాల షేర్లలో విక్రయాలు నెలకొన్నాయి. బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ సూచీలు 0.53%, 0.18% చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,971 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1003 కోట్ల షేర్లను కొన్నారు. ఫెడ్ పాలసీ వెల్లడికి ముందు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి.

ఇతర ముఖ్యాంశాలు...

- జీవితకాల గరిష్ట స్థాయి (రూ.2,918) వద్ద రిలయన్స్ షేరులో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. బీఎస్‌ఈలో ఈ షేరు 3% నష్టపోయి రూ.2815 వద్ద స్థిరపడింది. మంగళవారం ట్రేడింగ్‌లో 7% ర్యాలీ చేసింది. మరో అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేర్లలోనూ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో ఈ ప్రైవేట్ రంగ దిగ్గజం దాదాపు 1% నష్టపోయి రూ.1444 వద్ద ముగిసింది.
- క్యూ3 ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడంతో బజాజ్ ఫైనాన్స్ షేరు 5% నష్టపోయి రూ.6,815 వద్ద నిలిచింది. షేరు 5% క్షీణతతో మార్కెట్ విలువ రూ. 22,984 కోట్లు హరించుకుపోయి రూ.4.21 లక్షల కోట్లకు దిగివచ్చింది. బజాజ్ ఫైనాన్స్ పతనంతో ఇదే గ్రూప్ చెందిన బజాజ్ ఫిన్‌సర్వ్ షేరూ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్‌ఈలో ఈ షేరు 3% నష్టపోయి రూ.1591 వద్ద నిలిచింది.
- ఐటీసీ డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ వర్గాల అంచనాలను అందుకోలేకపోవడంతో షేరు 3% నష్టపోయి రూ.438 వద్ద నిలిచింది.
- లిస్టింగ్ రోజే ఈప్యాక్ డ్యూరబుల్ షేరు 10% నష్టపోయింది. ఇష్యూ ధర (రూ.230)తో బీఎస్‌ఈలో 2% డిస్కౌంట్‌తో రూ.225 వద్ద లిస్టయ్యింది. ట్రేడింగ్‌లో 11% పతనమై రూ.206 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 10% నష్టంతో రూ.208 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,990 కోట్లుగా నమోదైంది.
- మార్కెట్ క్యాపిటలైజేషన్ పరంగా టాటా మోటార్స్–డీవీఆర్‌తో కలుపుకొని టాటా మోటార్స్ కంపెనీ మారుతీ సుజుకీని అధిగమించి ఆటో రంగంలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. బుధవారం టాటా మోటార్స్ షేరు 2% పెరిగి రూ.859 వద్ద, టాటా మోటార్స్–డీవీఆర్ షేరు 1.63% లాభపడి రూ.573 వద్ద ముగిశాయి.
- బీఎల్‌ఎస్ ఈ–సర్వీసెస్ ఐపీఓకు తొలిరోజు 15.63 రెట్ల అధిక స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా కంపెనీ 1.37 కోట్ల షేర్లను జారీ చేయగా 21.41 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ కోటా 49.రెట్లు, సంస్థాగతేతర విభాగం 29.66 రెట్లు, క్యూబీఐ కోటా 2.19 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి.

నాలుగేళ్లలో రెట్టింపు ఆదాయం

నూజివీడు సీడ్స్ లక్ష్యం ● కంపెనీకి 50 ఏళ్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎప్పటికప్పుడు ప్రవేశపెడుతున్న కొత్త ఉత్పత్తుల ఊతంతో వచ్చే నాలుగైదేళ్లలో ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవాలని విత్తనాల సంస్థ నూజివీడు సీడ్స్ (ఎన్ఎస్ఎల్) నిర్దేశించుకుంది. ప్రస్తుతం కాటన్ సీడ్స్ మార్కెట్లో దాదాపు 16–17 శాతంగా ఉన్న వాటాను 30 శాతానికి చేర్చుకోవాలని భావిస్తోంది. కంపెనీ నెలకొల్పి 50 ఏళ్లయిన సందర్భంగా మంగళవారమిక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎల్ గ్రూప్ చైర్మన్ ఎం. ప్రభాకరరావు ఈ విషయాలు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో నూజివీడు సీడ్స్ ఆదాయం రూ. 1,100 కోట్లుగా ఉంది.



కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణ కోసం పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలపై గణనీయంగా వెచ్చిస్తున్నట్లు ప్రభాకరరావు తెలిపారు. తమ ఆదాయాల్లో 5 శాతం పైగా కేటాయిస్తున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా 13 ప్రాసెసింగ్ సెంటర్లు, 29 కోల్డ్ స్టోరేజీలు..గిడ్డంగులు ఉన్నట్లు తెలిపారు. 1 లక్ష మంది పైగా రైతుల నుంచి విత్తనాలు సేకరిస్తున్నట్లు, 20 వేల మంది పైచిలుకు రిటైలర్ల ద్వారా దాదాపు 50 లక్షల మంది రైతులకు సేవలు అందిస్తున్నట్లు ప్రభాకరరావు పేర్కొన్నారు. 1973లో మండవ వెంకటరామయ్య ప్రారంభించిన నూజివీడు సీడ్స్‌కి ఒక దశలో కాటన్ సీడ్ మార్కెట్లో మూడో వంతు వాటా దక్కించుకుంది. అప్పట్లో ఏర్పాటైన అనేక విత్తన సంస్థలు కాలక్రమంలో కనుమరుగైనప్పటికీ ఎన్ఎస్ఎల్ పటిష్టంగా నిలదొక్కుకుందని ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ సీవోవో శరద్ ఖురానా, డైరెక్టర్ పి. సతీష్ కుమార్, సీఎఫ్‌వో వి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

జాబ్ పాయింట్

ఆర్ఎఫ్‌సీఎల్‌లో 39 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్), రామగుండం ప్లాంట్.. రెగ్యులర్ ప్రాతిపదికన నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 39
- » **పోస్టుల వివరాలు:** అటెండెంట్ గ్రేడ్1(మెకానికల్)–15,అటెండెంట్ గ్రేడ్1(ఎలక్ట్రికల్)–15, అటెండెంట్ గ్రేడ్1(ఇన్‌స్ట్రుమెంటేషన్)–09.
- » **ట్రేడులు:** ఫిట్టర్, డీజిల్ మెకానిక్, మెకానిక్–హెవీ వెహికల్ రిపేర్ అండ్ మెయింటెనెన్స్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంటేషన్ మెకానిక్.
- » **అర్హత:** మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి. ఐటీఐలో జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- » **వయసు:** 31.01.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **బేసిక్ పే:** నెలకు రూ.21,500 నుంచి రూ. 52,000.
- » **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్(ట్రేడ్)టెస్ట్, మెడికల్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **తెలుగు రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు:** హైదరాబాద్, కరీంనగర్, కర్నూలు, నాగ్‌పూర్, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.02.2024
- » **వెబ్‌సైట్:** www.rfcl.co.in

ఆర్ఆర్‌బీలో 5,696 అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులు

దేశవ్యాప్తంగా రైల్వే శాఖ(రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు) అన్ని రైల్వే రీజియన్లలో అసిస్టెంట్ లోకో పైలట్(ఏఎల్‌పీ) పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 5,696
- » **ఆర్ఆర్‌బీ రీజియన్లు:** అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు,భోపాల్,భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్దా, ముంబై, ముజఫర్‌పూర్, పాట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్,సిలిగురి,తిరువనంతపురం, గోరఖ్‌పూర్.
- » **కేటగిరీ వారీగా పోస్టులు:** యూఆర్–2499, ఎస్సీ–804, ఎస్టీ–482, ఓబీసీ–1351, ఈడబ్ల్యూఎస్–560, ఎక్స్‌ఎస్ఎం–572.
- » **ఆర్ఆర్‌బీ రీజియన్ల వారీగా ఖాళీలు:** అహ్మదాబాద్–238, అజ్మీర్–228, బెంగళూరు–473, భోపాల్–284, భువనేశ్వర్–280, బిలాస్‌పూర్–1316, చండీగఢ్–66, చెన్నై–148, గువాహటి–62, జమ్మూ అండ్ శ్రీనగర్–39, కోల్‌కతా–345, మాల్దా–217, ముంబై–547, ముజఫర్‌పూర్–38, పాట్నా–38, ప్రయాగ్‌రాజ్–286, రాంచీ–153, సికింద్రాబాద్–758, సిలిగురి–67, తిరువనంతపురం–70, గోరఖ్‌పూర్–43.
- » **అర్హత:** అభ్యర్థులు మెట్రిక్యులేషన్‌తోపాటు ఐటీఐ(ఫిట్టర్/ఎలక్ట్రీషియన్ /ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్/మిల్‌రైట్/మెయింటెనెన్స్ మెకానిక్/మెకానిక్–రేడియో అండ్ టీవీ/ఎలక్ట్రానిక్స్ మెకానిక్/మెకానిక్–మోటార్ వెహికల్/వైర్‌మ్యాన్/ట్రాక్టర్ మెకానిక్/ఆర్మేచర్ అండ్ కాయిల్ వైండర్/మెకానిక్–డీజిల్/హీట్ ఇంజిన్ /టర్నర్/మెషినిస్ట్/రిఫ్రిజెరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్) పూర్తిచేసి ఉండాలి. లేదా మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ లేదా ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో మూడేళ్ల డిప్లొమా చేసినవారు అర్హులే.
- » **వయసు:** 01.07.2024 నాటికి 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల సడలింపు ఉంటుంది.
- » **పే స్కేల్:** నెలకు రూ.19,900 నుంచి 63,200.
- » **ఎంపిక విధానం:** ఫస్ట్ స్టేజ్ సీబీటీ–1, సెకండ్ స్టేజ్ సీబీటీ–2, కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **పరీక్ష విధానం:** సీబీటీ–1కు 60 నిమిషాల సమయం ఉంటుంది. మొత్తం 75 ప్రశ్నలకు 75 మార్కులు కేటాయించారు. నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది. మ్యాథ్స్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ సైన్స్, జనరల్ అవేర్‌నెస్ అంశాల్లో ప్రశ్నలు వస్తాయి. సీబీటీ–2లో రెండు విభాగాలు ఉంటాయి. పార్ట్–ఏ విభాగానికి 90 నిమిషాల వ్యవధి, 100 ప్రశ్నలు, పార్ట్–బి విభాగానికి 60 నిమిషాల వ్యవధి, 75 ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. పార్ట్–ఏలో మ్యాథ్స్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, బేసిక్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, పార్ట్–బిలో సంబంధిత ట్రేడ్ సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.02.2024.
- » **దరఖాస్తులో మార్పులకు అవకాశం:** 20.02.2024 నుంచి 29.02.2024 వరకు.
- » **వెబ్‌సైట్:** https://indianrailways.gov.in

» మేనేజ్‌మెంట్ పీజీలో ప్రవేశానికి పలు ఎంట్రన్స్‌లు
» జాతీయ స్థాయిలో క్యాట్, రాష్ట్రంలో ఐసెట్‌కు ప్రాధాన్యం
» ఉమ్మడి ప్రిపరేషన్‌తో మేలంటున్న నిపుణులు

ఎంబీఏకు.. మార్గాలెన్నో!

మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్.. సంక్షిప్తంగా ఎంబీఏ! గ్రాడ్యుయేషన్ స్థాయి అభ్యర్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న కోర్సు. దేశంలోని ప్రముఖ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్స్ ఐఐఎంలతోపాటు రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీలు, కాలేజీలు ఎంబీఏను అందిస్తున్నాయి. ఈ కోర్సును పూర్తి చేసుకుంటే.. కార్పొరేట్ రంగంలో కొలువులు దక్కించుకునే అవకాశం ఉంటుంది. మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు క్యాట్, ఐసెట్‌తోపాటు మరెన్నో ఎంబీఏ ఎంట్రెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. త్వరలో డిగ్రీ కోర్సులు పూర్తి చేసుకోనున్న విద్యార్థులకు ఉపయోగపడేలా ముఖ్యమైన ఎంబీఏ ఎంట్రన్స్ టెస్ట్‌లు, పరీక్ష విధానం, సిలబస్, ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..



ఎంబీఏ అభ్యర్థులు అధికశాతం మంది క్యాట్, ఐసెట్‌లపైనే దృష్టిసారిస్తున్నారు. వీటిలో ఆశించిన ఫలితం రాకుంటే నిరాశకు లోనవుతున్నారు. కానీ.. ఈ పరీక్షల సన్నద్ధతతోనే పలు ఇతర ఎంబీఏ ఎంట్రన్స్ టెస్ట్‌లకు పోటీ పడే అవకాశముంది. వాటిలో మంచి స్కోర్‌తో ప్రముఖ బిజినెస్ స్కూల్స్‌లో మేనేజ్‌మెంట్ పీజీలో ప్రవేశం పొందొచ్చు అంటున్నారు నిపుణులు. మేనేజ్‌మెంట్ పీజీ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్ కోసం క్యాట్, ఐసెట్‌తోపాటు సీమ్యాట్, మ్యాట్, ఎక్స్‌ఏటీ, ఎన్‌మ్యాట్ వంటి ఎన్నో ఎంట్రన్స్ టెస్టులు అందుబాటులో ఉన్నాయి. ఈ ప్రవేశ పరీక్షల సిలబస్ దాదాపు ఒకే విధంగా ఉంటోంది.

కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)

కామన్ అడ్మిషన్ టెస్ట్.. సంక్షిప్తంగా క్యాట్. జాతీయ స్థాయిలో ఐఐఎంలు, ఇతర ప్రముఖ బిస్కూల్స్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. ఎంబీఏ అభ్యర్థుల తొలి గమ్యంగా నిలుస్తోంది క్యాట్. మొత్తం మూడు విభాగాల్లో ఈ పరీక్ష ఉంటుంది. అవి.. వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్; డేటా ఇంటర్‌ప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్; క్వాంటిటేటివ్ ఎబిలిటీ. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ఆబ్జెక్టివ్ విధానంలో, ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించే ఈ పరీక్షకు బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను ఆయా ఐఐఎంలు నిర్దిష్ట కటాఫ్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసి.. తదుపరి దశ(గ్రూప్ డిస్కషన్/పర్సనల్ ఇంటర్వ్యూ)కు ఎంపిక చేస్తాయి. వాటిలోనూ విజయం సాధిస్తే ఐఐఎంలలో ప్రవేశం లభిస్తుంది.

ఐసెట్

ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్..సంక్షిప్తంగా ఐసెట్. ఇది తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు సుపరిచితమైన ఎంబీఏ ప్రవేశ పరీక్ష. తెలంగాణలో టీఎస్ ఐసెట్, ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ ఐసెట్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. వీటిల్లో ఉత్తీర్ణత ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లోని ఎంబీఏ కళాశాలల్లో ప్రవేశం పొందొచ్చు. ఐసెట్‌ను మూడు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. అవి.. అనలిటికల్ ఎబిలిటీ, మ్యాథమెటికల్ ఎబిలిటీ , కమ్యూనికేషన్ ఎబిలిటీ. వీటిల్లో డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్, అర్థమెటిక్ ఎబిలిటీ, అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ, స్టాటిస్టికల్ ఎబిలిటీ, వొకాబ్యులరీ, బిజినెస్ అండ్ కమ్యూనికేషన్ ఎబిలిటీ, ఫంక్షనల్ గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ వంటి ఉప విభాగాలుగా ఉంటాయి. ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్ష జరుగుతుంది. ఈ పరీక్ష వ్యవధి రెండు గంటలు. ఐసెట్‌కు ప్రతి ఏటా ఫిబ్రవరి/మార్చిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. పరీక్ష మే నెలలో నిర్వహిస్తారు. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు.

సీమ్యాట్

దేశంలో ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ తదితర ప్రొఫెషనల్ కోర్సుల నియంత్రణ, పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న సంస్థ.. ఏఐసీటీఈ(ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్). ఈ సంస్థ ఆధ్వర్యంలో జరిగే పరీక్ష..కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(సీమ్యాట్). ఈ పరీక్షలో స్కోర్ ఆధారంగా జాతీయ స్థాయిలో ఏఐసీటీఈ అనుబంధ కళాశాలలు, ఇతర ప్రముఖ బీస్కూల్స్‌లో ఎంబీఏ, పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ తదితర పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఈ పరీక్షను మొత్తం అయిదు విభాగాల్లో 400 మార్కులకు నిర్వహిస్తారు. క్వాంటిటేటివ్ టెక్నిక్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్ 20 ప్రశ్నలు–80 మార్కులు; లాజికల్ రీజనింగ్ 20 ప్రశ్నలు–80 మార్కులు; లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 20 ప్రశ్నలు–80 మార్కులు; జనరల్ అవేర్‌నెస్ 20 ప్రశ్నలు–80 మార్కులు; ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ 20 ప్రశ్నలు–80 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ప్రతి ఏటా ఫిబ్రవరి/మార్చిలో నోటిఫికేషన్ వెలువడుతుంది. మార్చి/ఏప్రిల్‌లో పరీక్ష ఉంటుంది. సీమ్యాట్ స్కోర్ ఆధారంగా ఆయా బీస్కూల్స్ దరఖాస్తులు ఆహ్వానించి.. మలి దశలో గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించి అడ్మిషన్ కల్పిస్తాయి.

మ్యాట్

ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్ష.. మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్). ఏటా నాలుగు సార్లు ఫిబ్రవరి, మే, సెప్టెంబర్, డిసెంబర్‌ల్లో ఈ పరీక్ష జరుగుతుంది. మ్యాట్ స్కోర్ ఆధారంగా ప్రస్తుతం జాతీయ స్థాయిలో ఆరు వందలకు పైగా బిజినెస్ స్కూల్స్ ఎంబీఏ, ఇతర పీజీ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం కల్పిస్తున్నాయి. ఈ పరీక్ష మొత్తం అయిదు విభాగాల్లో(లాంగ్వేజ్ కాంప్రహెన్షన్–40 ప్రశ్నలు;ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్–40ప్రశ్నలు;మ్యాథమెటికల్ స్కిల్స్–40ప్రశ్నలు; డేటా అనాలిసిస్ అండ్ సఫిషియన్సీ–40 ప్రశ్నలు; ఇండియన్ అండ్ గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్–40 ప్రశ్నలు) ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 200 మార్కులు ఉంటాయి.

✦ వెబ్‌సైట్: https://mat.aima.in

ఎక్స్‌ఏటీ

జాతీయ స్థాయిలో పేరున్న పరీక్ష.. ఎక్స్‌ఏటీ. గ్జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ పేరుతో ఎక్స్‌ఎల్ఆర్ఐ–జంషెడ్‌పూర్.. ఈ పరీక్ష నిర్వహిస్తోంది. ఎక్స్‌ఏటీ స్కోర్ ఆధారంగా ఎక్స్‌ఎల్ఆర్ఐ అనుబంధ కళాశాలలే కాకుండా.. జాతీయ స్థాయిలో మరో 150 ఇన్‌స్టిట్యూట్‌ల్లో మేనేజ్‌మెంట్ పీజీ కోర్సుల్లో చేరే వీలుంది. బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులు ఎక్స్‌ఏటీకి దరఖాస్తుకు అర్హులు. చివరి సంవత్సరం విద్యార్థులు సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పరీక్షను అయిదు విభాగాల్లో(డెసిషన్ మేకింగ్, వెర్బల్ అండ్ లాజికల్ ఎబిలిటీ; క్వాంటిటేటివ్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్; జనరల్ నాలెడ్జ్; ఎస్సే రైటింగ్) వంద మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే ఉంటుంది.

✦ వెబ్‌సైట్: https://xatonline.in

ఎన్‌మ్యాట్

జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మరో మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్.. ఎన్‌మ్యాట్(నర్సీమోంజీ మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్). తొలుత ముంబైలోని నర్సీమోంజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో ప్రవేశాలకు ఆ ఇన్‌స్టిట్యూట్ ఎన్‌మ్యాట్‌ను నిర్వహించేది. ప్రస్తుతం జీమ్యాక్ ఆధ్వర్యంలో ఎన్‌మ్యాట్‌ను నిర్వహిస్తున్నారు. ఎన్‌మ్యాట్ స్కోర్ ఆధారంగా భారతదేశంతోపాటు దక్షిణాఫ్రికా, ఫిలిప్పైన్, మొరాకోలలోని ఇన్‌స్టిట్యూట్‌లు కూడా మేనేజ్‌మెంట్ పీజీలో ప్రవేశాలు కల్పిస్తున్నాయి. పరీక్ష మూడు విభాగాల్లో(లాంగ్వేజ్ స్కిల్స్–36 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ స్కిల్స్–36 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్–36 ప్రశ్నలు) జరుగుతుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

✦ వెబ్‌సైట్:https://mba.com/exams/nmat

ఏటీఎంఏ

జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మరో మేనేజ్‌మెంట్ ఎంట్రన్స్ టెస్ట్.. ఏఐఎంఏ. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్ స్కూల్స్.. టెస్ట్ ఫర్ మేనేజ్‌మెంట్ పేరుతో ఈ పరీక్ష నిర్వహిస్తోంది. ఇందులో ఉత్తీర్ణత ద్వారా జాతీయ స్థాయిలో రెండు వందలకుపైగా ప్రముఖ బీస్కూల్స్‌లో ప్రవేశాలకు అర్హత లభిస్తుంది. మొత్తం ఆరు విభాగాల్లో(అనలిటికల్ రీజనింగ్, వెర్బల్ స్కిల్స్, క్వాంటిటేటివ్ స్కిల్స్) పరీక్ష ఉంటుంది. ప్రతి విభాగానికి 30 ప్రశ్నలు చొప్పున మొత్తం 180 ప్రశ్నలకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రతి ఏటా మూడుసార్లు(ఫిబ్రవరి, మే, జూలై) పరీక్ష జరుగుతుంది.

✦ వెబ్‌సైట్: www.atmaaims.com

ఉమ్మడి ప్రిపరేషన్ ఇలా

- ✦ దేశంలోని ఎంబీఏ ఎంట్రన్స్ టెస్ట్‌ల సిలబస్ దాదాపు ఒకే తీరుగా ఉంటోంది. అన్నింటిలోనూ క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, డెసిషన్ మేకింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అంశాలున్నాయి.
- ✦ క్వాంటిటేటివ్ ఎబిలిటీ/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి జామెట్రీ,ఆల్‌జీబ్రా,నెంబర్స్, ప్రాబబిలిటీ తదితర అంశాలపై కాన్సెప్ట్ ఆధారిత ప్రిపరేషన్ సాగించాలి. వాటి ఆధారంగా సమస్యలను సాల్వ్ చేయడం ప్రాక్టీస్ చేయాలి.
- ✦ డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లో రాణించాలంటే.. ఫ్లో చార్ట్‌లు, డయాగ్రమ్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను సాధన చేయాలి. ✦ లాజికల్ రీజనింగ్‌లో స్కోర్ కోసం స్టేట్‌మెంట్స్, పజిల్స్ సాధన చేయడం ఉపకరిస్తుంది. అదే విధంగా వెన్ డయాగ్రమ్స్, డిడక్షన్, పజిల్స్, లాజికల్ కనెక్టివిటీ, క్యూబ్స్ వంటి వాటిపై పట్టు సాధించాలి.
- ✦ వెర్బల్ ఎబిలిటీ కోసం విశ్లేషణాత్మక నైపుణ్యం అవసరం. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌తోపాటు వొకాబ్యులరీ నేర్చుకోవాలి. పద ప్రయోగం, వాక్య నిర్మాణ శైలిపై ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.
- ✦ జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్‌లకు సంబంధించి సమకాలీనంగా ప్రాధాన్యం సంతరించుకున్న అంతర్జాతీయ అంశాలపై దృష్టిపెట్టాలి. ముఖ్యంగా ఆర్థిక, వ్యాపార, వాణిజ్య రంగాలకు సంబంధించిన తాజా పరిణామాలపై అవగాహన పెంచుకోవాలి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.